భారతీయ సాహిత్య నిర్మాతలు

# పరవస్తు చిన్నయసూరి

ఆంగ్లమూలం, అనువాదం

బూదరాజు రాధాకృష్ణ

సాహిత్య అకాదెమీ

TL
494.835 092
Su 77 R
Su 77 R

INDIAN INSTITUTE
OF
ADVANCED STUDY
LIBRARY, SHIMLA





# పరవస్తు చిన్నయసూరి

అట్టలోపలివైపున

గౌతమ బుద్ధుని అచ్చు వేసిన శిల్పంలో కనబడేది శుద్ధోదన మహారాజుకు జ్యోతిష్కులు తల్లియైన మహారాణి మాయాదేవి కన్న స్వప్నం గురించి వ్రాసుకుంటున్న వ్యాఖ్య చేస్తూ ఉండిన దృశ్యం. వారికి దిగువ వారి వ్యాఖ్యను నిబద్ధమై లభించే లేఖకుడు కనిపిస్తాడు. భారతదేశంలో లేఖనకళ చిత్రశిల్పంలో దృష్టాంతాలలో ఇదే ప్రాచీనమైనది.

నాగార్జునకొండ క్రీ.శ. 2వ శతాబ్దం.

(జాతీయ పురావస్తు ప్రదర్శనశాల, న్యూఢిల్లీవారి సౌజన్యంతో)

భారతీయ సాహిత్య నిర్మాతలు

# పరవస్తు చిన్నయసూరి

ఆంగ్లమూలం, అనువాదం

బూదరాజు రాధాకృష్ణ

సాహిత్య అకాడెమీ

*Paravastu Chinnaya Suri* - Telugu translation by B. Radhakrishna of his own monograph in English, Sahitya Akademi, 2002. Rs. 25/-

© Sahitya Akademi

First Published : 2002

ISBN : 81-260-1075-4

సాహిత్య అకాదెమీ

రవీంద్ర భవన్, 35, ఫెరోజ్‌షా రోడ్, న్యూఢిల్లీ - 110 001

'స్వాతి' మందిర్ మార్గ్, న్యూఢిల్లీ - 110 001

జీవన్‌తార భవనము, 4వ అంతస్తు, 23A/44X,
డైమండ్ హార్బర్ రోడ్, కోల్‌కటా - 700 053

సి.ఐ.టి. క్యాంపస్, టి.టి.టి.ఐ. పోస్టు
తరమణి, చెన్నై - 600 113.

సెంట్రల్ కాలేజీ క్యాంపస్,
డా. బి.ఆర్. అంబేద్కర్ వీధి, బెంగళూరు - 560 001

172, ముంబయి మరాఠి గ్రంథ సంగ్రహాలయ మార్గ్,
దాదర్, ముంబాయి - 400 014

వెల : రూ. 25

TL
494.835 092
S2177R

117696
20/12/04
SHIMLA

Typeset by Omega Lasertech, Bangalore and printed at Liberty Enterprises, Bangalore

Library IIAS, Shimla
TL 494.835 092 Su 77 R
00117696

అంకితం

# కీర్తిశేషుడు బండి గోపాలరెడ్డికి (బంగోరెకు)

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | జీవితం | 9 |
| 2. | సమకాలిక పరిస్థితులు | 19 |
| 3. | రచనలు, సాహితీ కృషి | 26 |
| 4. | వాద వివాదాలు, ప్రతిస్పందనలు | 48 |
| 5. | సూరి సాహితీ సేవ | 58 |
| 6. | ప్రధానాధార గ్రంథాలు | 63 |

# 1. జీవితం

అది క్రీస్తుశకం 19వ శతాబ్దం. స్థలం మదరాసు (చెన్నై) నగరం. అక్కడ పరమాద్భుత విజయాలు సాధించిన ఒక వ్యక్తి నివసించేవాడు. పదహారు సంవత్సరాలు వయసు నిండే దాకా అతడికి అక్షర జ్ఞానం లేదు. కానీ ముప్ఫై యేళ్ళ వయసులోనే విద్వాంసుడనే గుర్తింపు సాధించాడు. ఆయన జీవించింది అర్ధ శతాబ్దం కన్నా కొన్ని సంవత్సరాలు మాత్రం. అందులో మూడొంతు కాలం పైగా పాఠశాలల్లో, కళాశాలల్లో తెలుగు బోధించటంలో గడిచి పోయింది. చిన్నా చితకా రచనలు గాక, రెండు మహా రచనలు ప్రచురించాడు. అయితేనేం? తెలుగు సాహితీ ప్రపంచాన్ని ఒక శతాబ్దం కన్నా ఎక్కువ కాలం నిరాఘాటంగా పరిపాలించాడు. ఈ లెక్క కూడా తగ్గించి చెప్పిందే. అతడు తనకు ముందున్న సంప్రదాయాన్ని ధిక్కరించాడు. అయినా కాలగతిని వెనక్కు నడిపించి తనదైన మరో సంప్రదాయాన్ని నెలకొల్పగలిగాడు. భాషా సాహిత్యాలను నిరంకుశంగా పాలించి ప్రతిస్పర్ధులనుంచి తీవ్ర విమర్శలకూ, మరణానంతరం కూడా ఘోర నిందలకూ గురయినాడు. అదే సమయంలో ఆయన విజయాలను కీర్తించి ఆయనను దైవంగా భావించి పూజించే సాహితీపరులను కూడా సంపాదించగలిగాడు. ఆయన పేరు పరవస్తు చిన్నయ. ఆయన పేరు చివరి 'సూరి' శబ్దం కూడా వివాదాస్పదమయింది.

నేటి ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తర ప్రాంతంనుంచి కొన్ని తరాల క్రితం మదరాసుకు వలస పోయిన ఒకానొక వైష్ణవ కుటుంబంలో చిన్నయ జన్మించాడు. ఆయన పూర్వులు పరవస్తు మతానికి చెందినవాళ్ళు. బ్రాహ్మణేతరులైన సాతాని కులానికి చెందిన ఆ కుటుంబంవారు బ్రాహ్మణకులస్థుల పద్ధతులు పాటించారు. తాము యజుశ్శాఖాధ్యాయులమనీ, ఆపస్తంబ

సూత్రులమనీ, గార్గేయ గోత్రం వారమనీ చెప్పుకునేవాళ్ళు. చిన్నయ 1809లో ప్రభవ నామ సంవత్సరంలో జన్మించాడు. అయితే కొందరాయన 1806లోనే పుట్టాడని విశ్వసిస్తున్నారు.

మదరాసు పరిసరాల్లోని తిరువళిక్కేణిలో ఉన్న రామానుజ కూటంలో చిన్నయ తండ్రి వేంకటరంగరామానుజాచార్యులవారు మతాచార్యులుగా ఉండేవారు. ఆయన సంస్కృతప్రాకృతాల్లో తమిళాంధ్రభాషల్లో మంచి పండితు డనిపించుకున్నాడు. నిరాడంబరంగా నిర్మలంగా జీవిస్తున్న ఆయన అగ్రవర్ణానికి చెందిన వైష్ణవ గురువు ప్రతివాదిభయంకరం శ్రీనివాసాచార్యుల వారి దృష్టిలో పడ్డాడు. వైష్ణవ మత ప్రతిష్ఠాపకులైన శ్రీ రామానుజాచార్యులవారి జన్మస్థలం శ్రీ పెరుంబుదూరు. అక్కడి ఆలయంలో ఉండి వైష్ణవ మత ప్రచార ప్రబోధాలు చేయవలసిం దనే శ్రీనివాసాచార్యులవారి కోరిక ప్రకారం చిన్నయ తండ్రి శ్రీ పెరుంబుదూరు చేరి అక్కడే నూటపది సంవత్సరాల (!) సుదీర్ఘ కాలం జీవించాడు. 1836 దాకా ఆయన ద్రావిడ వేద పారాయణం చేస్తూ మతాచారాలు బోధించారు.

వేంకట రంగ రామానుజాచార్యులవారి ఏక పుత్రిక చిన్న వయసులోనే వైధవ్యానికి గురయింది. ఆమెకన్నా చిన్నయ చిన్నవాడు. అందువల్లనేమో అతడు గారాబంగా పెరిగాడు. అలాకాకపోతే పదహారు సంవత్సరాల వయసునిండేదాకా అక్షరజ్ఞానం లేకుండా పెరిగేవాడు కాడేమో. తన చుట్టూ ఉన్న మతాచార పరాయణ జీవన పద్ధతులను గమనిస్తూ ఉండేవాడు. తండ్రి చేసే వేదాంత బోధలు అప్రయత్నంగానే చిన్నయను ఆకర్షించి ఉంటాయి. అయినా అతడు అక్షర జ్ఞానం కోసం వెంపర్లాడినట్లు కనిపించదు. చిన్నయ తండ్రిగారి మిత్రుడొకాయన ఒక శుభ సమయంలో శ్రీ పెరుంబుదూరు విచ్చేసి ఈ ఏకపుత్రుడి సంరక్షణభారాన్ని స్వచ్ఛందంగా తననెత్తిన పెట్టుకున్నాడు. ఆ వ్యక్తి పేరు కంచి రామానుజాచార్యులు. ఆయనే తరవాత చిన్నయకు ప్రథమగురు వైనాడు. అప్పటి పద్ధతుల ప్రకారం చిన్నయ నామలింగానుశాసనమనే అమరకోశాన్నీ, బాలరామాయణాన్నీ, ఆంధ్రనామ సంగ్రహమనే అచ్చ తెలుగు నిఘంటువునూ కంఠస్థం చేశాడు.

మదరాసులోని బ్రిటిషువారి దగ్గర కంచి రామానుజాచార్యులవారికి ఒక విధమైన పలుకుబడి ఉండేది. ఆయన చిన్నయ తండ్రి మదరాసు చేరాలని ప్రోత్సాహించాడు. అక్కడ బ్రాహ్మణేతరోద్యమ నాయకుడూ, వ్యాపారస్థుడూ అయిన గాజుల లక్ష్మీనరసింహం శ్రేష్ఠి అనే పలుకుబడిగల మరోవ్యక్తి ఉండేవాడు. ఈ ఉభయులూ కలిపి సుప్రీం కోర్టులో న్యాయ నిపుణులుగా పనిచేసే అవకాశం కల్పించేందుకు ఈస్టిండియా కంపెనీ అధికారులను ఒప్పించి చిన్నయ తండ్రికి ఉపాధి కల్పించారు. తండ్రితోబాటు

చిన్నయ మదరాసు చేరుకున్నాడు. అక్కడే తమిళ ప్రాకృత భాషల్లో వ్యాకరణ విద్యలో సంప్రదాయ పద్ధతి విద్యాభ్యాసం కొనసాగించాడు. కంచి రామానుజాచార్యుల దగ్గర తర్క మీమాంసా శాస్త్రాలనూ, శ్రీరామ శాస్త్రుల వద్ద వేద వేదాంతాలనూ అభ్యసించాడు. హయగ్రీవమంత్రోపాసకు డైనాడు. సిద్ధాంత కౌముదినీ, సంస్కృత పంచ కావ్యాలనూ, ఆంధ్రశబ్ద చింతామణి, అథర్వణ కారికావళి, అప్పకవీయాలనూ అధ్యయనం చేశాడు. ఎవరి దగ్గర ఏయే గ్రంథాలను చదువుకున్నాడో స్పష్టంగా తెలియదు. ఇంగ్లీషు కూడా నేర్చుకున్నాడుగానీ, ఎక్కడ ఎలా ఏ స్థాయి దాకా చదివాడో నిరూపించే సాక్ష్యాధారాలు దొరక లేదు. ముప్ఫయి సంవత్సరాలు నిండే సరికి సంప్రదాయ విద్యల్లోను, ఇంగ్లీషులోనూ పండితుడనే గుర్తింపు పొందాడు. ఏదో విధంగా ఈస్టిండియా కంపెనీవారి సద్భావం సంపాదించగలిగాడు.

తండ్రి మరణానంతరం చిన్నయ కఠోర దారిద్ర్య మనుభవించాడని చెప్తారు. ఆప్పన్ మిషన్ స్కూల్లో క్రైస్తవ మతాచార్యులకు తెలుగు బోధించాడుగానీ, ఆయన ఉపాధ్యాయ పదవిని సరిగ్గా ఎప్పుడు పొందాడో తెలియదు. ఆ బడిలో పండిత పరీక్షలకు విద్యార్థులను తయారు చేశాడు. కవి పండిత పోషకుడనే పేరు పెట్టుకున్న స్థానిక న్యాయాధికారి కలువలపల్లి రంగనాథ శాస్త్రికి చిన్నయ పాండిత్యం గురించి తెలిసింది. ఆయన ఇంట్లో చిన్నయ భారతీయాలంకారిక శాస్త్ర సిద్ధాంతాలను గురించి ఆశువుగా అనర్గళంగా గంటల తరబడి మహోపన్యాసం చేసి సభ్యులను పరవశింపచేశాడని చెప్తారు. మదరాసులోని ధార్మిక విద్యాసంస్థ పచ్చియప్ప ట్రస్టుకు ప్రధానాధికారి అయిన కమలేశ్వరపురపు శ్రీనివాస పిళ్ళె అనే మరో పలుకుబడిగల వ్యక్తిని చిన్నయ ఆకర్షించగలిగాడు.

విక్టోరియా మహారాణి పట్టాభిషేకం సందర్భంగా 1837లో తొమ్మిది పద్యాల ప్రస్తుతిని రచించి చిన్నయ వర్ధమాన కవిగా పేరు సంపాదించాడు. అతని దస్తూరీ ముద్దుల మూట గట్టేది. వాగ్ధోరణి ఆకట్టుకొనేది. ఆ చిన్న కృతికి చిన్నయ ''విక్టోరియా చక్రవర్తిని మకుటాభిషేక మహోత్సవ పద్యరత్నములు'' అనే సుదీర్ఘ సంస్కృత సమాసాన్ని పేరుగా పెట్టాడు. ఆయన బ్రిటిషు రాజభక్తి పరిపాలకుల దృష్టినాకర్షించి జీవన సోపానాధిరోహణలో దోహదపడి ఉంటుంది. ఆ పద్యాలు చదివినప్పటినుంచీ ఆయన వెనుతిరిగి చూడవలసిరాలేదు.

ఆ రోజుల్లో ప్రెసిడెన్సీ హైస్కూలు, పచ్చియప్ప హైస్కూలు, క్రిస్టియన్ హైస్కూలు అనే మూడు ఉన్నత పాఠశాలలు మాత్రమే ఉండేవి మదరాసులో. అవి పేరుకు ఉన్నత పాఠశాలలే గానీ విద్యార్థులను మొదటి డిగ్రీ పరీక్షకు సిద్ధం చేసేవి కాబట్టి వాటిని ఇప్పటి కళాశాలలతో పోల్చవచ్చు.

వాటిలో మొదటిది దేశభాషలని పిలిచే ప్రాంతీయ భాషల్లో బ్రిటిషు ఉద్యోగులకు తర్ఫీదు నిచ్చేది. రెండోది హైందవ సంస్థ. తరువాతి కాలంలో జస్టిస్ పార్టీ కార్యకలాపాలకు బ్రాహ్మణేతరోద్యమాలకూ కేంద్రమయింది. మూడోది క్రైస్తవ మిషనరీల మతప్రచారానికి మాత్రమే ఉద్దేశించింది. అందులోనే చిన్నయ తెలుగు ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించాడు. 1844లో శ్రీనివాస పిళ్ళె ధర్మమా అని చిన్నయ అదే ఉద్యోగంలో 1847 దాకా అక్కడ పని చేశాడు. అప్పట్లో ధర్మకర్త జన్మదినోత్సవం నాడే పాఠశాలాదినం జరపటం ఆచారంగా ఉండేది. స్థాపకుణ్ణి ప్రశంసించే కవిపండితులను ఆ సమయంలో సన్మానించే వాళ్ళు సభలు జరిపి.

చిన్నయ ప్రతి సంవత్సరమూ సంస్కృతాంధ్రాల్లో శ్లోకాలూ, పద్యాలూ రాసి చదువుతుండేవాడు. 1845, 1846, 1847 సంవత్సరాల్లో ఆనాటి అగ్రవర్ణ కవి పండితులను కాదని చిన్నయను మూడేళ్ళూ వరసగా సత్కరించారు. ఆ పద్యాలను "పచ్చయప్ప యశోమండన"మనే శీర్షికతో 1950లో ప్రచురించారు. ఆ కాలంలో అగ్రవర్ణాలకు - ముఖ్యంగా బ్రాహ్మణ కులానికి - చెందిన పండితులు అతణ్ణి చిన్నచూపు చూశా రనడానికి అనేకనిదర్శన లున్నాయి. సాంప్రదాయిక శాస్త్రాల్లో అద్వితీయ పాండిత్యం సంపాదించడం ద్వారా తరవాతి కాలంలో చిన్నయ వారికి వాకట్టు చేయటమే గాక, వారిని పరాస్తులను చేశాడనవచ్చు. తనకు జరిగిన అవమానాలను చిన్నయ మౌనంగా సహించాడు. కానీ అతని అంతరాంతరాల్లో ఆ అగౌరవాలు నిలిచి బాధించాయని చెప్పాలి. అది ఎలా ఎక్కడ ఏరూపంలో బయటపడ్డదో తరువాతి ప్రకరణల్లో రేఖామాత్రంగా ప్రస్తావిస్తాం.

1812లో మదరాసు ఫోర్ట్ సెయింట్ జార్జి కళాశాలను స్థాపించారు. బ్రిటిష్ రాజకీయోద్యోగులకు హిందూ ధర్మశాస్త్రాన్ని కూడా బోధించాలనే సంకల్పం ప్రధానంగా ఆ సంస్థ ఉద్భవించింది. పుదూరి సీతారామ శాస్త్రి తెలుగు ఉపాధ్యాయులుగా పని చేసి పదవీ విరమణ చేయగానే ఆ కళాశాలను మూసి వేశారు. దాని స్థానంలో ఈస్టిండియా కంపెనీ వారు 1840లో రాజధాని కళాశాల నెలకొల్పారు. అందులో భారతీయుల కూడా చదువు చెప్పేవారు. యాజమాన్యం పుదూరి సీతారామ శాస్త్రినే ప్రథమాంధ్రోపాధ్యాయుడుగా అందులో పునర్నియమించింది. ఆయన 1847 దాకా అక్కడ పని చేశాడు. ఆ కళాశాల మొదటి ప్రధానాధ్యాపకుడైన ఎ.జె. అర్బుత్‌నాట్ అప్పటి మదరాసు రాష్ట్ర ప్రభుత్వంలో విద్యాశాఖాధికారిగా ఉండేవాడు. సీతారామ శాస్త్రి వారసుడుగా 1847లో చిన్నయ ఆపదవిలో ప్రవేశించి 1857లో మదరాసు విశ్వవిద్యాలయాన్ని స్థాపించేదాకా పదవిలో కొనసాగాడు. ఆకాలంలో మహా విద్వాంసుడనే

పేరు సంపాదించిన పురాణం హయగ్రీవ శాస్త్రితో పోటీ పడి చిన్నయ విజేతగా ఆ పదవి పొందగలిగాడు.

1844లో ఆంధ్ర శబ్దానుశాసనమనే పేరిట చిన్నయ సంస్కృతభాషలో తెలుగు వ్యాకరణ గ్రంథం రాశాడు. తన రచనను తానే అనువదించి పద్యాంధ్ర వ్యాకరణం రాశాడు. తెలుగు గ్రంథం 1840లో వెలువడిందని కొందరు అభిప్రాయ పడ్డారు. కానీ ఈ రెండు తేదీల్లో ఏదో ఒకటి సరికాదని చెప్పాలి. చిన్నయ రాసిన మరో వ్యాకరణ గ్రంథం సంస్కృతంలోని సూత్రాంధ్ర వ్యాకరణం. దాని రచనా కాలంగానీ, ప్రచురణ సమయంగానీ స్పష్టంగా తెలియవు. 1858లో వెలువడిన అతడి సర్వోత్తమ రచన బాల వ్యాకరణానికి పూర్వ పూర్వ రూపాలుగా ఈ గ్రంథాలు వచ్చాయనాలి. అతడి వ్యాకరణ రచనలన్నీ తనకు ముందున్న వారి గ్రంథాలకన్నా తరువాతి కాలంలో వచ్చిన పోటీ పుస్తకాలని చెప్పవచ్చు. ఫోర్ట్ సెయింట్ జార్జి కళాశాలలో మొట్టమొదటి ఆంధ్రోపాధ్యాయుడైన వేదం పట్టాభిరామశాస్త్రి (1760 – 13.9.1820) రాసిన పట్టాభిరామ పండితీయం 1816లో ప్రచురితమై సమకాలిక పండితుల గౌరవాదరాలు సంపాదించింది. దానికి పద్యాంధ్రవ్యాకరణ మనే పేరుంది. పట్టాభిరామ శాస్త్రి 1820లో ఎఫ్.డబ్ల్యు. ఎల్లిసుకు సహాయకుడుగా ఉండి రచించిన ధాతుమాల సుప్రసిద్ధ గ్రంథం. 1837లో రావిపాటి గురుమూర్తి శాస్త్రి, పట్టాభిరామ శాస్త్రి తరువాత అదే పదవిలో ప్రవేశించాడు. ఆయన సి.పి. బ్రౌన్‌తో కలిసి పని చేశాడు. ఆయన రాసిన తెలుగు వ్యాకరణము (1836) పట్టాభిరామ శాస్త్రి రచనకన్నా విస్తృతమే గాక ఆధునికం కూడా. అది బ్రౌన్ ప్రశంస లందుకున్నది. ఈ రెండు గ్రంథాలనూ బోధించిన చిన్నయ వాటికన్నా ప్రశస్తతరమైన రచన చేద్దామనుకొని జాగ్రతగా తన గ్రంథాలను దశలవారీగా ప్రచురించాడు. తన మనసులోని తపనను ఓర్పుగా మలిచి తాను రాయబోయే మరో గ్రంథానికి చిన్నయ క్రమంగా ఆధారాలు సిద్ధం చేసుకున్నాడు.

అప్పట్లో బ్రిటిష్ వారు కూడా పాటించి గౌరవించిన సంప్రదాయమొకటి ఉండేది. రాజధాని కళాశాలలో ఏ శాఖలోనైనా పని చేస్తూ 'మాస్టర్' అనిపించుకున్న ప్రతి వ్యక్తికీ ప్రభుత్వం స్వంత ఖర్చులతో ఒక జత బంగారు కడియాలు చేయించి, దాని మీద 'శాస్త్రి' అనే బిరుదం చెక్కించి బహూకరించేది. తయారీ చెక్కడంపని అంతా లండన్‌లోనే జరిగి ఇక్కడికి దిగుమతి అయ్యేది. వేదం పట్టాభిరామ శాస్త్రి పెట్టు శాస్త్రి గాక, పుట్టు శాస్త్రి కూడా - పేరునూ పదవినీ బిరుదునూ పురస్కరించుకొని నియోగి బ్రాహ్మణుడైన గురుమూర్తి ఇష్టమున్నా లేకపోయినా 'శాస్త్రి' బిరుదాన్ని స్వీకరించక తప్ప లేదు. బ్రాహ్మణేతరుడైన చిన్నయ ఆ పదవిలోకి వచ్చినపుడు 'శాస్త్రి' అనే బిరుదు ధరించటానికి

కొంత సందేహించి ఉంటాడు. అలా జరక్క పోయినా సమకాలిక సాంఘిక పరిస్థితులు అతణ్ణి ఇబ్బందిలో పెట్టి ఉండవచ్చు. కళాశాల ప్రధానాధ్యాపకుడూ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టరూ అయిన ఆర్బత్‌నాట్ చిన్నయ మీది ఆదరాభిమానాలతో తనకు నచ్చిన మరో బిరుదు పెట్టుకొనే అవకాశం కల్పించి ఉండనూవచ్చు. చిన్నయకు ఆయన దగ్గర ఉన్న సామంతం అందుకు తోడ్పడి ఉండవచ్చు. ఆ వివరాలన్నీ తెలియవు గానీ 1848-49నుంచీ చిన్నయ తన పేరు చివర 'సూరి' (పండితుడు) శబ్దాన్ని చేర్చుకోవటం మొదలు పెట్టాడని 1849లో ప్రచురితమైన మదరాసు విశ్వవిద్యాలయం పాలకవర్గం వారు ఇంగ్లీషులో ప్రకటించిన సాంవత్సరిక నివేదిక సాక్ష్యమిస్తున్నది. ఆ నివేదికలోనే చిన్నయ అభిమాని అయిన కోమలేశ్వరపురపు శ్రీనివాస పిళ్ళె (పచ్చయప్ప ధర్మసంస్థకు ప్రధానాధికారి) విశ్వవిద్యాలయ పాలకవర్గ సభ్యుడని పేర్కొనటం గమనించదగ్గ విషయం.

తెలుగు మహాభారతం ఆది పర్వాన్ని ప్రచురించటంలో సి.పి. బ్రౌనుకు సాయపడిన వైయాకరణ రామానుజాచార్యులవారికి 1847లో చిన్నయ సహాయకుడుగా పని చేశాడు. ప్రచురణలో "ప. చిన్నయ' అని మాత్రమే ప్రస్తావించారు. మదరాసు విశ్వవిద్యాలయం వారి ఉన్నత పాఠశాలలో సహాయకాంధ్రోపాధ్యాయుడుగా చిన్నయ 1846లో చేరాడని మదరాసు విశేషాలు (ఆల్మనక్) ప్రకటించింది. ఆ సంస్థలోనే 1847-48లో తెలుగు సూపరింటెండెంటుగా వ్యవహరిస్తున్నప్పుడు కూడా అతణ్ణి చిన్నయ అనే ప్రస్తావించారు. ఈ సమాచారం అంతటికీ లిఖిత సాక్ష్యాలున్నాయి. అందువల్ల 1848-49లో చిన్నయ 'సూరి' అయినాడని నిష్కర్షగా చెప్పవచ్చు. చిన్నయ అభిమానుల్లో తరవాతి కాలంలో ప్రముఖుడైన దువ్వూరి వేంకటరమణ శాస్త్రి మదరాసు ప్రభుత్వం చిన్నయకు ఆ బిరుదమిచ్చిందని రాశాడుగాని, సాక్ష్యాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. చిన్నయ వ్యాఖ్యాతల్లో శత్రుత్వం ప్రదర్శించిన కల్లూరి వేంకటరామ శాస్త్రి తన గుప్తార్థ ప్రకాశికలో ఆయన పేరునూ బిరుదునూ 'చిన్న ఆసూరి' అని విభజించి, చిన్నయ వ్యాకరణం ప్రకారమే యడాగమం వచ్చి 'చిన్నయసూరి' అనే రూపం ఏర్పడ్డదని ఆక్షేపించాడు. ఆయనకు ఎంత ద్వేషభావం కలిగిందో ఈ అర్థరహిత వివరణే సూచిస్తుంది.

నీతి చంద్రికను 1853లో ప్రచురించగానే చిన్నయసూరి పేరు పెన్నమోసింది. ఆ వచన గ్రంథం మహత్తర సాహితీ గౌరవం సంపాదించింది. వాణీ దర్పణ ముద్రాక్షరశాల అనే సొంత ముద్రణాలయం ద్వారా ప్రచురించినందువల్ల ఆ నాటికి ఆయన ఆర్థిక పరిస్థితి ఉన్నతదశలో ఉందని విశ్వసించవచ్చు. తన కళాశాల ప్రధానాధ్యాపకులూ, విద్యాశాఖ డైరెక్టరూ అయిన ఆర్బత్‌నాట్‌కు అంకితం చేశాడా రచనను. తనకన్నా ముందు అలాంటి గ్రంథాలు రచించిన వారికన్నా వాటిని బోధించిన తన రచన మేలుగా ఉండాలనే చిన్నయ

ప్రయత్నపూర్వకంగా శ్రమించాడని చెప్పవచ్చు. ఉదాహరణకు రావిపాటి గురుమూర్తి శాస్త్రి 1770 ప్రాంతాల్లో రాసి 1834లో ప్రచురించిన పంచతంత్ర కథలు చాలాకాలం పఠనపాఠనాల్లో ఉంది. చిన్నయసూరి దాన్ని స్వయంగా బోధించాడు. చిన్నయసూరి గ్రంథం సంస్కృతంలోని హితోపదేశ పంచతంత్రాలు ఆధారంగా రాసిందే గాని, వాటిని మిత్రలాభ, మిత్రభేద, సంధి, విగ్రహాలనే నాలుగు భాగాలుగా మాత్రమే విభజించాడు. అయితే మొదటి రెండు తంత్రాలను మాత్రమే రాసి వాటిని పాఠ్యగ్రంథాలుగా ఆమోదింపజేశాడు. ఆరెండూ ఈనాటికీ ఉన్నత పాఠశాలల్లో నిర్బంధ పాఠ్యగ్రంథాలుగా కొనసాగుతున్నాయంటే వాటి ప్రభావం ఎంతో అంచనా వేయవచ్చు. పాతకాలపు కవితాభాషను చాలా వరకు పోలిన నూతన వచన రచనా సంప్రదాయాన్ని అతడు సృష్టించాడు. తరవాతి ప్రకరణంలో ఆ గ్రంథాల గుణ పరీక్ష చేద్దాం. ఆ సంవత్సరమే చిన్నయ శబ్దలక్షణ సంగ్రహమనే వ్యాకరణ గ్రంథాన్ని ప్రచురించాడు.

1855లో సూరి నూరు నీతి పద్యాల సంకలనాన్ని తెలుగులో ప్రచురించి వాటిలో తన పద్యాలు కొన్నిటిని చేర్చాడు. ఆ పుస్తకం పేరు నీతి సంగ్రహము. లిపి లక్షణాలను చర్చించే అక్షర గుచ్ఛమనే గ్రంథాన్నీ నన్నయ కృతి అని సంప్రదాయ పండితులు విశ్వసించే ఆంధ్రశబ్ద చింతామణి కొక వ్యాఖ్యానాన్నీ ఆయన రాశారంటారు. ఆయన సూత్రాంధ్ర వ్యాకరణ విషయంలో లాగానే ఈ గ్రంథాల రచనా కాలమూ స్పష్టంగా తెలియదు. 1858లో తన సర్వోత్తమ వ్యాకరణ గ్రంథం బాల వ్యాకరణాన్ని ప్రచురించే దాకా చిన్నయ సూరి తెలుగు భాషకు వ్యాకరణ గ్రంథాలు రాస్తూ వాటిని సరిదిద్దుకుంటూ ప్రధాన రచనను సాధ్యమయినంత సమగ్రంగా సమకూర్చటానికి అనేక పద్ధతులను పాటించి ప్రయోగాలు చేస్తుండేవాడని భావించటం సమంజసం.

చిన్నయసూరి జీవితంలో 1858 అత్యంత ప్రధానమైన సమయం. బాల వ్యాకరణమే ఆయనకు మహత్తర ప్రతిష్ఠను సంపాదించింది. ఆయన సిద్ధాంతాలనూ, ప్రయోగాలనూ బహుధా పరీక్షించి విమర్శించే అవకాశాన్ని ఆ గ్రంథమే ప్రసాదించింది. అదే సాహితీ క్షేత్రంలో వ్యాకరణ శాస్త్ర రంగంలో ఆయనకు తిరుగులేని ఆధిపత్యాన్ని తప్పుగానో ఒప్పుగానో కల్పించింది. నిన్న మొన్నటి దాకా అతడు రాసిన వ్యాకరణ సూత్రాలు వేదసూత్రాల్లా ప్రామాణ్యం సంపాదించాయి. ఈ వ్యాకరణ గ్రంథమే మదరాసు రాష్ట్రం మొత్తంలో తెలుగు వాళ్ళున్న అన్ని ప్రాంతాల్లో విద్యారంగంలో ద్విభాషా పరిస్థితి (diglossic situation) ఏర్పడి విస్తరించటానికి ప్రధాన హేతువు. ఈ గ్రంథం ప్రచురితమైన మరుక్షణంనుంచీ అన్ని స్థాయుల, అన్ని రకాల విద్యాస్తరాల, వయోభేదాలున్న విద్యార్థులకూ నిర్బంధ పాఠ్యగ్రంథమై పోయింది. విద్యావిధాన

నిర్ణేతలమీద, ప్రభుత్వంమీద ఇది తిరుగులేని ప్రభావం ప్రసరించింది. సంప్రదాయ పండితులూ, సమకాలిక పద్య కావ్య రచయితలూ ఈ గ్రంథాన్ని సమంగా అభిమానించి గౌరవించారు. చిన్నయ నిర్ణయించిన భాషా రూపంలో శైలిలో తప్ప మరోవిధంగా రాయగూడదనే భావముద్భవించింది. తొలి సారిగా ముద్రణభాగ్యం పొందిన ప్రాచీన కావ్యాలూ, గ్రంథాలూ చిన్నయసూరి సూత్రాల కనుగుణంగా దిద్దుబాట్లు పొందాయి. చరిత్రగతి స్తంభించి పోయింది. నవకల్పనలు అసాధ్యమై పోయాయి. భాషకు సంబంధించిన సమస్త వ్యవహారాలూ అతని అధికారానికి లోబడి నిస్తేజమైనాయి.

లార్డ్ మెయిన్ రాసిన మూలగ్రంథాన్ని అనుసరించి థామస్ లుమిసిడస్ స్ట్రేంజ్ రాసిన 'Manual of Hindu Law' అనే రచనను చిన్నయసూరి అదే సంవత్సరం తెలుగు చేశాడు. అనువాదంలో పాటించిన భాషాశైలి విధానాలన్నీ ఇంచుమించు నీతిచంద్రిక రచనలో లాగానే ఉన్నాయి. బ్రిటిష్ అధికారుల నాగ్రంథం క్షణాలమీద ఆకట్టుకొంది. అది కారణంగా 1863లోనూ చిన్నయ మరణానంతరం 1869లోనూ అది రెండు సార్లు పునర్ముద్రితమయింది. దానికి హిందూధర్మ శాస్త్ర సంగ్రహమని పేరు పెట్టాడు. అనువాద కార్యక్రమంలో నరహరి గోపాలకృష్ణమ సెట్టి చిన్నయసూరికి తోడ్పడ్డాడు. ఈ పని కూడా అగ్రవర్ణానికి చెందిన వట్టం వాసుదేవ పరబ్రహ్మ శాస్త్రి తనకన్నా ఏడు సంవత్సరాలు ముందుగా ప్రచురించిన వ్యవహారదర్పణము (భూపాలీయము) అనే రచనకు పోటీగా రాసిందే. అది కావ్య/గ్రాంథిక భాషా మర్యాదలకూ చిన్నయ సూరి సూత్రించిన వ్యాకరణానికీ విరుద్ధమైన భాషలో ఉంది. దానికి మూలం జాన్ ఫ్రేయర్‌థామ్ రచన.

మదరాసు విశ్వవిద్యాలయంలో ప్రథమాంధ్ర ప్రధాన పండితుడుగా 1857లో పదవి స్వీకరించిన చిన్నయ 1861 డిసెంబరులో పదవీ విరమణ చేసే దాకా కొనసాగాడు. 1865 ప్రాంతాల్లో సుప్రసిద్ధ సంస్కృత భాషా నిఘంటువు విశ్వకోశానికి చిన్నయ వివరణము రాశాడంటారు. అంతకు ముందే 1860లో సంస్కృతంలోని శబ్దమంజరిని పోలిన విభక్తి బోధిని అనే తెలుగు పుస్తకం వెలువరించా డంటారు. ఆయన చేతి రాతలో ఏడు సంపుటాల తెలుగు నిఘంటువును సిద్ధం చేశాడనీ, వాటిలోని మొదటి సంపుటాన్ని ముత్యాలకోవవంటి సొంత దస్తూరితో రాశాడనీ తెలుస్తుంది. అంత పెద్ద కార్యాన్ని ఎప్పుడు మొదలు పెట్టి ఎంతకాలం తీసుకొని తయారు చేశాడో తెలియదు. ఈ నాటికీ ఆలిఖితప్రతి ముద్రితం కాలేదు. కానీ అది సూర్యరాయాంధ్ర నిఘంటు కారుల కుపయోగపడింది తరునాతి కాలంలో. కాకినాడలోని ఆంధ్రసాహిత్య పరిషత్తువారి అధీనంలో ఉంది.

పదవీ విరమణ చేసిన తరవాత కొద్ది కాలానికి చిన్నయసూరిని ఆవహించిన రాచపుండు 1862 జనవరి నాటికి ఆయనను బలితీసుకుంది. తొట్టతొలిసారి ఉద్యోగంలో చేరేముందు చిన్నయ సి.పి. బ్రౌనుకు దశావతార గ్రంథ సంపాదనలోనూ ప్రాచీన కావ్యం రామాభ్యుదయం రాత ప్రతిలో కొంత భాగాన్ని సేకరించటంలోనూ తోడ్పడ్డాడు. ఆయన 1842 అక్టోబరు 22వ తేదీన వర్తమాన తరంగిణి అనే పత్రిక సంపాదకుడికి రాసిన ఒకానొక లేఖ ప్రతి ఇప్పుడు దొరికింది. అందులో ఆయన ఒక పద్యార్థాన్నీ ప్రయోగవైచిత్రినీ నిర్ణయించటంలోనూ సాయపడవలసిందని పండితలోకాన్ని అర్థించాడు. ఆ ఉత్తరం గ్రాంథిక భాషా సమకాలీన వచన భాషల కలగలుపుగా ఉండటం చిత్రమనిపిస్తుంది.

తండ్రి మరణం తరువాత ఏ కొద్ది కాలమో తప్ప మొత్తంమీద చిన్నయసూరి జీవితం ప్రశాంతంగా, ఏ రకమైన బాధలూ లేకుండా సాగిపోయింది. సమకాలిక పండిత లోకంతో శత్రుత్వ మిత్రత్వా లాయన కున్నవనటానికి తగినన్ని సాక్ష్యాధారాలు కూడా లేవు. ఆయన సమకాలంలో సామాజిక భాషా సమస్యలను చర్చించిన విద్వాంసు లెవరూ ఆయనను స్మరించలేదు. చిన్నయకూడా ఆ గొడవలు పట్టించుకున్న దాఖలాలూ లేవు. తన చదువేమో రచనలేమో తప్ప మరేమీ పట్టని అంతర్ముఖు డనిపిస్తాడు. జీవిత కాలంలో ఎటువంటి సాహిత్య చర్చల్లోగాని, భాషాగోష్ఠుల్లోగానీ ఆయన పాలుపంచుకున్నట్లు కనిపించదు. సమాజంలో ఆయన అందుకొన్న ఉన్నత స్థాయిని ఆక్షేపించే తెలుగు పద్య భాగాలు లభిస్తున్నాయిగాని, వాటినాయన ఖాతరు చేసినట్లూ కనిపించదు. ఆనాటి అగ్రవర్ణ కవి పండితుల ప్రసంగాల్లో "సాలెజాంద్ర సభా మధ్యే, సాతానిః పండితోత్తమః" అనే సంస్కృత శ్లోకభాగం వినిపించేది. తనలాగానే చిన్న కులాలకు చెందిన జనం మధ్య చిన్నయ పండితోత్తముడుగా వెలుగుతున్నాడనే ఆక్షేపమది. ఈర్ష్యాపరుడైన ఏ అగ్రవర్ణ పండితుడో ఈ శ్లోకాన్ని రాసి ఉంటాడు – అజ్ఞాత రచయితగా. చిన్నయసూరి వ్యక్తిత్వాన్ని గురించి ఇప్పటికి తెలిసినంతలో ఆయన ఇటువంటి అధిక్షేపాలనూ లక్ష్యపెట్టనూ లేదు. తీవ్రవిమర్శకు జంకినట్లూ లేదు. తన పనేదో తాను చూసుకున్నాడు. తన చదువుసంధ్యలూ రచనలూ తప్ప మరేవీ ఆయనకు పట్టలేదు. చివరికి ఆయన ఫోటో కూడా దొరకలేదు. కొన్ని దశాబ్దాల కిందట చిన్నయసూరి చిత్రమని ఆయన గ్రంథం అట్టమీద ప్రచురిస్తే అది చివరికి దేవరాజ సుధీమణి అనే బిరుదున్న తంజనగరం తేవప్పెరు మాళ్లయ్యదని తేలింది!

మొత్తం మీద చిన్నయసూరి నిర్మల ప్రశాంత జీవితం గడిపాడు. కేవలం 53 సంవత్సరాల జీవితంలో తెలుగు విద్వల్లోకం మీద చెరగని ముద్రవేశాడు. ఆయన

పాండిత్యాన్ని ఆయన గర్భ శత్రువులు కూడా శంకించలేదు. బ్రాహ్మణేతర కులాల్లో కూడా మహా విద్వాంసులున్నారనీ, ఉంటారనీ నిరూపించటం లక్ష్యంగా పెట్టుకోవడం వల్ల ఛాందసత్వం ఒంటపట్టించుకున్నాడేమో కానీ తన లక్ష్యాన్ని ఆయన సాధించాడనే చెప్పాలి. అయినా ఒక వైరుధ్యం కనిపిస్తుంది. సమకాలికుడైన అగ్రవర్ణ పండితు లాయనను గౌరవించలేదు. ఆసమయంలో బ్రాహ్మణేతరులూ, బ్రిటిష్ పాలకులూ చిన్నయను విపరీతంగా అభిమానించి ఆదరించారు. అయితే తెలుగులో పాండిత్యం సంపాదించిన బ్రిటిష్‌వారెవరూ చిన్నయను లక్ష్య పెట్టనే లేదు. కాలగతిలో ఆయన రచనలనూ, సిద్ధాంతాలనూ నెత్తిన పెట్టుకొని మోయటం బ్రాహ్మణుల పాలయింది – వాళ్ళు కవులయినా పండితులయినా. చిన్నయ సమకాలికులైన బ్రాహ్మణేతర కవిపండితులు కూడా భాషా విషయకంగా ఆయన సిద్ధాంతాలనూ, సూత్రాలనూ సమర్థించలేదు కానీ అప్పటి ఉపాధ్యాయులూ, పాలకవర్గమూ మెచ్చుకున్నట్లు తెలుస్తుంది. ఆయన విజయాల్లాగానే అపజయాలుకూడా ప్రభావశీల మైనవే. ప్రచండమైనవే. తరవాతి ప్రకరణంలో మదరాసులోనూ, ఇతరత్రా నాటి సాహితీ వాతావరణం ఎలావుండేదో చర్చిద్దాం – ఆంధ్రభాషా సాహిత్య చరిత్రల్లో చిన్నయసూరి స్థానాన్ని నిష్పాక్షికంగా నిరూపించటానికి. ఆయన శిష్యుల్లోనే కొందరు వెన్నుపోటు పొడిచారనో మోసగించారనో అంటారు.

అంత మహోన్నత వ్యక్తిత్వానికి అలా జరిగింది!

# 2. సమకాలిక పరిస్థితులు

పందొమ్మిదో శతాబ్దంలో మదరాసులో జీవించిన చిన్నయసూరి ఈస్టిండియా కంపెనీనుంచి బ్రిటిష్ ప్రభుత్వానికి అధికారం బదిలీ కావటాన్ని చూశాడు. 1639లోనే మదరాసు సెయింట్ జార్జి కోటను కట్టారుగానీ అప్పటికి భారత దేశమంతా ఇంగ్లీషువారి అధీనంలోకి రాలేదు. భారత భూభాగం మీద తమ ఆధిపత్యాన్ని బలపరుచుకోవటానికి కంపెనీవారు త్రిముఖ రాజకీయ విధానం అమలు చేశారు. వ్యాపారం, బేరసారాలు, నచ్చుజెప్పటం అనే మార్గాల ద్వారా భారతీయ రాజ్యాలను ఒక్కొక్కటిగా కబళింప జూశారు. ఆ పద్ధతి కార్యసాధనకు పనికి రానప్పుడు చాణక్య నీతి ద్వారా రకరకాలుగా రాజుల మధ్య విభేదాలు కల్పించి ద్వేషభావాలు రెచ్చగొట్టారు. మూడో విధానంగా తమ ఉద్యోగులకు భారతీయ సామాజిక విద్యా పద్ధతుల్లో శిక్షణ ఇచ్చారు. తరవాత భారత ప్రజలకు ఇంగ్లీషు మాధ్యమం ద్వారా పాశ్చాత్య సంస్కృతిని అలవర్చారు. ఆ మూడో మార్గాన్ని ప్రణాళికా బద్ధంగా పాటించి 1720 నుంచీ క్రైస్తవ సాహిత్యం సృష్టించి ప్రచురించి ప్రచారం చేశారు.

కలకత్తాకు దగ్గరలో ఉన్న సిరాంపూర్‌లో మొదలైన ముద్రణ విధానం 1806 నాటికి మదరాసు నగరంలో తలయెత్తింది. 1813లో చర్చి మిషనరీ సొసైటీ స్థాపితమయింది. 'ఛార్టర్ ఆక్ట్' అమల్లోకి వచ్చింది. ఆ యేడే కంపెనీవారు ఫోర్ట్ సెయింట్ జార్జి పాఠశాలను నెలకొల్పారు. 1837 నాటి విక్టోరియా రాణి పట్టాభిషేకం ఈ ప్రయత్నాలను త్వరితం చేసింది. నేటి ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నంలోనూ మదరాసు నగరంలోనూ పాఠశాలలు ఏర్పడ్డాయి. ఆ సంస్థలు క్రమంగా క్రమబద్ధంగా దేశీయ భావనలమీద తమ

ప్రభావం చూపటం మొదలు పెట్టాయి. సిపాయిల తిరుగుబాటు అనే అప్రశస్త నామధేయంగల ప్రథమ స్వాతంత్ర్య సమరం విఫలమైన 1857లోనే మదరాసు విశ్వవిద్యాలయాన్ని స్థాపించటంతో ఈ ప్రయత్నాలకు ఒకరూపమేర్పడింది. బహుభాషా ప్రాంతమూ, భిన్న జాతుల నివాస స్థలమూ అయిన మదరాసు నగరంలో ఈ మార్పులు వస్తున్న సమయంలో చిన్నయసూరి జన్మించాడు. వైష్ణవుడు కాబట్టి అతడి మత భాష తమిళం. అతడి మాతృభాష తెలుగు. బోధన శిక్షణలవల్ల సంస్కృత భాషనూ కొంతవరకు ప్రాకృత భాషలనూ నేర్చుకోవలసి వచ్చింది. అవసరాన్ని పురస్కరించుకొని ఇంగ్లీషుభాష అభ్యసించినందువల్ల సామాజిక రంగంలో ఉన్నత స్థితికి చేరుకోవడానికి తోడ్పడింది. క్రైస్తవులూ, మతం మార్చుకొని క్రైస్తవులయిన వాళ్ళూ పరిపాలకులనుంచి అన్ని విధాలా సహాయసంపదలు పొందినా బ్రిటిష్ విద్యావిధానం అగ్రవర్ణాలనూ, తక్కువ కులాలనూ సమదృష్టిలోనే చూసింది. హిందూ సమాజంలో ఎంత తక్కువ స్థాయిలో ఉంటే బ్రిటిషువాళ్ళు అంత ఎక్కువగా తోడ్పడ్డారు. ఈరహస్యాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకొన్న చిన్నయ ఈమార్గాన్ని స్వప్రయోజన సాధనకు వినియోగించుకున్నాడు.

మొట్టమొదటి సారిగా పాశ్చాత్య భావనల, సిద్ధాంతాల, ఆదర్శాల, సంస్కృతి విశేషాల ప్రభావానికి లోబడిన భారతీయ సమాజం ఆలోచనా విధానాలూ విద్యాపరిమితులూ అనూహ్యంగా విస్తరించటం మొదలయింది. సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియాగా పదవీ విరమణ చేసిన కర్నల్ కాలిన్ మెకంజీ (1753-1821) వంటి ప్రభుత్వోద్యోగులు సాధారణంగా భారతీయుల, ముఖ్యంగా ఆంధ్రుల, చరిత్ర సంస్కృతుల అధ్యయనానికి కావలసిన లిఖిత సాక్ష్యాధారాల సేకరణలో శ్రద్ధాసక్తులు ప్రదర్శించారు. కావలి వేంకట బొర్రయ్య (1776-1803) సహాయంతో మెకంజీ వేలకొలదిగా తెలుగులోని కైఫీయతులను సేకరించాడు. కొంతవరకు గతచరిత్రను ఆ లిఖితాధారాలు దృష్టికి తెచ్చాయి. 1802నుంచి ప్రభుత్వం దేశభాషల్లో ఉత్తరువులు జారీ చేయటం మొదలు పెట్టింది. క్రైస్తవ మిషనరీలూ ప్రభుత్వోద్యోగులూ దేశభాషలు నేర్చుకొని వ్యాకరణ గ్రంథాలనూ, ద్విభాషా నిఘంటువులనూ ప్రచురించటం మొదలు పెట్టారు. చిన్నయ పాఠశాలోపాధ్యాయు డయ్యేనాటికి ఇలాంటి గ్రంథాలు కొన్ని వెలుపడ్డాయి. కొంత వచన సాహిత్యం ప్రచురితమయింది. విద్యార్థుల, ఉద్యోగుల ప్రయోజనం కోసం అటువంటి సాహిత్య సృష్టికి మంచి ప్రోత్సాహం లభించింది. పఠన పాఠనాల్లో చిన్నయ ఆ నూతన సాహిత్యాన్ని వినియోగించక తప్పలేదు.

పాశ్చాత్యవిద్వాంసులూ సాహితీపరులూ ఆయా శాస్త్రాల్లో రంగప్రవేశం చేసే దాకా భారతీయ దేశభాషల్లోని వ్యాకరణాలు పద్యగ్రంథాలుగా ఉండేవి. వాటికి పాణిని

అష్టాధ్యాయి కాకపోయినా భట్టోజీ సిద్ధాంతకౌముది అయినా ఆదర్శంగా ఉండేది. నిఘంటువులన్నీ పద్యగ్రంథాలే. అవి నామలింగానుశాసన మనే అమరకోశానికి అనువాదాలూ అనుకరణలూ. వచన గ్రంథాల సంఖ్య అల్పాల్పం. మహాకావ్యాలే గాక సమకాలిక రచనలు కూడా చాలా వరకు కాగితాల్లోనో, తాటాకుల మీదనో లిఖితరూపంలో ఉండేవి. అకారాది క్రమంలో ఉన్న నిఘంటువులు లేనే లేవు. దేశభాషలన్నీ సంస్కృతం నుంచి ప్రాకృత భాషల ద్వారా పుట్టినవన్న విశ్వాసం తిరుగులేనిదిగా ఉండేది. చారిత్రక దృష్టితో విషయ పరిశీలన చేయటమనేది ఆ కాలంలో అనూహ్యం. తెలుగు ఫైలాలజీ అనే గ్రంథంలో ఎస్.డబ్ల్యు. ఎల్లిస్ 1816లో మొదటి సారిగా తెలుగు భాష మూల ద్రావిడం నుంచి ఏర్పడి ఉంటుందని ఊహించాడు. పద్యాంధ్ర వ్యాకరణము/పట్టాభిరామ పండితీయ మనే వ్యాకరణగ్రంథం రచించిన వేదం పట్టాభిరామ శాస్త్రి (1760- 13.9.1820) ఫోర్ట్ సెయింట్ జార్జి పాఠశాలలో మొదటి ప్రధానాంధ్రోధ్యాపకుడుగా ఉండి ఎల్లిసుకు ఎంతో సమర్థంగా సాయపడ్డాడు. ఎల్లిస్ ప్రోత్సాహం వల్లనే ఆయన ఆంధ్రధాతుమాలను రచించి తెలుగు క్రియారూపాలను సవిస్తరంగా వివరించాడు. ఆయేడో మరుసటి సంవత్సరమో విలియం కారే (1761-1831) రాసిన తెలుగు వ్యాకరణం వర్ణనాత్మక పద్ధతిలో సిరాంపూర్ నుంచి వెలువడింది. విలియం బ్రౌన్ (1765-1837) రచించిన ఎగ్రామర్ ఆఫ్ ది జెంతూ లాంగ్వేజ్ 1817లో ప్రచురితమై దేశీయ పండితుల మెప్పు కూడా సంపాదించింది. రెండేళ్ళ తరవాత రూపొందినప్పుడు దేశభాషాగ్రంథకరణ సభవారు ఆ వ్యాకరణ రచనను నిర్బంధ పాఠ్యగ్రంథంగా నియమించారు. 1821లో ఎ.డి. కాంబెల్ (1760-1840) రచించిన 'గ్రామర్ ఆఫ్ తెలుగు లాంగ్వేజ్ కామన్లీ టెర్మెడ్ యాజ్ జెంతూ' అనే గ్రంథమూ, దానితోబాటు తెలుగు-ఇంగ్లీషు నిఘంటువూ వెలుగు చూశాయి. వేదం పట్టాభిరామ శాస్త్రీ, చిన్నయసూరి బాల వ్యాకరణానికి రెండేళ్లు ముందు తెలుగు వ్యాకరణం రాసిన ఉదయగిరి శేషయ్యా తనకు గురు స్థానంలో ఉన్నారని కాంబెల్ ప్రశంసించాడు. 1823లో జె.సి. మారిస్ (1798-1858) రాసిన వ్యాకరణమూ, 1840లో సి.పి. బ్రౌన్ (1798-1884) రాసిన వ్యాకరణ గ్రంథమూ వెలుగు చూశాయి. చిన్నయసూరి బాల వ్యాకరణం వెలుపడటానికి ఒక సంవత్సరం ముందే 1857లో బ్రౌన్ వ్యాకరణం ద్వితీయ ముద్రణ పొందినా, దాని ప్రభావం సూరి మీద పడనే లేదు. కాంబెల్‌కు అంకితం చేసిన గురుమూర్తి శాస్త్రి ఉత్తమ తెలుగు వ్యాకరణ గ్రంథం 1836లో ప్రకాశిత మయింది. ఆ శతాబ్దిలో బ్రిటీష్ విద్వాంసులూ సంప్రదాయ పండితులూ తెలుగులో అనేక వ్యాకరణ గ్రంథాలు వెలువరించారు. వాటిలో కొన్నిటినయినా చిన్నయసూరి బోధించక తప్పలేదు. వాటిలో ఏ ఒక్క గ్రంథమూ చిన్నయసూరి మనసు

117696

మీదగానీ, రచనా విధానం మీదగానీ ఏ కొంచెం ప్రభావమూ చూపకపోవటం విశేషం. అయితే అతడు సంప్రదాయ పండితులు మాత్రమే చెప్పిన కొన్ని సూత్రాలనూ, ప్రదర్శించిన కొన్ని ఉదాహరణాలనూ సవరించటంకోసమో, ఖండించటంకోసమో ఉపయోగించక పోలేదు. ఆలోచనలో గానీ, విషయ వివేచనలోగానీ ఏ పాటి ఆధునికత్వాన్నీ ఆయన సంప్రదాయ బుద్ధి సహించలేక పోయింది. తాను తక్కిన అందరికన్నా కరుడుగట్టిన సంప్రదాయవాదిననీ, తనను తొలిదశలో తక్కువ చూపు చూసిన అగ్రవర్ణ పండితులందరికన్నా తానే ఛాందసుడనీ లోకానికి చాటి చెప్పాడు.

బ్రిటిష్‌వారు రంగప్రవేశం చేసే దాకా తెలుగు నిఘంటువులన్నీ పద్యరూపంలోనే ఉండేవి. 1818లో విలియం బ్రౌన్ ప్రచురించిన 'A Vocabulary of Gentoo and English' అనేదే పాశ్చాత్య పండితులు సమకూర్చిన తొట్టతొలి ద్విభాషా నిఘంటువు. మచిలీపట్నం వారయిన మామిడి వెంకయ్య, గుండుమెల్ల పురుషోత్తం అనే యిద్దరు ఆయనకు సాయపడ్డారు. వెంకయ్య శబ్దార్థ నిఘంటువు (1764)నూ, (1816లో రాసి 1848-49లో ప్రచురించిన) ఆంధ్ర దీపికనూ నిర్మించాడు. రెండోది బ్రౌను గ్రంథాన్ని నమూనాగా పెట్టుకొని ఆ పాశ్చాత్య పండితుడు చేసిన నవకల్పనలను ఆచరణలో పెట్టిన నిఘంటువు. ఈ నిఘంటువులు వచనంలో అక్షర క్రమంలో ఉన్నవి. లేఖన సంప్రదాయంలో మాత్రం నిలిచిన అతి ప్రాచీన ధ్వనులను విలియం బ్రౌన్ పరిహరించాడు. పద్యాంధ్ర నిఘంటువుల్లో కనిపించే పదాల సంఖ్యకు మూడురెట్లున్న పదజాలంతో, రమారమి 15,000 ఆరోపాలతో ఎ.డి. కాంబెల్ తెలుగు-ఇంగ్లీషు నిఘంటువు 1824లో వెలువడింది. తెలుగు అధికార భాషా గౌరవం పొందినప్పుడు మరింత ఉపయోగకరంగా ఉంటుందన్న విశ్వాసంతో (!) అతడు ఆరోపాలను రోమన్ లిపిలో సమకూర్చాడు. ఆయనకు రావిపాటి గురుమూర్తి శాస్త్రి సహాయకుడు. ఈ శాస్త్రి సాయంతోనే జె.సి.మారిస్ అనే మరో పాశ్చాత్య విద్వాంసుడు 1835, 1839లలో రెండు సంపుటాలుగా మరో ద్విభాషా నిఘంటువును ప్రచురించాడు. శామ్యూల్ జాన్సన్ ఇంగ్లీషు నిఘంటువు నమూనాలో ఈ నిఘంటువు తయారయింది. ఆ తరువాత 1852లో సి.పి. బ్రౌన్ Little Dictionary తో బాటు 42,369 ప్రధానారోపాలతో అతడి తెలుగు-ఇంగ్లీషు నిఘంటువు అధికారికంగా వెలువడింది. దానికి బ్రౌణ్య నిఘంటువని పేరు. దీని నిర్మాణంలోనూ ఇతర పండితులతోబాటు గురుమూర్తి శాస్త్రి తోడ్పడ్డాడు. సి.పి. బ్రౌన్ 1853లో ఇంగ్లీషు-తెలుగు నిఘంటువును, 1854లో మిశ్ర భాషా నిఘంటువును, 1855లో జిల్లా కోశాన్ని ప్రచురించాడు. మూడోది విల్సన్ కోశానికి అనుబంధంగా ప్రచురితమయింది. నిర్మాణ కాలం కచ్చితంగా చెప్పటం కుదరదుగానీ 1858లో చిన్నయసూరి తెలుగు-తెలుగు నిఘంటువు విశేషరూపం సంతరించుకొంది.

ఆరోపాలను అక్షర క్రమంలో సమకూర్చటం, అర్థాలను వచనంలో ఇవ్వడం తప్ప పూర్వ నిఘంటువులను స్మరించటంగాని, వాటి రచనా ప్రక్రియను అనుసరించటంగాని చిన్నయసూరి నిఘంటువు పాటించలేదు. ఈ నాటికీ చిన్నయ నిఘంటువు ముద్రితం కాలేదు. దాని మొదటి సంపుటం ముత్యాల్లాంటి అక్షరాల్లో చిన్నయసూరి దస్తూరీలో ఉంది. ఆ నిఘంటువు విశేష ప్రతిని కాకినాడలోని ఆంధ్ర సాహిత్య పరిషత్తు గ్రంథాలయంలో భద్రపరిచారు. అందులోని సమాచారాన్ని సూర్యరాయాంధ్ర నిఘంటువనే ఏడు సంపుటాల బృహన్నిఘంటు నిర్మాతలైన పండిత ప్రకాండులు ఉపయోగించుకున్నారు. వారు దర్శించిన రూపంలోనే చిన్నయ నిఘంటువులో శబ్దార్థ నిర్ణయం ఎలా జరిగిందో తెలుస్తుందిగాని, బహిః ప్రపంచానికి మూల గ్రంథంలో ఏముందో ఇప్పటికీ తెలీదు. ఇందులో కూడా చిన్నయసూరి కొన్ని ప్రాచీనాంధ్ర మహా కావ్యాల్లోని శబ్దార్థాలను మాత్రమే స్వీకరించాడుగాని, అర్వాచీన గ్రంథాలనూ సమకాలిక ప్రయోగాలనూ ఆమోదించలేదు. అతడి సంప్రదాయైక దృష్టి విజయం సాధించింది.

తెలుగులోని వచన రచనల సంఖ్య అల్పాల్పం. మహా కావ్యాల్లో అక్కడక్కడ భిన్న పద్యభావాలను అతకడానికీ సుదీర్ఘ సమస్తవాక్యాల్లో వస్తువునో, విషయాన్నో అభివర్ణించటానికీ మాత్రమే వచనం ఉపయోగపడింది. ఇతర విధాల కాదు. అయితే 1520నుంచి విశ్వనాథ స్థానాపతి రాసిన రాయవాచకము వంటి వచన రచనలు క్వాచిత్కంగా వెలుపడుతుండేవి. వీటి రచన సమకాలిక భాషా రూపాలతో శైలితో నడిచింది. ఈ నూతనసంప్రదాయ బ్రిటిషుయుగంలో ప్రౌఢరచనలను వ్యాఖ్యానించటంలో, ప్రభుత్వ ప్రకటనల్లో, ప్రధానంగా పాఠ్యగ్రంథ రచనలో కనిపిస్తుండేది. రావిపాటి గురుమూర్తి శాస్త్రి పంచతంత్రము సమకాలిక వచనశైలిలో సులభంగా సూటిగా ఉన్న తెలుగులో 1834లో ప్రచురితమయింది - రచనాకాలం 1770 అయినా. ఆ గ్రంథం నిర్బంధ పాఠ్యగ్రంథంగా ఉండేది. 1853లో తాను రాసిన నీతిచంద్రిక వెలుగు చూసేదాకా చిన్నయ ఆ గ్రంథాన్నీ విద్యార్థులకు బోధించాడు. సూరి రచన పద ప్రసిద్ధ ధారాశుద్ధితో కావ్యభాషలో సాగింది. అయితే అక్కడక్కడ - ముఖ్యంగా పాత్రల సంభాషణల్లో - చిన్న చిన్న వాక్యాలు కనిపిస్తాయి. చిన్నయ తనదైన అభినవ సాంప్రదాయిక వచనశైలిని రూపొందించాడు. ప్రభుత్వం నెలకొల్పిన దేశ భాషా గ్రంథకరణ సభకు తాను అధ్యక్షుడైన తరవాత తన రచనా విధానానికి అనుగుణంగా లేని మరే గ్రంథమూ పాఠ్యగ్రంథం కాకుండా చూశాడు - నాటి సాహితీస్థాయి ఎంతటి దయినా. ఇక్కడ కూడా ఆయన సమకాలిక ప్రమాణాలను నిరాకరించాడు. జీవద్భాషా విషయంలో కూడా ప్రాచీన సంప్రదాయ విధానాలకే కట్టుబడ్డాడు.

సంస్కృతంలోని భట్ట బాణుడి కాదంబరి వంటి మహోత్తమ రచనలకు అఖండ గౌరవమున్నా, 19వ శతాబ్దిదాకా భారతదేశంలో వచన రచయితలనే వాళ్లు చాలా అరుదుగా ఉండేవాళ్లు. దేశ వ్యాప్తంగా పాఠశాలలనూ, కళాశాలలనూ బ్రిటిషువారు స్థాపించటం మొదలుపెట్టినపుడు వాళ్లు ప్రాంతీయ భాషలను ప్రోత్సాహించటం ఆరంభించారు. బోధన పరిపాలన రంగాల్లో నూతన పద్ధతిలో వచన సాహిత్యస్పష్టికి దారి తీశారు. అప్పుడు సమకాలిక పండిత లోకం ద్విధా విభక్తమయింది. ఒక వర్గం ఆధునిక వచన సాహిత్య నిర్మాణానికి ఉవ్విళ్ళూరింది. రెండోవర్గం ప్రాచీన సంప్రదాయ పరిరక్షణ పేరిట ఈమార్పును శాయశక్తులా ప్రతిఘటించింది. హిందీలోని బ్రజ్ భాషా మాండలికంలో లల్లూజీ (1763-1835) రచించిన హితోపదేశ్ సమకాలికమ్మైన ఆధునిక శైలిలో ఉందిగానీ సంప్రదాయవాదులు దాన్ని ఆమోదించలేదు. ఒకవైపు బెంగాలీలో మృత్యుంజయ్, గుజరాతీలో గోవర్ధన్‌దాస్, మలయాళంలో తంబురాన్ - చిన్నయసూరి లాగానే ప్రాచీన వచన రచనా సంప్రదాయాన్ని పరిరక్షించటానికి నడుం కట్టారు. మరోవైపు బెంగాల్‌లో ఈశ్వరచంద్ర విద్యాసాగర్, అస్సాంలో బారువా, ఒరిస్సాలో ఫకీరా, పంజాబ్‌లో పూరణ్‌సింగ్, మహారాష్ట్రలో మ్హల్హర్ రావ్, గుజరాత్‌లో నల్మల్ శంకర్, కేరళలో రాజరాజవర్మ వంటి ఆధునికులు వచన సాహిత్యాన్ని సులభ భాషలో శైలిలో సృష్టిస్తే అక్షర జ్ఞానాన్ని తేలికగా వ్యాప్తిలోకి తేవచ్చుని, అభిప్రాయ ప్రసారమే దాని ప్రధాన లక్ష్యం కావాలని ఉబలాట పడ్డారు. తెలుగువారిలో కూడా సామినేని ముద్దునరసింహ నాయుడు (19వ శతాబ్దం) తన హిత సూచనిలో (రచనా కాలం 1840; ప్రచురణ 1862) ప్రాచీన పదాలను పరిహరించాలనీ భాషను ఆధునికీకరించాలనీ వాదించాడు. ఈ సంస్కరణ వాదులతో చర్చలకు దిగటానికి కూడా చిన్నయసూరి సిద్ధపడినట్లు లేదు. ఒకానొక తెలుగు పత్రికా సంపాదకుడికి తాను కూడా తననాటి వచన రూపాల్తో తన సిద్ధాంతాలకు వ్యతిరేక మయిన పద్ధతిలో ఉత్తరం రాసినప్పటికీ, అతడు ఏకోన్ముఖంగా నిశ్శబ్దంగా ఆధునికీకరణ ప్రయత్నాలన్నిటినీ వ్యతిరేకించాడు.

ప్రాచీన కావ్యవచన పద్ధతినే పరిరక్షించాలనే చిన్నయసూరి పట్టుదలకు రెండు కారణాలున్నాయని ఊహించవచ్చు. తనను చులకనగా చూసిన అగ్రవర్ణాల విద్వాంసుల ప్రాచీనతా దృష్టిని ఎదుర్కోనేకన్నా వారి మార్గంలోనే వారిని జయించాలనే ప్రేమ-ద్వేష సంకరభావం అందుకొక కారణం కావచ్చు. రెండోది భాషా విషయాల్లో తొలినాటినుంచీ నాటిదాకా సంప్రదాయ బద్ధతనే అభిమానించిన తమిళ ప్రభావం కావచ్చు. అయితే తమిళులకున్న సంస్కృత వ్యతిరేకత చిన్నయసూరిలో కనిపించదు. అప్పటి దాకా భారతీయ భాషలన్నిటికీ సంస్కృతమే మూలమని అందరూ నమ్మేవారు. ఆ విశ్వాసాన్ని ఖండిస్తూ బిషప్ కాల్డ్‌వెల్ (1855-56) ప్రతిపాదించిన ద్రవిడ భాషావాదాన్నీ, మూల ద్రవిడ పునరావిష్కరణాన్నీ అనుసంధించాలనే అభిలాష చిన్నయసూరికి పుట్టలేదు. ద్రవిడ జాతీయలందరినీ విశేషంగా ఆకర్షించిన ఆ నూతన సిద్ధాంతం ఉనికి కూడా

సూరికి తెలియదని నమ్మటం కష్టం. అతడు మాత్రం ఆ సిద్ధాంతాన్ని అంగీకరించలేదు. తమిళం, తెలుగు, సంస్కృతాల్లో తనకెంత పాండిత్యమున్నా తన వ్యాకరణ గ్రంథాల్లో ఆ వాదాన్ని అనుసరించలేదు. అన్ని రకాల భాషా సాహిత్య వివాదాలకూ కనీసం బహిరంగంగానైనా అతడు దూరంగానే ఉన్నాడు. ఎవరితోనూ ఏ వివాదంలోనూ చర్చలోనూ అతడు పాల్గొన్నట్లు తెలియదు. అతడు కేవలం అంతర్ముఖుడు. తన లక్ష్య సాధనకు ఉపకరించే బ్రిటిష్‌వాళ్ళను మాత్రమే ఆయన అనుసరించాడు, అభిమానించాడు, సేవించాడు. అదిన్నీ అధికారంలో ఉండి తన అభిప్రాయాలను పఠనపాఠనాల్లో అమలు పరచగలిగిన అలనాటి విద్యాశాఖా డైరెక్టరూ తన కళాశాల ప్రధానోపాధ్యాయుడూ అయిన ఆర్బత్‌నాట్ వంటి వారిని మాత్రమే. మహాభారతం ఆదిపర్వానికి ప్రామాణిక పాఠం సిద్ధం చేయటంలో అతడు పరోక్షంగా మాత్రం సి.పి.బ్రౌనుకు సహాయకుడుగా పనిచేశాడు. అంతకుమించిన సంబంధాలు పెట్టుకోలేదు. చిన్నయసూరి పరిష్కరించాడని చెప్పే లిఖిత ప్రతి మీద అతడా పని చేశాడని చెప్పదగ్గ చిహ్నాలేమీ లేవు. తరవాతి కాలంలో సూరి ఆరాధకుడైన దువ్వూరి వేంకటరమణ శాస్త్రివంటివారు సూరి సి.పి. బ్రౌనుకు ఉపాధ్యాయుడని చెప్పారుగాని అది నిజం కాదు. సూరిగానీ, బ్రౌనుగానీ అటువంటి ప్రసంగం చేయలేదు. తనకు బోధకులుగా, సహాయకులుగా, అభిమాన పాత్రులుగా ఉన్న వారందరినీ బ్రౌన్ గుర్తు పెట్టుకొని స్మరించాడు. ఆయన స్వదేశానికి 1855లో చేరుకొని అక్కడ 1884 దాకా జీవించాడు. అన్నాళ్లూ ఆయన తన చిన్న చిన్న సందేహాలను తీర్చమని తనకు తోడ్పడ్డ వారందరికీ ఉత్తరాలు రాస్తూనే ఉండేవాడు – తన నిఘంటువును పరిష్కరించి ప్రవర్ధమానం చేసే ప్రయత్నంలో భాగంగా.

చిన్నయ చాలా మొండి పట్టుదల గల మనిషి. తన స్వభావానికి విరుద్ధమయిన ఏ సిద్ధాంతాన్నీ ఆచరణనూ అతడు దరిదాపులకు రానీ లేదు. అతడి పనులన్నీ ఏకోన్ముఖాలు. తన సమకాలికులైన పెద్దల వ్యాకరణ సిద్ధాంతాలనూ, ప్రసంగాలనూ ప్రస్తావించవలసి వచ్చినపుడు కూడా అతడెవరి పేరునూ ఉదాహరించలేదు. తన సొంత శిష్యులను గురించి కూడా తన రచనల్లో ప్రస్తావించలేదు. తాను చేయదలచుకున్నదే చేశాడు. స్వకీయ జీవిత లక్ష్యసాధనలో ఉపకరిస్తారన్న విశ్వాసమున్న వారిని తప్ప అతడెవరినీ లక్ష్య పెట్టలేదు. అందువల్లనే నిఘంటు నిర్మాణంలో పరిశ్రమించిన, వ్యాకరణ గ్రంథ రచనలు చేసిన మరే బ్రిటిష్ విద్వాంసుడితోనూ అతడు ఎలాటి పరిచయమూ అపేక్షించలేదు. ఉత్తర ప్రత్యుత్తరాలు జరపలేదు. పాతకాలపు సంప్రదాయం తప్ప తనచుట్టూ ఉన్న ఏ విషయమూ అతణ్ని ప్రభావితం చేయలేదు. తరవాతి తరాల సాంప్రదాయిక పండిత వర్గాన్ని - ముఖ్యంగా ఇతరులను – కొంతవరకూ తానే ప్రభావితం చేశాడు. ఆధునికత్వాన్ని అతడు కలలో కూడా దర్శించలేదు.

# 3. రచనలు, సాహితీ కృషి

ప్రధాన అప్రధాన భేదాలలో చిన్నయసూరి రచనలను ద్విధా విభజించవచ్చు. మొదట ప్రధాన రచనలను పరిశీలిద్దాం. అవి వ్యాకరణ, నిఘంటు, వచన గ్రంథాలని మూడు రకాలు. హిందూ న్యాయశాస్త్రానికి ఆయన చేసిన అనువాదాన్ని ప్రధాన రచనగా పరిగణించవచ్చు. ఆయన వ్యాకరణ గ్రంథాలు సంస్కృతాంధ్రాలు రెంటిలోనూ ఉన్నాయి. పరస్పర సంబంధం కలవి కాబట్టి వాటిని ఒకటిగానే భావించి కింది పంక్తుల్లో చర్చిద్దాం.

## ఆంధ్రశబ్దాను శాసనము

అది సంస్కృత గ్రంథం. అందులో సంజ్ఞా, సంధి, తత్సమ, ప్రకీర్ణ, క్రియా, తద్భవ పరిచ్ఛేదాలు ఆరున్నాయి. తెలుగు వ్యాకరణ లక్షణాలను క్రోడీకరించటానికి చిన్నయసూరి చేసిన ప్రథమప్రయత్నం మనిపిస్తుంది. కొందరీ గ్రంథం 1844లో ప్రచురితమయిందని విశ్వసిస్తున్నారు. సూరి స్వయంగా దీన్ని తెలుగులోకి పద్యగ్రంథంగా 1840లోనే అనువదించాడని మరి కొందరి నమ్మకం. మూలం కన్నా అనువాదం ముందే వెలువడిందనుకోవటంవల్ల ఈ రెండు రచనా కాలాల మధ్య సమన్వయం కుదరటంలేదు. ఆ రెండు పుస్తకాలూ ప్రచురితమైన కాలం స్పష్టంగా ఎప్పటికీ తెలియక పోవచ్చుగానీ, అవి అతడి ప్రథమ ప్రయత్న ఫలితాలని చెప్పవచ్చు. పరిమాణంలో ప్రాముఖ్యంలో సామాన్యమైన ఆ గ్రంథానికి చివర చిన్నయసూరి ఆత్మస్తుతి రూపంలో రాసిన గద్య మాత్రం అసాధారణ మనిపిస్తుంది. అది ఇలా ఉంది.

"దిగంత విశ్రాంత చిరంతన కీర్తి విరాజమాన, సంస్కృతాది భాషాష్టక లక్ష్య లక్షణ జ్ఞాన మహాపండిత జేగీయమాన, నిరంకుశ నిరర్గళ ఝరీ ధారా లంకృత సంస్కృతాంధ్ర భాషానుశాసన, బహులక్ష్య లక్షణ గ్రంథ ధురీణ, సత్యదర్శన సంగ్రహ కుసుమాంజలీ మహాభాష్య ప్రవచన పారీణ, సాత్తాద శ్రీవైష్ణవ కుల కలశాంబుధి పూర్ణచంద్రేణ, ఆంగ్ల రాజకీయ కళాశాలాంధ్ర పండిత చిన్నయసూరిణా ప్రణీత గీర్వాణ భాషారూపాంధ్ర శబ్దానుశాసన ...... పరిచ్ఛేదః"

మొదటి ప్రశంస ప్రకారం ఆయన కీర్తి ప్రపంచవ్యాప్తం, శాశ్వతం. ఇది పెద్దాచిన్నా అందరూ సర్వసాధారణంగా చెప్పుకొనే అతిశయోక్తి. సంస్కృతంతో సహా ఎనిమిది భాషల్లో వ్యాకరణ సూత్రాలనూ కవి ప్రయోగాదులనూ తెలిసిన పండితులు తనను పొగడుతున్నారనేది రెండో విశేషం. అష్ట భాషా విశారద అనే బిరుదు చాలా మందికుంది. సంస్కృతంతో బాటు ప్రాంతీయ భాషలూ ప్రాకృత భేదాలు కలసి వెరశి ఎనిమిది భాషలని సామాన్యంగా సరిపెట్టుకోవలసి ఉంటుంది. సంస్కృతాంధ్ర వ్యాకరణ మర్యాదా జ్ఞానంలో తనకు తిరుగులేదనేది మూడో ఘనత. ఆ తరవాతిది నమ్మటం కష్టం. ఎందుకంటే తానెన్నో వ్యాకరణ గ్రంథాలు రాశాననేది సంశయాత్మకం. 1809లో పుట్టి పదహారు సంవత్సరాల వయసు నిండేదాకా - అంటే 1925 దాకా - అక్షరజ్ఞానమే లేని వ్యక్తి కేవలం పదిహేను సంవత్సరాల కాలంలో చదివి అనేక గ్రంథాలు రాశాడనటం బడాయిమాట అనిపిస్తుంది. చివరి మాట నిజం కావచ్చు. సర్వదర్శన సంగ్రహాన్ని, కుసుమాంజలిని, (పతంజలి) మహాభాష్యాన్ని అతడు బోధిస్తుండవచ్చు. అయితే ఇలాంటి ప్రసంగాలు చాలావరకు సర్వసామాన్యం. యౌవనారంభ సమయంలో అపరిశీలితంగా ఇటువంటి మాటలనేకులు స్వోత్కర్షకు చెప్పుకున్నారు. వ్యాకరణగ్రంథం మాత్రం అతుకులబొంత. అది అతడి ప్రథమ రచన కాబట్టి అతడి ఆలోచనాధోరణి ఎలా ఉండేదో సూచించటానికి మాత్రం అది ఉపయోగపడుతుంది.

## పద్యాంధ్ర వ్యాకరణము

ఈ రచన అసంపూర్ణం. ఇందులో కేవలం 48 పద్యాలున్నాయి. ఇది పూర్వోక్త రచనకు అనువాదం. క్రీస్తుశకం 13వ శతాబ్ది నాటి కేతన ఆంధ్ర భాషాభూషణమే పద్యాంధ్ర వ్యాకరణ గ్రంథాల్లో మొట్టమొదటిది. అర్ధ భాగాన్ని అనువదించేలోగానే తన ప్రయత్నంలోని అపరిణతిని చిన్నయసూరి గుర్తించివుంటా డనిపిస్తుంది. అందుకే అర్ధాంతరంగా వదిలి పెట్టాడు. తన పూర్వుల రచనలతో తన ప్రయత్నాలు సరితూగవని అతడే గ్రహించి ఉంటాడు.

## సూత్రాంధ్ర వ్యాకరణము

ఇది కూడా సంస్కృత భాషలో ప్రయోగాత్మకంగా రాసిన తెలుగు వ్యాకరణ గ్రంథమే. ఇందులో సూరి పాణిని అష్టాధ్యాయి నిర్మాణ పద్ధతులను పొల్లుపోకుండా పాటించాలని ప్రయత్నించాడు. ఇందులో సంజ్ఞా, సంధి, అజంత, ఆచ్ఛిక, సర్వనామ, కారక, సమాస, తద్ధిత ప్రకరణాలనే ఎనిమిది భాగాలున్నాయి. సూత్రక్రమం అసందర్భంగా, తెలుగు భాషా సహజ లక్షణాలకు నప్పకుండా ఉంది. తత్సమ తద్భవాలను గురించి గానీ, విశేషణావ్యయాదుల గురించిగానీ ఎందుచేతనో చర్చించలేదు. అది పెద్ద లోపం.

ఉదాహరణకు అందులోని కొన్ని సూత్రాలిలా ఉన్నాయి :

క, చ, ట, త, పాః పరుషః (క చ ట త ప లు పరుషాలు)

గ, జ, డ, ద, బా స్సరళాః (గ జ డ ద బ లు సరళాలు)

ఉ భ యే కంపౌ (రేఫ ద్వివిధం - సాధు శకట రేఫలని)

హలః పరే స్థిరాః (ఇతర హల్లులు స్థిరాలు)

ఇలా సాగింది ఆ రచన.

## శబ్ద లక్షణ సంగ్రహము

ఈ రచన 1853లో ప్రచురితమయింది. ఈ తెలుగు రచనను తన శ్రేయోభిలాషి అయిన గాజుల లక్ష్మీ నరసింహ సెట్టికి అంకితం చేశాడు సూరి. పరిచ్ఛేదాంత గద్య ముక్త సరిగా ముచ్చటగా ఉంది:

"ఇది పరవస్తు చిన్నయసూరి కృతంబగు శబ్ద లక్షణ సంగ్రహ నామకాంధ్ర వ్యాకరణమునందు ... పరిచ్ఛేదము".

... గాజుల లక్ష్మీ నారసింహ సెట్టిగారి వలన బహూపకారంబులం బడసిన వాఁడం గావుటం జేసి కృతజ్ఞతాభివ్యంజకముగా నీ గ్రంథంబుఁ దదీయాంకితంబు గావించి నాఁడ

- పరవస్తు చిన్నయ సూరి"

తన ప్రజ్ఞా పాండిత్యాలను ప్రశంసించుకోవటం మాని వేశాడు. ఆలోచనల్లో ఆచరణలో అతడు పరిణతికి వస్తున్నాడనటానికి ఇది పెద్ద నిదర్శనం. పూర్వ రచనలకన్నా ఇది చాలా విస్తృతమైన గ్రంథమేగాని ఇందులో 570 సూత్రాలను అయిదు పరిచ్ఛేదాల్లో అమర్చి చెప్పాడు. ప్రకరణాల సూత్రాల వివరాలు ఇలా ఉన్నాయి:

1. సంజ్ఞా పరిచ్ఛేదము 42 సూత్రాలు
2. సంధి పరిచ్ఛేదము 46 సూత్రాలు
3. శబ్ద పరిచ్ఛేదము 214 సూత్రాలు
4. క్రియా పరిచ్ఛేదము .. 118 సూత్రాలు
5. ప్రకీర్ణ పరిచ్ఛేదము 150 సూత్రాలు

విశేష్య విశేషణ సర్వనామాది శబ్దాలన్నిటినీ ఒకే ప్రకరణంలో చర్చించటమొక విశేషమయితే, వాటిలో తత్సమ తద్భవాచ్ఛిక భేదాలను ఈ సందర్భంలో పరిగణించక పోవటం మరొకటి. సూత్ర పద్ధతిని పాటించి తెలుగు వచనంలో రచించడం రచనా పద్ధతి. కొంత జాగ్రతగా పరిశీలిస్తే నన్నయ కృతమనుకొనే సంస్కృత రచన ఆంధ్రశబ్ద చింతామణికిది అనువాద రూపమా అన్న అనుమానం కలుగుతుంది. ఇప్పటికీ గ్రంథం మొత్తం అలభ్యంగానే ఉంది. ఇతర పండితులు ఉద్ధరించిన, ప్రస్తావించిన ప్రసంగాలనుంచి మాత్రమే దొరికినంత వరకూ అందుబాటులోకి వచ్చింది.

గ్రంథారంభంలో ఆయన రాసిన సంస్కృత శ్లోకమొకటుంది. అది -

"పూర్వేషాం లక్ష్య లక్ష్మాని
వికృతే ర్వీక్ష్య భూరిశః
క్రియతే బాల బోధాయ
శబ్ద లక్షణ సంగ్రహః "

పై శ్లోకంలో చేసిన రెండు ప్రసంగాలు అర్థవంతమైనవి. పూర్వ వ్యాకరణ గ్రంథాలను చిన్నయ పరిశీలించాడని, ప్రయోగాలను విస్తృతంగా (భూరిశః) పరీక్షించాడని మొదటి ప్రసంగం స్పష్టీకరిస్తున్నది. రెండోది బాలబోధకోసమే (గ్రహణధారణ పటుర్బాలః- అనేది శాస్త్ర నిర్వచనం. అర్థం చేసుకొని గుర్తు పెట్టుకో గలిగే వాడే బాలుడు) ఈ గ్రంథ రచన చేశాననటం. పాశ్చాత్య పండితులు నియోగించగా ప్రాచీన కావ్య పాఠ భేదాలను సేకరించి పరిష్కరించి ముద్రించిన లిఖిత ప్రతు లనేకం ఆయనకప్పుడు అందుబాటులో ఉండేవి. తాళపత్ర గ్రంథాలనుంచిగాక ముద్రిత ప్రతులనుంచి ప్రయోగాలను సేకరించటంలో చాలా సౌలభ్యముంది. కాలం కలసి వస్తుంది. ప్రయాస తగ్గుతుంది. చిన్నయసూరి ఈ ప్రయోజనం సాధించాడు. విద్యార్థులకోసం వ్యాకరణ సూత్రాలు రాస్తున్నానన్న రెండో ప్రసంగం విస్పష్టమయింది. అప్పట్లో పండితోపయోగార్థం ఒకమహా వ్యాకరణ గ్రంథ రచన చేయాలన్న సంకల్పం కలిగినట్లు లేదు.

ప్రాచీన కావ్య భాషలో ఉన్నా సూత్రాలు క్లుప్తంగా స్పష్టంగా ఉన్నాయి. ఉదాహరణకు,

''సిద్ధి లోకంబు వలనఁ దెలియనగు'' (సిద్ధి ర్లోకా ద్దృశ్యా)
''శాసనం బియ్యది దిక్ప్రదర్శనంబు'' (శాసన మితి దిక్ప్రదర్శనమ్)

## ఆంధ్రశబ్ద చింతామణి వ్యాఖ్య

సంస్కృతంలోని ఆంధ్రశబ్ద చింతామణిని చిన్నయసూరి వ్యాఖ్యానించాడని అనేకు లభిభాషించారు. కానీ ఆ గ్రంథం అనుపలబ్ధం కాబట్టి ఆ వ్యాఖ్య తెలుగులో ఉందో, సంస్కృతంలో ఉందో, దాని విస్తృతి ఎంతో, ప్రామాణికత్వం ఎంతటిదో స్పష్టంగా తెలియదు. అనుపలబ్ధివల్ల భావితరాలవారికి చిన్నయసూరి ప్రయత్న పరంపరలోని దశావస్థలూ అభివృద్ధి క్రమమూ తెలియకుండా పోవటం దురదృష్టకరం. దొరికి ఉంటే అతన్ని గురించిన అవగాహన ఎంతో పెరిగేది.

## అక్షర గుచ్ఛము

ఈ రచన ప్రచురణ కాలం తెలియదు. ప్రాథమిక పాఠశాల విద్యార్థుల లేఖన పద్ధతులను ప్రమాణీకరించడం కోసం ఈ గ్రంథ రచన ఉద్దేశించింది. ఇందులో అక్షరాల ప్రాథమిక, ద్వితీయ రూపాలను ఒక క్రమ పద్ధతిలో వివరించాడు. అక్కడక్కడ తననాటి వాడుకలో ఉన్న లేఖన పద్ధతులను క్రమబద్ధీకరించటానికి సూరి కొన్ని సూత్రాలు రాశాడు. అతడికి భాషానుశాసనం ఇష్టం కాబట్టి ఈ రచన చేసినట్లుంది. అనేక క్రియా రూపాలను పట్టికాబద్ధం చేసి వాటి నాయన స్థూలంగా రెండు విధాలని వర్గీకరించాడు. సంస్కృతం నుంచి ఎరువుతెచ్చుకున్న తత్సమ క్రియారూపాలొక వర్గమయితే, దేశ్యమనీ వికృతి అని పిలిచే భాషలోని క్రియారూపాలు రెండో వర్గమన్నాడు.

సాంస్కృతిక క్రియా రూపాల వర్గీకరణలో ఆయన వాడిన పరిభాష చాలా సాంకేతికం - సంస్కృత వ్యాకరణాలను చాలా వరకు అనుసరించింది. ఉదాహరణకు తత్సమ క్రియలను 'ఇంతంజంత, మతుబంత, ఇన్నంత, మత్వర్థీయ, ఆల్వంత, భావ ప్రత్యయాంత, తవ్యాంత, అనీయాంత, ముజంత, యుదంతా'లని వర్గీకరించాడు. అయితే తమిళ పండితుల ధోరణిలో దేశీయ పరిభాషను సృష్టించే ప్రయత్నం చేయనే లేదు. మారుమూల సాంకేతిక పదాలను పెద్దయెత్తున ఉపయోగించినందువల్ల రచనా ప్రయోజనం దెబ్బతిన్నది. అతడు దేశ్యక్రియల భూత భవిష్యద్వర్తమాన రూపాలను పట్టికగా ఇచ్చాడు. శ్లిష్ట పదాలను సరిగా ఉచ్చరించేందుకు కొన్ని సూచనలు చేశాడు. కానీ ఆ పుస్తకం జనామోదం పొందలేదు. సంస్కృతంలోని శిక్షాగ్రంథాలకు ప్రతిరూపమైన తెలుగు శిక్షా గ్రంథం రాయాలని సంకల్పించినట్లు ఈ రచన నిరూపిస్తుంది.

## బాల వ్యాకరణము

చిన్నయసూరి 1858లో ప్రచురించిన శబ్దానుశాసన దృష్టిగల బాల వ్యాకరణం అతని సర్వోత్కృష్ట రచన. సంప్రదాయ పండితులకు ఆమోద యోగ్యమైన ఏకైక వ్యాకరణ గ్రంథంగా అది అవతరించింది. తన పూర్వులూ తానూ రచించిన సూత్రాలకు, ప్రయోగాలకు, పరిష్కరణలకు, పునా రచనలకు ఇది చరమ రూపం. అంతకు ముందు తెలుగులో రెండే రెండు వ్యాకరణ గ్రంథాలు వెలువడ్డాయి. అవి క్రీస్తుశకం 13వ శతాబ్దినాటి కేతన ఆంధ్రభాషాభూషణమూ, క్రీ.శ. 1656నాటి అప్పకవి అప్పకవీయమూ. మొదటి రచన సులభ సుందరం, సంక్షిప్తం, పద్యగ్రంథం. రెండోది గద్యపద్య మిశ్రితమై పద్యరచన కావ్యభాషలో, గద్యభాగం సమకాలిక వచన రచనా సంప్రదాయంలో ఉన్న పుస్తకం. అయితే అది కేవలం వ్యాకరణ గ్రంథం కాదు. అప్పకవి ఛందో విభాగానికిచ్చిన ప్రాముఖ్యం వ్యాకరణభాగంకన్నా ఎన్నో రెట్లు విస్తారం. వ్యాకరణ భాగంలో సంస్కృతంలోని ఆంధ్రశబ్ద చింతామణి సూత్రాలకు వివరణలున్నాయి. సూరికి అప్పకవి శాసనపద్ధతి మీద అఖండాభిమాన ముంది. పైపెచ్చు అది రావిపాటి గురుమూర్తి వ్యాకరణంలో లాగా ప్రాచీన వర్తమానాంధ్ర పద స్వరూపాలకు సమ ప్రాముఖ్యమివ్వలేదు.

బాల వ్యాకరణారంభంలో చిన్నయసూరి రెండు తెలుగు పద్యాలను ఈ విధంగా రాశాడు :

" మును మదుపజ్ఞం బగుచున్
దనరిన వ్యాకృతిని సూత్రతతి యొక కొంతం
దెనుఁగించి యిది ఘటించితి
ననయము బాలావబోధ మగు భంగిఁ దగన్.
తెనుఁగునకు శబ్ద లక్షణ
మనయం బరయంగ వేడ్కనందిన వారల్
దనరఁగ నీ వ్యాకరణం
బున మూలంబయిన కృతిని బోలఁ గనఁదగన్"

తానే రాసిన వ్యాకరణ సూత్రాలకిది సాక్షికానువాదమని మొదటి పద్యం పేర్కొంటుంది. అర్థం చేసుకొని గుర్తుపెట్టుకోగల బాల విద్యార్థుల ఉపయోగార్థం ఇలా రాశానని కూడా అందులో సూరి చెప్పాడు. తెలుగు వ్యాకరణ విశేషాలను బాగా తెలుసుకోదలచినవారు మూలగ్రంథాన్ని పరిశీలించాలని రెండో పద్యంలో సూచించాడు. అయితే ఈ రూపంలో తెలుగులో వెలువరిచిన ఈ వ్యాకరణ రచనకు మూలగ్రంథమేదో

ఆయన స్పష్టీకరించలేదు. అదొక సమస్యగా పొడుపుకథగా మిగిల్చాడు. మూలం పేరు చేర్చలేదు. అందులో నుంచి ఉద్ధరణలివ్వలేదు. అలా చేయటం అతడికి ఇష్టమైనట్లు లేదు. భట్టోజీ దీక్షితుల సిద్ధాంత కౌముదిలోని రచనాప్రక్రియనూ ప్రణాళికనూ అనుసరించి తెలుగు వచనంలో సూరి వ్యాకరణ సూత్రాలు రాశాడు. తెలుగులో తెలుగు భాషకు వర్తించేట్లు సంప్రదాయ పద్ధతిలో వచ్చిన వ్యాకరణ గ్రంథాల్లో ఇది సువిస్తృతమయింది.

బాల వ్యాకరణంలోని 465 సూత్రాలు కింద పేర్కొన్నట్లు పది పరిచ్ఛేదాల్లో ఇమిడి ఉన్నాయి :

| | | |
|---|---|---|
| 1. | సంజ్ఞా పరిచ్ఛేదము | 23 సూత్రాలు |
| 2. | సంధి పరిచ్ఛేదము | 55 సూత్రాలు |
| 3. | తత్సమ పరిచ్ఛేదము | 87 సూత్రాలు |
| 4. | ఆచ్ఛిక పరిచ్ఛేదము | 38 సూత్రాలు |
| 5. | కారక పరిచ్ఛేదము | 37 సూత్రాలు |
| 6. | సమాస పరిచ్ఛేదము | 26 సూత్రాలు |
| 7. | తద్ధిత పరిచ్ఛేదము | 28 సూత్రాలు |
| 8. | క్రియా పరిచ్ఛేదము | 124 సూత్రాలు |
| 9. | కృదంత పరిచ్ఛేదము | 22 సూత్రాలు |
| 10. | ప్రకీర్ణక పరిచ్ఛేదము | 25 సూత్రాలు |
| | మొత్తం | 465 సూత్రాలు |

ఈ గ్రంథ ప్రాశస్త్యాన్ని పరిశీలించేముందు 19వ శతాబ్దంలో బాల వ్యాకరణానికి ముందే నాలుగు వ్యాకరణ గ్రంథాలు వెలువడి జనాదరణ పొందాయని గుర్తు తెచ్చుకోవటం మంచిది. సంస్కృతంలోని ఆంధ్రశబ్ద చింతామణి వ్యాఖ్యాన ప్రాయంగా వేదం పట్టాభిరామ శాస్త్రి రచించిన పద్యాంధ్ర వ్యాకరణమనే రెండో పేరుగల పట్టాభిరామ పండితీయము 1816 నాటికి వెలుగు చూసింది. 1836లో రావిపాటి గురుమూర్తి శాస్త్రి రచించిన తెలుగు వ్యాకరణము వెలువడింది. 1852 నాటికి ద్వితీయ ముద్రణ భాగ్యం పొందిన పుదూరి సీతారామ శాస్త్రి గ్రంథం ప్రశ్నోత్తరాంధ్ర వ్యాకరణము 1834లోనే ప్రకాశితమయింది. 1856లో ప్రచురితమైన ఉదయగిరి శేషయ్య వ్యాకరణము 1887లోగా పదిపన్నెండు పునర్ముద్రణలు పొందింది. ఇవన్నీ సూరి విద్యార్థులకు బోధించిన వ్యాకరణ గ్రంథాలే. అయితే ఆయన పూర్వులెవరూ సూత్ర రచనలోగాని,

సంస్కృతంలోని సూత్రవార్తిక పరిభాషా పద్ధతులనుగానీ సూరి అంత కఠోరదీక్షతో ప్రదర్శించలేదనేది మటుకు వాస్తవం. ద్రవిడాత్మను ఆర్యశరీరంలో ఇమిడ్చటంలో, తెలుగు భాషా సహజ లక్షణాలను సంస్కృత వ్యాకరణ ప్రణాళికకు అనుగుణంగా మలచటంలో సూరి తన శక్తియుక్తులన్నీ ధారపోశాడు. అయితే ఈ విధానం సంప్రదాయవాదులను - మరీ ముఖ్యంగా అగ్రవర్ణ పండితులను - సంతృప్తి పరిచింది - వారి ఆదరాభిమానాలను సూరికి పుష్కలంగా సంపాదించిపెట్టింది.

సూరి రాజ పోషకుల్లో ప్రముఖాతిప్రముఖుడైన గాజుల లక్ష్మీనరసింహం శ్రేష్ఠి (1806-58) వ్యాఖ్యానం వల్ల మూలగ్రంథానికి ప్రశస్తి వస్తుందన్న విశ్వాసంతో బాల వ్యాకరణం వెలునడీ వెలువడకముందే పచ్చియప్ప కళాశాలలో పండితుడుగా ఉన్న వింజమూరి కృష్ణమాచార్యులనే వ్యక్తిని బాల వ్యాకరణానికి వ్యాఖ్యానం రాయటానికి నియమించాడు. సూరి మరణానంతరం నాలుగు సంవత్సరాల లోపుగానే ఆ పండితుడు తన కర్తవ్యం నెరవేర్చకుండానే 15.10.1866లో కన్ను మూశాడు. అతడి వ్యాఖ్యానం దొరకటం లేదు. 1858లో అచ్చయిన బాల వ్యాకరణం 1900లోగా పదిహేను సార్లు పునర్ముద్రితమయింది. దశాబ్దాంతంలోగా ఓరుగంటి సోమశేఖరకవి (1818-1903) అనే వ్యక్తి సూరి వ్యాకరణ రచనను పద్యగ్రంథంగా మలిచాడు. విద్యారంగంలోని సమస్త స్థాయుల్లోనూ దేశభాషా గ్రంథకరణ సభవారూ, ప్రభుత్వమూ దాన్ని నిర్బంధ పాఠ్యగ్రంథంగా అమలు చేసినందువల్ల బాల వ్యాకరణం ఆ నాటికి బహుజనాదరణ పొందక తప్పింది కాదు. స్నాతకోత్తర స్థాయిదాకా అది తక్కిన వ్యాకరణ గ్రంథాలన్నిటినీ విద్యారంగంనుంచి తొలగించగలిగింది. అది బాలురకోసమని చిన్నయసూరి ఉద్దేశించినా, తెలుగు వ్యాకరణ శాస్త్రానికి అది ప్రామాణిక గ్రంథంగా అసాధారణమైన అప్రశ్ననీయాధికారం సంపాదించింది. ఈ వ్యాకరణంలోని సూత్రాలకు అనుగుణంగా ప్రాచీన కావ్యభాషను కూడా సంస్కరించి 'ప్రామాణికం'గా ప్రచురించటంలో పిచ్చిగా పోటీపడ్డారు. శతాబ్దాల కిందటి రచనలోనయినా సరే సూరి సూత్రాలకు విరుద్ధమైన ప్రయోగం కనిపిస్తే అది తప్పన్నారు. సూరి సూత్రాల పుణ్యమా అని ఒక నవీన 'పాఠ సంస్కరణ/వివక్ష' పద్ధతి ఉద్భవించింది. మరణానంతర కాలంలో కూడా సూరి శబ్దానుశాసన సింహపీఠాధికారం పూర్తి ఆధిపత్యం చెలాయించింది.

ఇరవయ్యో శతాబ్ది ప్రథమదశకంలోనే బాల వ్యాకరణానికి అనేక వ్యాఖ్యాన గ్రంథాలు వెలిశాయి. 176 పేజీల బాల వ్యాకరణ గుప్తార్థ ప్రకాశిక అనే వ్యాఖ్యానాన్ని సుంకరి రంగయ్య అనే వ్యక్తి ప్రచురించాడు. ఆ రచయిత కల్లూరి వేంకటరామశాస్త్రి శిష్యుడిగా

ఉండి చదివిన పాఠాలనూ విన్న వ్యాఖ్యానాన్నీ తన సొంత రచనగా వెలువరించాడు. తక్షణం గురుశిష్యుల మధ్య న్యాయ వివాదం మొదలయింది. రంగయ్య ఓటమి పాలయినాడు. వ్యాజ్యం సమాప్తమయ్యేలోగా కన్నుమూశాడు. అందువల్ల ఆ వ్యాఖ్యానం అసంపూర్తిగానే మిగిలింది. అచ్చయిన భాగాన్ని కూడా న్యాయస్థానం గురువుకు ఇప్పించింది. గురుద్రోహ కుపితుడైన వేంకటరామ శాస్త్రి గుప్తార్థ ప్రకాశిక అనే పేరుతో 1915లో తన పద్ధతిలో ధోరణిలో తన వ్యాఖ్యానాన్ని ప్రచురించాడు. అది రెండు విధాల విశేషమయిన రచన. తన అబ్రాహ్మణ శిష్యుడు తాను చెప్పిన పాఠాలను తస్కరించి సొంత పుస్తకంగా ప్రచురించాడన్న సంగతి తెలిసేదాకా వేంకటరామ శాస్త్రి చిన్నయసూరితో ఏకాభిప్రాయమూ, సూరి మీద అపార గౌరవమూ ప్రదర్శించాడు. నిజానికి ఆయన రచన కూడా అప్పటిదాకా సూరి ప్రస్తుతిగానే అచ్చవుతుండేది. దరిమిలా శాస్త్రిగారి కోపం బ్రాహ్మణేతరుడైన సూరిమీద ప్రసరించింది. సూరి రాసిన ప్రత్యక్షరమూ దోషభూయిష్ఠమని రుజువు చేసి ఖండించాలనే పట్టుదల పెంచుకున్నాడు. సంస్కృత వ్యాకరణ శాస్త్రంలో అపార వైదుష్యమున్న వేంకటరామశాస్త్రి సూరికున్న సంస్కృత వ్యాకరణ పరిజ్ఞానం ఎందుకూ పనికి రాదన్నంతగా నిరూపించే ప్రయత్నం చేశాడు. ఈ మనఃపరివర్తనకు తోడుగా ఒక అనుకోని దుర్ఘటన ఆయన పట్టుదలకు ఆజ్యం పోసింది. కిరాణా కొట్టులో వెచ్చాలు కొంటున్న శాస్త్రికి సరకులకు చుట్టపెట్టిన కొన్ని కాగితాల్లో సంస్కృత శ్లోకాల్లో ఉన్న ఒకానొక తెలుగు వ్యాకరణం సూత్రాలు కనిపించాయి. విస్తుపోయినవాడు ఆరకం కాగితాలన్నింటినీ కొని, చదివి, వాటిలోని సూత్రాలను సరిదిద్ది, తన వ్యాఖ్యాన గ్రంథానికి అనుబంధంగా ప్రచురించాడు. ఆ రచన శిష్టు కృష్ణమూర్తి శాస్త్రి (1827-27.3.1891) రాసిన హరికారికావళి. ఈ సంస్కృత గ్రంథమే మూలమనీ, చిన్నయసూరి బాల వ్యాకరణము దీనికి అక్షరాక్షరానువాదమే గాని అన్యం కాదనీ శాస్త్రి వాదించాడు. ఈ వివాదం దాదాపు పన్నెండు సంవత్సరాలు కొనసాగింది. తరువాతి ప్రకరణంలో దాని వివరాలు చర్చిద్దాం.

బాల వ్యాకరణ సారస్వ సర్వస్వ పేటిక అనే పేరిట దూసి రామమూర్తి శాస్త్రి 1937లో ఒక వ్యాఖ్యాన గ్రంథం వెలయించాడు. దానికి గ్రాంధికాంధ్ర కల్పకమనేది నామాంతరం. అందులా అక్కడక్కడ బహుజనపల్లి సీతారామాచార్యుల ప్రౌఢ వ్యాకరణ చర్చలను కూడా పోల్చి నిగ్గు తేల్చిన ఘట్టాలు కొద్దిగా ఉన్నాయి. బహుజనపల్లి సూరి శిష్యుడనే ప్రవాదముంది. ఆయన గ్రంథంలో బాల వ్యాకరణం చెప్పని విషయాలు కొన్ని కనిపిస్తాయి. బులుసు వేంకట రమణయ్య 'లఘు టీక' 1947లో, సూత్రార్థాలు 1949లో ప్రచురితమైనాయి. సూరి రచనమీద ఆధారపడి వజ్ఝల చిన సీతారామ శాస్త్రి రెండు సు విస్తృత మహా గ్రంథాలు ప్రచురించాడు - 1951లో ఆంధ్ర వ్యాకరణ సంహితా సర్వస్వము

వెలువడగా, 1960లో బాల వ్యాకరణోద్ద్యోతము ప్రకాశితమయింది. ఇవిగాక పదుల సంఖ్యలో వ్యాఖ్యానాలూ, టీకాటిప్పణులూ వెలిశాయి. వీటన్నిటినీ ప్రస్తావించటం కూడా దుర్ఘటం. భాషాధ్యయనంలో అనుశాసనాధికారిక విధానాన్ని వ్యతిరేకిస్తూ గిడుగు వేంకట రామమూర్తి (1862-1940) ఒక మహోద్యమం తెచ్చేదాకా తెలుగు భాషా వ్యాకరణాలకు సంబంధించిన సమస్త విషయాల్లోనూ సూరి ఏకచ్ఛత్రాధిపత్యం తిరుగు లేకుండా సాగింది. ఆ విషయం తరువాతి ప్రకరణంలో చర్చకు వస్తుంది. రచనాస్వామ్య శాసనం ప్రకారం ప్రచురణాధికారం సూరినుంచి లోకానికి సంక్రమించిన తరువాత ఎన్నెన్ని రూపాల్లో నేటిదాకా బాల వ్యాకరణం ముద్రితమయిందో లెక్కగట్టడం సాధ్యం కాదు.

తన వ్యాకరణ రచనలో అష్టాధ్యాయిలో కనిపించే సంజ్ఞలనూ, పరిష్కారాలనూ, పరిభాషనూ, నియమాలనూ, నిబంధనలనూ యథేచ్ఛగా విస్తృతంగా ఉపయోగించుకున్నాడు. వామనుడి కాశికావృత్తి నాయన స్మరించాడు. అక్కడక్కడ త్రివిక్రముడి ప్రాకృత శబ్దానుశాసనాన్ని అనుసరించాడు. అతడి సూత్ర రచన పరమ సంక్షిప్తం. సూత్రాలను కంఠపాఠంగా ఒప్పజెప్పటం సులభసాధ్యం. పునరుక్తులనూ, అనావశ్యక పదాలనూ జాగ్రతగా పరిహరించాడు. అక్కడక్కడ ప్రామాణికాభిప్రాయాలను ఉద్ధరించాడు; ఉదాహరణలుగా కావ్య ప్రయోగాలను సమకూర్చాడు. వాడుకలో లేని కొన్ని ధ్వనులకు ఊపిరి పోశాడు. లేని చోట్ల కనిష్ఠ ధ్వని భేదాలను కనిపెట్టాడు.

## విభక్తి బోధిని

తన మరణానికి రెండు సంవత్సరాలముందు 1860లో ప్రచురించిన విభక్తి బోధిని బహుశా చిన్నయసూరి చిట్ట చివరి వ్యాకరణ రచన కావచ్చు. సంస్కృతంలోని శబ్ద మంజరి నమూనాలో అది సిద్ధమయింది. ఏడు విభక్తుల్లోనూ దేశ్యదేశ్యేతర శబ్దాల రూపభేదాలను అందులో సమకూర్చాడు. అప్పటికాయన కీర్తి శిఖరాగ్రంలో ఉంది కాబట్టి ఈ రచన బహు కాలం పాఠశాలల్లో పాఠ్యగ్రంథంగా ఉంది.

## ఆంధ్ర ధాతుమాల

చిన్నయసూరి రచన అని విశ్వసించి ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు 1930లో ఈ గ్రంథాన్ని ప్రచురించారు. పీఠికాకర్తలే కర్తృత్వ విషయాన్ని సందేహించారు. నిజానికిది సూరి గ్రంథం కాదు. అచ్చయిన వెంటనే అది 1820లో ఎఫ్.డబ్ల్యు. ఎల్లిస్ కోరగా వేదం పట్టాభిరామ శాస్త్రి సిద్ధం చేసిన గ్రంథమని ప్రకాశకులకు తెలియవచ్చింది. ఇంత పెద్ద పొరపాటుకు మూల కారణం సూరి పొందిన అఖండ విద్వద్గౌరవమే. తెలుగు వ్యాకరణం గురించి ప్రామాణికంగా ప్రసంగించగల శక్తి చిన్నయసూరికి తప్ప మరెవ్వరికీ లేదనే, ఉండదనే పరమ విశ్వాసం అంత పని చేయించింది!

## నిఘంటు రచనలు

ఒక తెలుగు-తెలుగు నిఘంటువును చిన్నయసూరి నిర్మించాడనే ప్రశస్తి ఉంది. నిర్మాత దానికి పేరు పెట్టినట్లు లేదు. లిఖిత ప్రతిని సంపాదించిన ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు దాని ప్రస్తావన వచ్చినపుడు "చి.ని." (చిన్నయ సూరి నిఘంటువు) అని వ్యవహరించారు. కాకినాడలోని తమ కార్యాలయంలో ఎంతోకాలం భద్రంగా ఉన్న ఆ రచనను వారెందు చేతనో ప్రచురించనే లేదు. అది ఏడు సంపుటాలుగా ఉందనీ, దాని మొదటి సంపుటం ముత్యాలవంటి అక్షరాలతో చిన్నయసూరి స్వయంగా రాసిందేనని వారి కథనం. దాని నిర్మాణకాల మేదో, అందులో ఎన్ని ఆరోపాలున్నాయో తెలియదు. ఎనిమిది సంపుటాలుగా తాము ప్రచురించిన సూర్యాంధ్ర నిఘంటు నిర్మాణంలో అక్కడక్కడ ఈ నిఘంటువును స్మరించారు. ఉదాహరించారు. చిన్నయసూరి కేవలం 15 ప్రాచీన మహాకావ్యాలనుంచీ ఆరోపాలనూ, ప్రయోగాలనూ, సేకరించాడనీ, ఆరోపాలను అక్షర క్రమంలో పెట్టాడని, ప్రయోగాల నిచ్చాడనీ చెప్పారు. సూరి గ్రంథం కన్నా ముందే మచిలీపట్నం వాస్తవ్యుడైన మామిడి వెంకయ్య అకారాది క్రమంలో 1849లో ప్రచురించిన ఆంధ్రదీపిక ఉండనే ఉంది. సూరి మొదట నిఘంటు నిర్మాణం చేసి, అందులో పేర్కొన్న ప్రయోగ బలాన్ని పురస్కరించుకొని బాల వ్యాకరణ సూత్రాలు రచించాడని విశ్వసించేవాళ్లు లేకపోలేదు.

ఇరవై అయిదు సంవత్సరాల కఠోర పరిశ్రమ తరవాత 1885లో శబ్ద రత్నాకరమనే పేరిట ఒక తెలుగు నిఘంటువును ప్రచురించిన బహుజనపల్లి సీతారామాచార్యులు చిన్నయసూరి శిష్యుడుగా ఉండి, గురువు సేకరించిన విషయాలను తస్కరించి, తన నిర్మాణంగా నిఘంటువును వెలయించాడనే ప్రవాద మొకటి పండిత లోకంలో ఉంది. అదే నిజమయితే సూరి జీవిత చరమ దశలో - 1862 ప్రాంతంలో - సూరి లిఖిత ప్రతి సీతారామాచార్యులకు ఏలాగో లభించి ఉండాలి. అయితే ఆ ప్రచారాన్ని సమర్థించే సాక్ష్యాలేవీ దొరకలేదు. పైపెచ్చు ఆ వాదానికి విరుద్ధమయిన నిదర్శనలున్నాయి. సూరికి ముందు కాలంలోని ఏ తెలుగు నిఘంటువూ నాలుగు వేల దేశ్య పదాలను ఆరోపాలుగా ఇవ్వలేదు. చిన్నయసూరి నిఘంటువు చాలా వరకు దేశ్య శబ్దాలకు పరిమితమై, కొద్ది సంఖ్యలో సంస్కృత పదాలున్నదయితే దాని పరిమితి/విస్తృతి రంగనాయకులు శ్రేష్ఠి 1848లో 811 పేజీల్లో రమారమి 40,000 ఆరోపాలతో ప్రచురించిన ఆంధ్రదీపికతో పోల్చినపుడు అల్పాల్పం. సూరి స్వీకరించిన ఆధారగ్రంథాలు 15 మహాకావ్యాలు. శబ్దరత్నాకరానికి 104 కావ్యాలు ఆకరాలు కల్పించాయి. సీతారామాచార్యుల నిఘంటువు దాదాపు 60,000 పదాలున్న 1131 పేజీల ఉద్గ్రంథం. సూరి శిష్యుడిగా

సీతారామాచార్యులు గురువు చేసిన పదపదార్థ సంచయనం వివరాలను గ్రహించి ఉన్నా, దాని పరిమితిని తెలుసుకున్నా అతడి నిఘంటువుతో పోల్చినపుడు సూరి రచన చాలా చాలా చిన్నది. చిన్నయసూరి తన గ్రంథాన్ని 'బాల వ్యాకరణ' మంటే సీతారామాచార్యులు తన కృతిని 'ప్రౌఢ' వ్యాకరణమని - అంటే ఉన్నత ప్రమాణాలున్నదని - వ్యవహరించినందు వల్ల సూరి భక్తులు ఈ ప్రవాదం పుట్టించి ఉండవచ్చు. సూరి ప్రాచీనుల వ్యాకరణ ప్రవచనాలకు పెద్ద పీట వేయగా, సీతారామాచార్యులు కావ్య ప్రయోగాలకే అధిక ప్రామాణ్యం కల్పించాడు. సీతారామాచార్యుల నిఘంటువుకు సూరి నిఘంటువు ప్రధానాధారమయినా కావచ్చు; తన గురువే ఇతరులకన్నా అధిక ప్రామాణికుడని శిష్యుడు భావించే ఉండవచ్చు.

సుజనరంజని అనే సాహిత్య పత్రికలో, 1865 డిసెంబరు సంచికలో సంస్కృతంలోని విశ్వకోశమనే నిఘంటువుకు చిన్నయసూరి తెలుగులో వ్యాఖ్యానం రాశాడనే వార్త కనిపిస్తుంది. సూరి శిష్యులూ, ఉద్యోగంలో అతనికన్నా చిన్నవాళ్ళూ అయిన బహుజనపల్లి సీతారామాచార్యులు, కారుమంచి సుబ్బరాయలు నాయుడు, వింజమూరి కృష్ణమాచార్యులు అది నిజమేనని సమర్థించారు. కానీ ఈక్షణానికి ఆగ్రంథంలోని అక్షరమైనా దొరకలేదు. సమర్థవ్యాకర్త అయిన సూరి తాను మంచి నిఘంటుకారుడు కూడా కావాలని అపేక్షించి ఉండవచ్చు. ఈ విషయం సూరి మరణానంతరం మూడేళ్ల తరువాత బయటపడింది.

## వచన రచనలు

తన రచనల్లో ప్రఖ్యాతమైన వచనగ్రంథం నీతిచంద్రికను చిన్నయసూరి 1853లో వాణీదర్పణ ముద్రాక్షరశాల అనే సొంత ముద్రణాలయంలో అచ్చువేసి ప్రచురించాడు. అంటే ఆనాటికి ఆయన అంతోఇంతో సంపన్న స్థితికి చేరుకున్నాడని చెప్పాలి. సింహగిరి నరహరి వచనముల (క్రీ.శ. 1300) తరవాత రావిపాటి గురుమూర్తి శాస్త్రి పంచతంత్ర కథలు (రచనాకాలం 1770: కానీ 1834 దాకా ముద్రితం కాలేదు) వెలువడే దాకా వెలుగు చూసిన వచన రచనలను వేళ్ల మీద లెక్కించవచ్చు. పంచతంత్ర కథలు 1834లోగా నాలుగు ముద్రణలు పొందింది - పాఠశాలల్లో పాఠ్యగ్రంథంగా ఉండేది. సూరి ఆ గ్రంథాన్ని పాఠంగా బోధించవలసి వచ్చింది. తెలుగు వచన రచయితలు సాంప్రదాయిక వ్యాకరణ శాసనాలను కనీసం విశ్వనాథ స్థానాపతి రాయవాచకము వెలువడ్డప్పటినుంచయినా - సుమారు క్రీ.శ. 1600 ప్రాంతాలనుంచయినా - పూర్తిగా అనుసరించటం మానివేశారు. గురుమూర్తి శాస్త్రి అనుసరించిన ఆధునిక శైలి చిన్నయసూరికి నచ్చలేదు. అందువల్ల అదే కథను తన పద్ధతిలో రాసి ప్రచురించాలని సంకల్పించాడు. ఉభయులకూ నారాయణ

పండితుడి హితోపదేశమూ, విష్ణుశర్మ పంచతంత్రమూ సమానంగా ఆధార గ్రంథాలు. ఆకాలంలో దేశ వ్యాప్తంగా పాఠ్యగ్రంథ నిర్మాతలందరూ ఆ రచనలను వచనరూపంలో పునారచించి నిర్బంధ పాఠ్యాలుగా విద్యార్థులచేత చదివించక తప్పని దుస్థితిలో ఉన్నట్లుంది.

చిన్నయసూరి ఆ రెండు కథాగ్రంథాలనూ కలిసి నాలుగు భాగాలుగా విభజించి వాటికి మిత్రలాభము, మిత్ర భేదము, సంధి, విగ్రహము అని పేర్లు పెట్టిగూడా, మొదటి రెండే రాసి తక్కిన రెంటినీ వదిలి పెట్టాడు. (పంచతంత్రాలనే అయిదూ ఇలా నాలు గనిపించుకొని రెండుగా వెలుగు చూశాయి!)

గ్రంథారంభంలో పద్యరూపంలో ఆ కథలను చదివినందువల్ల భాషాపాటనంతో బాటు రాజనీతి కౌశల్యం కూడా అబ్బుతుందని ఇలా చెప్పాడు :

"ఒనరఁగాఁ బంచతంత్ర హితోపదేశ
ములను బరికించి, వానిలో వలయు నంశ
ములను గొని, కొంత యభినవంబుగను గూర్చి
కృతి యొనర్చెద 'నీతిచంద్రిక' యనంగ.
"తుద ముట్టఁగ నీ కబ్బము
పదిలముగాఁ జదివినట్టి బాలుర కోలిం
బొదలును భాషా జ్ఞానము
కుదురుం గొద లేక నీతి కుశలత్వంబున్".

నీతిచంద్రికలోని భాష నిర్దుష్టం. శైలి మనోహరం. అయినా రచన కావ్యభాషలోనే సాగింది. పాత్రల సంభాషణల్లోను కథాకథనంలోనూ చిన్నచిన్న వాక్యాలున్నా వర్ణన సందర్భాల్లో మాత్రం భట్టబాణుడి కాదంబరికే ఇది అనుకరణ. ఉదాహరణకు సంభాషణల్లో - "దారిద్ర్యముకంటె మరణము మేలు. మరణ మాపాత యాతనావహము. దారిద్ర్యము యావజ్జీవము తీవ్రవేదనాకరము... లోభము మోహమును బుట్టించును. మోహము దుఃఖము నుత్పాదించును. దుఃఖము జ్వలనము వలె స్వాశ్రయమునకు నాశము పుట్టించును. కాబట్టి లోభమునకు బుద్ధిమంతుడు లో పడడు". (మిత్రలాభము)

"ఇప్పుడొక యుపాయము చెప్పెద వినుము. నేను నీ కంఠంబు కౌఁగిలించి పట్టుకొని వచ్చెదను. గమ్య స్థానంబునకుఁ బోకమునువు నాపట్టు విడువను. ఇంత చెప్పనేల? నా రక్షణ భారము నీది. చిత్తము వచ్చినట్లు చేయుము" .. (మిత్ర భేదము).

కథాకథన సందర్భాలకు మచ్చు -

"వీనికి వీఁడు మిత్రము. వీనికి వీఁడు శత్రువని నియమము గలదా? వ్యవహారము చేతనే మిత్రులు గాని శత్రువులు గాని కలుగుచున్నారు. నా విని కాకి యాలాగే కానిమ్మని పలికెను. అనంతరము మృగ, కాక, జంబుకములు కడునేస్తము గలిగి తద్వనమందు వాసము చేయుచుండెను". (మిత్రలాభము).

"తొల్లి యొక కొలనిలోని మీనముల నెల్ల బలవంతము చేసి భక్షించిన కొంగ నొక్క యెండ్రి యుపాయము చేతం జంపెను. అట్లు నీవును నీ శత్రువును గడ ముట్టింపుము. నీ కాకథ చెప్పెద వినుము" (మిత్రభేదము).

వర్ణన సందర్భాల కుదాహృతి -

"అర్థనాశము, మనస్తాపము, గృహమందలి దుశ్చరితము, వంచనము, పరాభవమును బ్రకాశింపఁ జేయఁదగదని పెద్దలు చెప్పుదురు. కుసుమస్తబకమువలె మానవంతుఁడు సర్వ జనుల మూర్ధము మీదనయిన నుండవలె. లేదా వనమందు సమసిపోవలె ... అర్థములు నిత్యములు గావు. యౌవనము ఝరీ వేగ తుల్యము. జీవనము బుద్బుద ప్రాయము ... తటాకోదర జలమునకుఁ బరివాహమువలె సమార్జిత విత్తములకుఁద్యాగమే రక్షణము". (మిత్రలాభము)

"ఎట్టి ప్రజ్ఞావంతుఁడుగాని పేటికాంతర్గత రత్నముంబోలె నినాలోకయోగము లేక ప్రకాశింపఁడు ... మానావమానములు ప్రవర్తనాయత్తము లయియుండును... ఉద్యోగికి దూరభూమియు, విద్వాంసునకుఁ బరదేశమును, బ్రియవాదికి శత్రువును లేనియట్లు బుద్ధిమంతున కసాధ్య మొక్కటియు లేదు...

"ఇది యేమి విచిత్రంబె? రత్నసరంబు గొంపోయెఁ జూచితిరే యని యొక్క సీమంతినీలలామంబు వాక్రువ్వ నంద ఱొక్కమొగి వదనారవిందంబు లెత్తి పార్శ్వేతర విస్తారితచారులోచనలై యస్పంద మిళింద సుందర వికసిత కుసుమరాజ విరాజమాన మల్లికా వల్లికా విభ్రమానుకారిణు లగుచు, సూచీముఖాలంకృత నాసికాగ్ర లగుచు, దూరీ కృత నిమేషంబుగ దృష్టి సారించి కాంచుచు, నిక్కాకంబు పద్మరాగ ప్రభా రింఛోళిం గాంచి యామిషంబని భ్రమియించెఁ గాఁబోలు ..." (మిత్రభేదము)

ప్రధాన కథాంశానికి సంబంధించిన ప్రతి అవాంతర కథలోనూ ఏదో ఒక నీతి సూత్రం తప్పకుండ ఉండేనట్లు చిన్నయసూరి జాగ్రత్తపడ్డాడు. కరటక దమనకులనే రెండు పాత్రలు మొత్తంమీద పదమూడు అవాంతర కథలు చెప్పగా, వాటిలో ప్రతిదీ ఏదో ఒక నీతిని ప్రతిపాదించింది. అక్కడక్కడ సూరి సంస్కృతం నుంచి లోకోక్తులను ఉదాహరించాడు. ఏ విద్యాస్థాయికి చెందిన పాఠ్యగ్రంథంలోనయినా నీతిచంద్రికాభాగం

నిర్బంధ పాఠ్యాంశంగా ఉంటుండేది. నీతిచంద్రిక మొత్తంగాని, అందులోని భాగాలుగాని 1853 నుంచి నేటి దాకా నిర్బంధ పాఠ్యాంశంగా ఉంటూనే ఉన్నాయి. ఏ పాఠశాలా విద్యార్థి అయినా ఈగ్రంథంనుంచి కొన్ని పంక్తులయినా ఒప్పచెప్పకుండా బడినుంచి బయటపడలేడంటే అతడి ప్రభావం విద్యారంగంలో ఎంత విస్తారమో ఊహించవలసిందే. అత డీవిధంగా తనకు ముందున్న వచన రచనా సంప్రదాయాన్ని విధ్వంసం చేసి, తన కృతక భాషా శైలిని తన జీవిత కాలంలోనే నిర్బంధ పాఠశాలాంశంగా విధింప జేసి, తన విధానం అనివార్యమని అనుసరణీయమని అనిపించుకున్నాడు. తన వచన రచనలో అతడు చూపిన ఆధునికత్వం కథాంశాలను పేరాలుగా విభజించటానికే పరిమితం. అప్పటికింకా లోకానికి తెలియని తన భావి వ్యాకరణ గ్రంథంలోని సూత్రాలకు ఉదాహరణప్రాయంగా నమూనాగా ఈరచన ప్రతిష్ఠ సంపాదించింది. పాతకాలపు చంపూకావ్యాల్లోని ఆలంకారిక వచన రచనా రీతిని అతడు పునరుజ్జీవింప జేశాడు. అనుస్వార రేఫలకు ముందున్న హల్లును ద్విరుక్తంగా రాయటం అనే ఆచారం క్రీ.శ. 575 నాటి మొట్టమొదటి తెలుగు శాసన కాలంనుంచీ సంప్రదాయంగా ఉండేది. సూరి దాన్ని నిరాకరించాడు. కానీ ఏడో శతాబ్ది నాటికే ప్రత్యేక వర్ణత్వం కోల్పోయిన శకటరేఫను మాత్రం నిలిపి లేఖన సంప్రదాయాన్ని పునరుద్ధరించాడు. శిలా తామ్ర శాసనాల్లోగానీ, తాళపత్ర గ్రంథాల్లో గానీ, ఏనాడూ కనిపించని అర్ధానుస్వారాన్ని (అరసున్నను:c) లేఖన సంప్రదాయంలో కల్పించి అప్పకవి కలకు మనసారా సాకారత్వం ప్రసాదించాడు. తన ప్రయోగాలను ప్రమాణీకరించి, తన కిష్టంలేనప్పుడు వాటిని విస్మరించటం వంటి అతార్కిక పద్ధతు లనేకమున్నాయి అతడి రచనల్లో. మొత్తంమీద అతడి దృష్టిలోనూ ఛాందస సంప్రదాయవాదుల చూపులోనూ వచన రచనకు నీతిచంద్రిక ఒకే ఒక నమూనాగా, ఆదర్శంగా భాసించింది.

చిన్నయసూరి మరో వచన రచన ఇంగ్లీషునుంచి తెలుగులోకి అనువదించిన హిందూ ధర్మ శాస్త్ర సంగ్రహం. థామస్ లుమిసిడన్ స్ట్రేంజ్ రాసిన "Manual of Hindu Law" ను నరహరి గోపాలకృష్ణమ సెట్టి (1823-1888) సాయంతో సూరి తెలిగించాడు. మూలగ్రంథ రచయిత మదరాసు హైకోర్టులో న్యాయమూర్తిగా ఉండేవాడు. అనువాదం పేరు హిందూ ధర్మశాస్త్ర సంగ్రహము. అది మొదటిసారి 1858లో అచ్చయింది. 1863లో ద్వితీయ ముద్రణ, 1869లో తృతీయ ముద్రణ వెలుగు చూశాయి. ఆ గ్రంథం భారత దేశంలో లభ్యం కావటం లేదుగానీ, బ్రిటన్లో భద్రంగా ఉందని అనేక పరిశోధకులు పేర్కొన్నారు. ఈగ్రంథరచనకు కొంత పూర్వస్ఫూర్త ఉన్నట్లు భావించవచ్చు. అదే హిందూ ధర్మశాస్త్రాన్ని గురించి జాన్ ఫేయర్ థామ్ అనే వ్యక్తి ఇంగ్లీషులో రాసిన మూల రచనకు వట్టం వాసుదేవ పరబ్రహ్మ శాస్త్రి (19వ శతాబ్దం) చేసిన అనువాదం అంతకు ఏడు సంవత్సరాల క్రితమే వచ్చింది. దానికి వ్యవహార దర్పణమని పేరు;

భూపాలీయమనేది నామాంతరం. ఆ గ్రంథం చివర కింద పేర్కొన్న పద్యముంది:

"అఖిల లోకోపకారార్థ మట్టి ధర్మ
వాక్యతతి తెల్గు భాషచేఁ బల్కఁబడియెఁ
గాన నన్నయ సూత్ర సంస్కారములను
విడిచి నెట్టుట దోషమై వెలయ దిచట"

ఈ ప్రసంగం వ్యాకరణ విషయంలో అధికారిక ప్రవచనాల మీద సంపూర్ణ ప్రామాణ్య బుద్ధిగల చిన్నయసూరి చిత్త సంస్కారాన్ని దెబ్బ తీసినట్లుంది. శాస్త్రి రచన సమకాలిక వచన రచనా రీతిలో ఉంది. సూరి కది సమ్మతం కాదు. అందువల్ల తానే తన పద్ధతిలో అనువదించాడనాలి.

ఉదాహరణార్థం ఇంగ్లీషు మూలంనుంచీ సూరి అనువాదంనుంచీ కొన్ని పంక్తులు ప్రదర్శిద్దాం.

i) Second chapter: Marriage (Paragraph 11)

The binding circumstances essential to the completion of a marriage are gift and acceptance of the girl and the ceremony termed SAPTHAPATHI or the seven steps. This is performed by the bride-groom placing the bride's foot successively on seven lines drawn upon rice in a platter. From this observance has followed the practice of any two persons pledging friendship by taking seven steps together so that the term SAPTHAPADINAM has come to be synonymous with friend-ship. The ceremonial in question accomplishes the marriage. The other ceremonies observed including sacrifice by fire (HOMAM) are of minor significance. The tying of Tali or nuptial token, by the bridegroom round the neck of the bride is a practice sanctioned by usage, but not prescribed in the Sastras". (Grihya Sutram)

వివాహము పుట 11; పేరా. 28

వివాహ పూర్తికిఁ గన్యాదానమును దత్ప్రతిగ్రహమును సప్తపదియును ముఖ్య క్రియలు. ఒక పళ్ళెరములో బియ్యము నెఱపి యేడుగీంట్లు గీచి యాయేడు గీతల మీఁద వరుఁడు పెండ్లి కుమార్తె కాలు పట్టి గీఁతగీఁత కొక్కొక్కసారి వరుసగా నడిపించుట సప్తపది యనఁబడును. ఇందు చేతనే యిద్దరు చెలిమి యొడంబికకయి కూడి యేడడుగులు నడుచు నాచారము గలిగినది. కాఁబట్టి సాప్తపదీనమను శబ్దము సఖ్యమునకు వాచకమయినది. ఈ క్రియతోనే వివాహము పూర్ణమవుచున్నది. హోమము లోనైన యితర క్రియలు విశేషములుగావు. వరుడు కన్య కంఠమందు మంగళసూత్రము కట్టుట

లోకాచారముగాని, శాస్త్రీయముగాదు''. (గృహ్య సూత్రము)

ii) 5th Chapter: Property (Paragraph 140)

"Property is again distinguished according as it is ancestral or self acquired. Whatever, whether immovable or movable, has been derived by inheritance or obtained by means of trimonial funds is ancestral property. That which has been obtained by individual excertion, unaided by ancestral funds is viewed as self acquired."

''ద్రవ్యము పిత్రార్జితమని స్వార్జితమని మఱల రెండు విధములుగా విభాగింపఁ బడియుండు. పితృ ద్రవ్యము గాని, దాని చేత సంపాదించినది కాని జంగము స్థావరములం దేదయినను పిత్రార్జిత మనఁబడును. పితృద్రవ్య నిరపేక్షముగ స్వప్రయాసముచేత సంపాదించిన ద్రవ్యము స్వార్జిత మనఁబడును.''

iii) Contract: Para 417

"If earnest money, and not the full price, have been paid, the buyer forfeits the same should the breach of the engagement be upon his part. Should it be on the part of the seller, he is liable to repay the earnest money two fold."

'వెలదీర్చుకొని సంచకరము మాత్రమిచ్చినవాఁ డొడఁబాటు తప్పిపోయిన పక్షమం దిచ్చిన సంచకరము విడిచిపెట్టవలసినది. ఒడఁబాటు దప్పుట విక్రయించిన వానిదైన పక్షమందు వాఁడు పుచ్చుకొన్న సంచకరము రెట్టిగా నియ్యవలసినది''.

సూరి రచన 408 పేరాల్లో 14 ప్రకరణాలుగా సాగింది. దాని వివరా లివి:

1. శాస్త్రముల యుత్పత్తి క్రమము (The Law and its Sources)
2. వివాహము (Marriage)
3. పుత్ర స్వీకారము (Adoption)
4. రక్షకత్వము (Guardianship)
5. సొమ్ము (Property)
6. వినియోగము (Alienation)
7. ఉయిళ్లు (Wills)
8. సొమ్ములోఁ జేయందగిన వ్యయములు (Charges on Property)
9. దాయానర్హత (Disability to Inherit)
10. దాయభాగము (Partition)

11. దాయాధికారము (Succession)
12. బంగాలా శాస్త్ర సంప్రదాయము (Bengal Law)
13. మలయాళ దేశ సంప్రదాయము (Malabar Law)
14. క్రయ, విక్రయాది వ్యవహారము (Contract)

ఆయన అనువాద ధోరణిని ప్రకరణ శీర్షికలే సూచిస్తున్నాయి. నిత్య వ్యవహారంలో ఉన్న మాటలకు బదులు కొన్ని సందర్భాల్లో నైఘంటుక శబ్దాలనూ, ఒక మారు ఎరువు మాటనూ, ఇతరత్రా నూతన పద సృష్టినీ ఆయన అభిమానించాడు. కింది పట్టిక నాటి వ్యవహారానికీ సూరి ఎంపికకూ మధ్యగల భేదం సూచిస్తుంది :

| ఆంగ్లమూలం | సూరి అనువాదం | సమకాలిక ప్రయోగం | వర్తమాన ప్రయోగం |
|---|---|---|---|
| 1. Law | శాస్త్రము | వ్యవహారము, ధర్మము | న్యాయశాస్త్రం |
| 2. Source | ఉత్పత్తి క్రమము | మూలము | ఆధారం |
| 3. Adoption | పుత్రస్వీకారము | పరిగ్రహము | దత్తత, దత్త స్వీకారం |
| 4. Guardianship | రక్షకత్వము | రక్షకత్వము | సంరక్షణ |
| 5. Property | సొమ్ము | సంపత్తి, ద్రవ్యము, ధనము | ఆస్తి (ధనం) |
| 6. Alienation | వినియోగము | పరాధీనత | అన్యాక్రాంత(త్వ)ం |
| 7. Wills | ఉయిళ్లు | సంకల్పము, ఇచ్ఛ | వీలునామాలు |
| 8. Charges on property | సొమ్ములోఁ జేయ వలసిన వ్యయము | నిక్షేపము, న్యాసము | ఆస్తిభారం |
| 9. Disability to inherit | దాయానర్హత | అయోగ్యత | వారసత్వానికి అనర్హత |
| 10. Partition | దాయభాగము | విభాగము, విభజన | ఆస్తి పంపకం |
| 11. Succession | దాయాధికారం | ఉత్తరాధికారిత్వము | వారసత్వం |
| 12. Bengal Law | బంగాలా శాస్త్ర సంప్రదాయము | బంగాలా ధర్మము | బెంగాల్ న్యాయ వ్యవహారం దాయభాగం |
| 13. Malabar Law | మలయాళదేశ శాస్త్రము | మలబార్ ధర్మము | మరుమగదాయం |
| 15. Movable | జంగమము | చరము | చరం |

"will" అనే మాటకు అనువాదంగా తద్భవ రూపంలో ఒక ఎరువు మాటను ఆమోదించాడనీ, 'సొమ్ము' అనే దేశ్య పదం విషయంలో తప్ప ఇతరత్రా తన సమకాల వ్యవహారంలో లేని సాంస్కృతిక పరిభాషనే అభిమానించాడనీ పైపట్టిక నిరూపిస్తుంది. Bengal Law అనే పదబంధాన్ని 'సంప్రదాయ' శబ్దం చేర్చిన శాస్త్ర శబ్దంతోనూ Malabar Lawను 'సంప్రదాయ' రహితంగా ప్రాంత స్థానంలో రాష్ట్రం పేరు జోడించీ అనువదించాడనీ గమనించవచ్చు. అనువాద శరీరంలో అక్షరాక్షరానువాదం చేయలేదని గుర్తించవచ్చు. మూలభావాన్ని మాత్రమే అనువదించి మూల వాక్యాలకు సంక్షిప్తానువాదం చేశాడని స్పష్టమవుతుంది. ఉదాహరణకు -

మూలంలోని "has been derived by inheritance - by means of trimonial funds" అనే భాగాలను అనువదించలేదు. అలాగే అనువాదంలోని 'విభాగింపఁబడియందు' అనే దానికి మూలంలో మాటలు లేవు. సంస్కృత పదభూయిష్ఠమైన ఈ అనువాదాన్ని ప్రభుత్వాధికారులు తప్ప సాధారణ ప్రజలు ఆమోదించక పోవటంలో ఆశ్చర్యం లేదు. అందుచేత ఈ అనువాదం సప్త సముద్రాలు దాటి లండన్ నగరం చేరి అక్కడ భద్రంగా ఉంది.

## అప్రధాన రచనలు, కార్య కలాపాలు

మొదటి ప్రకరణంలోనే బ్రిటిష్ రాణి విక్టోరియాను ప్రశంసిస్తూ 1837లోనూ, పచ్చయప్పను ప్రస్తుతిస్తూ వ్యవస్థాపక దినోత్సవ సందర్భాల్లో 1845, 1847 సంవత్సరాల మధ్య కాలంలోనూ చిన్నయసూరి కొన్ని పద్యాలు రాశాడని ప్రస్తావించాం. 1850లో ప్రచురితమైన 'పచ్చయప్ప యశోమండనము' లో పచ్చయప్ప ప్రస్తుతి పద్యాలు 3 కనిపిస్తాయి. ఆయన కొన్ని శ్లోకాలు కూడా విక్టోరియా రాణి మీద రాశాడు. 1853 నాటి శబ్ద లక్షణ సంగ్రహారంభంలో ఒక శ్లోకముంది. అదే యేడు ప్రచురితమైన నీతిచంద్రిక ఆరంభంలోనూ 1858 నాటి బాల వ్యాకరణం మొదటా కొన్ని పద్యాలున్నాయి. వాటిలోని ''మును మదుపజ్ఞం బగుచున్, దనరిన వ్యాకృతిని ...'' అనే పద్య భాగానికి కల్లూరి వేంకటరామశాస్త్రి అనే వ్యాఖ్యాత విపరీతార్థం చెప్పాడు. 'ఉపజ్ఞ' మంటే ఎవరో చెప్పిన దాన్ని గుర్తు పెట్టుకొని / తెలుసుకొని' అని గ్రహించాలనీ, 'తనరిన వ్యాకృతిని' అనే భాగాన్ని 'తనరి-నవ్యాకృతిని (నూతన రూపంలో)' అని చదవాలని ఆయన విశ్లేషణ. ఈ విధంగా అర్థం చేసుకొంటే సూరి స్వయంగా తాను హరికారికలను అనువదించి ఈ రూపంలో ప్రదర్శిస్తున్నానని నిజమే చెప్పాడనేది వ్యాఖ్య. ఇది దుర్వ్యాఖ్య. కాకపోతే భాషావైదుష్యంతో చెప్పిన కువ్యాఖ్య. సూరి ఆశువుగా అనేక పద్యాలు చెప్పాడంటారు గాని, అవేవీ లభ్యం కాలేదు.

1855లో నీతిసంగ్రహమనే పేరిట సూరి నీతిపద్యసంకలన మొకటి ప్రచురించాడు. అందులో మహాభారతమువంటి మహారచనలనుంచి సేకరించిన దాదాపు నూరు పద్యాలున్నాయి. అందులో స్వీయ పద్యాలు కొన్నింటినిగూడా చేర్చాడు. బడిపిల్లలు అర్థం చేసుకొని ఒప్పచెప్పటానికి వీలుగా ఆయన ఆ పద్యాలకు టిప్పణి కూడా సమకూర్చాడు. ఈ ప్రయత్నం ఏపాటి జనాదరణ సంపాదించిందో స్పష్టంగా తెలియదు.

సూరి వీరాభిమానుల్లో ఒకడై బాలవ్యాకరణానికి రమణీయమనే పేరున ప్రశంసైక పరాయణమైన వ్యాఖ్యానం రాసిన దువ్వూరి వేంకటరమణశాస్త్రి సుజనరంజని అనే సాహితీ పత్రికను స్థాపించి సూరి తన సొంత ముద్రణాలయంలోనే ముద్రించాడని ప్రస్తుతించాడు. అదే విధంగా చిన్నయ ప్రభుత్వంవారినుంచి 'సూరి' అనే బిరుదాన్నీ, బంగారు కడియాలనూ బహూకరణగా పొందాడని కూడా గొప్పలు చెప్పాడు. ఈ రెండు ప్రసంగాలూ నిరాధారాలు. సూరి 1862లో కన్ను మూశాడనీ, సుజనరంజని ప్రప్రథమ సంచిక 1865లో వెలువడిందనీ చెప్పటానికి విస్పష్టమైన నిదర్శనలున్నాయి. ఆ పత్రికకు 'ప్రవర్తకులు'గా ముగ్గురు సహసంపాదకు లుండేవారు - వింజమూరి కృష్ణమాచార్యులు, బహుజనపల్లి సీతారామాచార్యులు, కా. సుబ్బరాయులునాయుడు అనేవాళ్లు. ఆ ముగ్గురూ పచ్చయప్ప కళాశాలోద్యోగులే. వాళ్లు పాఠ్యగ్రంథాల్లోని విశేషాలను విశదీకరిస్తూ వ్యాసపరంపరను పత్రికలో ప్రకటిస్తుండేవాళ్లు. (సూరి అనే బిరుదం గురించీ కంకణం గురించీ ప్రథమ ప్రకరణంలోనే చర్చించాం).

చిన్నయ రాసిన ఒక ఉత్తరం ఇప్పుడు లభిస్తున్నది. అది వర్తమాన తరంగిణి అనే మరో సాహితీ పత్రిక సంపాదకుడికి సూరి 22.10.1842లో రాసింది. దాని పూర్తిపాఠ మిది:

"మహారాజశ్రీ వర్తమాన తరంగిణి ఎడిటరుగారి సముఖానకు ఈయడుగున వ్రాసుకొన్న పద్యంబు తమ పత్రికలో ప్రచురము చేసి పండితు లగువారివలన నా పద్యంబున కర్థంబు తెప్పించి తిరుగా తమ పత్రికలో ప్రచురము చేసి నా అభీష్టం బీడేర్తురని తనుఘనమును బహుశా ప్రార్థించెదను. అగత్యముగా నీపద్యం బీసారి ప్రచురము చేయవలెనని కోరెదను.

ఉ. కోడిగ మింతెగాని తనకున్ వయ సెక్కుడిదమ్మ నేత్రముల్
వాడు గదమ్మ పంట పగబట్టె(న) వాని సుధారసంబు ము
ద్దాడు గదమ్మ యీ చెలియ కక్కట వల్పు లటమ్మ యాడికల్
వేడుకలాయ మట్ల తిరువేంగళనాథ యనంతశౌరికిన్.

యీ పద్యములోన తప్పిదమ్ములున్నం దిద్దించి నవి అభిప్రాయము పోనీయకుండా తమ పత్రికలో ప్రచురము చేతురని కోరెదను.

1842 సం॥ తమ వినయ విధేయుడగు
అక్టోబరు నెల 22వ తేది చి॥ సూరి॥

పై లేఖ 1842 నవంబరు 3వ తేదీ నాటి వర్తమాన తరంగిణి పత్రికా సంచికలో ప్రచురిత మయింది. ఉత్తరం చివర ఉన్న 'చి॥ సూరి॥' అనే సంక్షిప్త నామధేయాన్ని నవంబరు 10వ తేదీ సంచికలో వివరిస్తూ ''పచ్చయప్ప మొదలారిగారి ధర్మబడిలోనుండే తెనుగు పండితులు పోయినసారి మాసంచికలో ప్రచురపరచిన పద్యము'' అని పత్రికాధిపతి రాసిన రాతలు రచయిత చిన్నయసూరి అని నిరూపిస్తాయి. ఈ నిదర్శన 1842 నాటికి అతడు ప్రాచీన కావ్య ప్రయోగాలను సేకరిస్తూ ఉండేవాడనీ, నిఘంటు నిర్మాణ ప్రయత్నంలోనో వ్యాకరణ రచనలోనో ఆ కాలంలో నిమగ్నమై ఉన్నాడనీ స్పష్టం చేస్తుంది. పై ఉత్తరం దాని కింది గీతలున్న భాగాలు ఆయనే రాసిన వ్యాకరణ సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని గుర్తించగలం. ఉదాహరణకు బాలవ్యాకరణ క్రియా పరిచ్ఛేదంలోని 108వ సూత్రంలో 'చేతురు కోతు రిత్యాదు లసాధువులని యెఱుంగునది' అని ఆయనే రాశాడు. ఇంత చిన్న ఉత్తరంలో ఆయన వ్యాకరణ సూత్రాలకే విరుద్ధమైన ప్రయోగాలు ఉండటం విశేషం. దీన్నిబట్టి సాధుత్వాసాధుత్వ విషయంలో ఆయన అభిప్రాయాలు అప్పటికి ఒక నిర్ధారణకే రాలేదని చెప్పవచ్చు. ఆ తరువాత 16 సంవత్సరాలకు వెలుపడ్డ బాలవ్యాకరణ సూత్రాలు పరిష్కృతాలోచనల పర్యవసానమనాలి.

మొదటి ప్రకరణంలోనే 1840లో వైయాకరణం రామానుజాచార్యుల సహాయకుడుగా తెలుగు మహాభారతం ఆదిపర్వం శుద్ధ ప్రతిని ప్రచురణార్థం తయారు చెయ్యటానికి చిన్నయను సి.పి. బ్రౌన్ నియోగించాడని ప్రస్తావించిన విషయం స్మరించండి. వర్తమాన తరంగిణిలో వెలువడ్డ ఒక వాణిజ్య ప్రకటన ప్రకారం 1842 ఆగస్టు నాటికే ఆదిపర్వ ముద్రణ పూర్తయింది. అయితే 1847 మే నెలలో ప్రచురితమైన ఆదిపర్వంలో మాత్రమే రామానుజాచార్యులు సంపాదకుడనీ, 'ప. చిన్నయ' సహాయకుడనీ ఉంది. దీన్ని బట్టి ఆదిపర్వం అనేక ముద్రణలు పొందిందనీ అందులో ఒకదాని విషయంలో చిన్నయ పని చేశారనీ చెప్పవచ్చు. ఆ పత్రిక అతణ్ని ''సాతాని చిన్నయ'' అని మాత్రమే 1842లో నాలుగో సంచికలో ప్రస్తావించటాన్నిబట్టి ఆనాటి కతడు 'సూరి' కాలేదని కూడా భావించవచ్చు. ఇలాంటి చిన్నచిన్న వివరాలెలా ఉన్నా అతడు 'ప్రామాణిక' పాఠ నిర్ణయం చేసి ప్రాచీన కావ్యాలను ముద్రించే కార్యక్రమంలో పాల్గొన్నాడనేది స్పష్టం. అతడు చిత్తుప్రతులను సరిచేయటంలో కూడా అత్యంత శ్రద్ధాసక్తులు ప్రదర్శించేవాడని చెప్తారు. తాను సరి చూసిన ప్రతి పుట మీదా చిరు సంతకం పెట్టేవాడనీ చెప్తారు. సరిచూసే సమయాల్లో అతడు తన అభిరుచి భావాల ప్రకారం ఎన్నో పాఠాలను 'సంస్కరించా'డనే అభియోగం లేకపోలేదు. అయినా పాపం చిన్నయ సూరి కూడా అటువంటి పరిష్కరణలవల్ల ఎంతో కొంత నష్ట పోయాడనీ, అందులో ప్రధాన నిందితుడు సూరి

మరణానంతరం నీతిచంద్రికను ప్రచురించిన ఆయన బావమరిదేననీ గిడుగు వేంకటరామమూర్తి కొన్ని నిదర్శనలు చూపాడు. ఉదాహరణకు - సూరి 'కాసరంబుల మీసరంబు గారించుచు' అని రాయగా పరిష్కరణలో అది 'కాసరంబుల మీసరంబుగాం జించుచు' అని మారిపోయింది - దోషయుక్తంగా!

చిన్నయసూరి కనీసం రెండు మహారచనలు వెలయించాడని క్లుప్తంగా చెప్పవచ్చు. ఆధునిక రచయితలకు నమూనాగా ఆదర్శప్రాయమైన ప్రాచీనకావ్య భాషా రూపంలోని వచనశైలిని 'నీతచంద్రిక'లోనూ, అందుకావశ్యకమైన అధికారిక వ్యాకరణ సూత్రాలను బాలవ్యాకరణంలోనూ ప్రదర్శించాడు. ఈ శతాబ్దారంభంనుంచీ ఈరెండు గ్రంథాల ప్రభావమూ దినదినాభివృద్ధి చెందుతూనే ఉందిగానీ తగ్గలే దిప్పటికీ - బాలవ్యాకరణ ప్రభావం, ప్రామాణ్యం చాలా వరకు తగ్గి పోయినా. నూట ఇరవై సంవత్సరాల పైకాలం సాహిత్యరంగంలో తన అధికారాన్ని నిలబెట్టుకొన్న అదృష్టవంతుడని చెప్పక తప్పదు. కానీ గ్రంథచోరుడనీ (వచన రచనా) సంప్రదాయ విధ్వంసకుడనీ మరణానంతరం అప్రతిష్ఠ తెచ్చుకున్నవాడూ అతడే. ఆయన వ్యక్తిత్వానికీ రచనలకూ సంబంధించి వచ్చిన వాదవివాదాలను కొంత విపులంగా తరవాతి ప్రకరణంలో పరిశీలిద్దాం.

# 4. వాదవివాదాలు, ప్రతిస్పందనలు

ఛాందస సంప్రదాయ వాదమూ భాషా ప్రమాణీకరణంలో కఠోర ప్రమాణాలూ చిన్నయసూరి ప్రతిపాదించి ఆచరణలో పెట్టాడు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించటమే పరమ ప్రయోజనంగా భావించి తెలుగు భాషాధ్యయనం చేసే విద్యార్థుల పరిమిత సమూహానికి అవి పట్టుబడ్డాయి. అదే సమయంలో కొద్ది సంఖ్యలోనైనా ఇంగ్లీషు భాషా సాహిత్యాలను అధ్యయనం చేస్తున్న వాళ్లున్నారు. సంప్రదాయ పండితుల సంకుచిత ప్రపంచానికి ఆవల భాషను ఆధునీకీకరించాలనీ, తమ ఆలోచనలకు పదును పెట్టాలనీ, బ్రిటిష్ ప్రభుత్వ పరిపాలనావసరాలకు అనుగుణంగానూ విస్తృత సమాజ ప్రయోజనాలకు ఉపకార కంగానూ ప్రవర్తించాలనీ నిరంతర కృషి చేస్తున్నవారు కూడా ఉన్నారు. సూరి సంప్రదాయ విధానాలకూ అతణ్ని సమర్థిస్తున్న బ్రిటిష్ పాలకుల పద్ధతులకూ ఈ కొత్తరకం ప్రజల ప్రయత్నబలం కొంతవరకు గండి కొట్టింది. పాఠ్య ప్రణాళికలో భాగంగా సాంఘిక శాస్త్ర బోధన ద్వారా సమకూడిన విజ్ఞానం ఆలోచనాపరులైన యువకుల కళ్లు తెరిపించటం మొదలు పెట్టింది. కాలక్రమాన ప్రజాహృదయాల్లో చరిత్ర దృష్టీ ఇతర ప్రపంచంలోని సామాజిక రాజకీయ పరిస్థితులూ, శాస్త్ర పరిశోధకులకు సంబంధించిన సమాచారమూ, పాశ్చాత్య సారస్వతంలోని వైవిధ్యమూ దాని స్వభావమూ తమ ప్రభావాన్ని ప్రసరించాయి.

బ్రిటిష్ మతప్రచారకులూ ఉద్యోగులూ ప్రచురించిన నిఘంటు వ్యాకరణాలు సంప్రదాయ రచనాపద్ధతులకన్నా భిన్నంగా ఉన్నట్లు లోకం గుర్తించింది. కింద పేర్కొంటున్న అభిప్రాయ ప్రకటనలవంటివి చిన్నయసూరికి పూర్వులైన రావిపాటి గురుమూర్తి శాస్త్రివంటి కొందరి మనోభావాలనయినా ప్రభావితం చేశాయి.

సి.పి. బ్రౌన్ తన తెలుగు భాషా వ్యాకరణానికి రాసిన ఉపోద్ఘాతంలో 'చైనా పండితుల్లాగే హిందూ వ్యాకర్తలు వాడుక భాషను నిర్లక్ష్యం చేస్తున్నారు. విద్యార్థులకు అవి అంతకు ముందే తెలుసునన్న విశ్వాసంతో కావ్యభాషా విశేషాలను మాత్రమే బోధిస్తున్నా''రన్నాడు. (Hindu grammarians, like those of China, neglect the colloquial dialect, which they suppose is already known to the student, and teach only the poetic pecularities).

అతడే తన బ్రౌణ్య నిఘంటు పీఠికలో ''దక్షిణ భారతీయ భాషలన్నింటిలోనూ ఒక కావ్య భాషా మాండలికమూ మరో వ్యావహారిక మాండలికమూ ఉన్నాయి. అవి ఇంగ్లీషు భాషా సాక్షన్ భాషా విభేదించినంత ఎక్కువగా ఉన్నా''యన్నాడు. (Each of the Southern languages has a poetical and a vermacular dialect which vary as widely as Saxon varies from English).

ద్రవిడ భాషా తులనాత్మకాధ్యయనం వెలువరించిన బిషప్ ఆర్. కాల్డ్వెల్ ''భారతీయ భాషలు సాహిత్య స్థాయికి చేరగానే కావ్యభాషాశైలి ఒక ప్రత్యేక మాండలికత్వం పొంది వ్యాకరణంలో పదజాలంలో ప్రత్యేకమై నిత్యజీవిత వ్యవహారంలోని మాండలికంకన్నా విభిన్నం కావటం మనే విచిత్ర విశిష్టతను ప్రదర్శిస్తున్నా''యని ప్రసంగించాడు. (It is a remarkable peculiarity of the Indian languages that, as soon as they begin to be cultivated, the literary style evinces a tendency to become a literary dialect distinct from the dialect of common life with a grammar and vocabulary of its own).

పాఠశాలల్లోగాని కళాశాలల్లోగాని విద్యార్థులుగా ఉండవలసిన అవసరం లేని వాళ్లలో తమ భాషను గురించి తెలుసుకోదలచిన వారు పై మార్గంలో పరిశీలించటం ఆరంభించారు. తమతమ రచనల్లో కావ్యేతర వచన రచనా శైలిని ప్రవేశపెట్టిన పాత సంప్రదాయ మార్గంలో చిన్నయసూరి పూర్వులు అనేక సాహిత్య ప్రక్రియలను సృష్టించారు; సామాన్య ప్రాథమిక శాస్త్రగ్రంథాలు రచించారు. అవన్నీ అకస్మాత్తుగా సూరి నిబంధించిన ప్రమాణాల కనుగుణంగా తిరిగి రాయవలసివచ్చింది. ఉన్నత వర్గాల్లోని విద్యావంతుల కోవకు చెందని వారికి ఈనిర్బంధం కంటకప్రాయ మయింది. సామినేని ముద్దు నరసింహనాయుడు (19వ శతాబ్ది) వంటి విద్యాధికులైన ప్రభుత్వోద్యోగులు ఆయన హితసూచని (ప్రచురణ కాలం 1867) వంటి రచనల్లో ఈ విషయాలను చర్చించి భాషాదృష్టితో గాని సాంఘిక ప్రయోజన దృష్టితోగాని సందర్భశుద్ధిలేని ఈ ప్రాచీన మర్యాదలను పరిహరించాలని వాదించారు. కర్నల్ కాలిన్ మెకంజీ సేకరించగా సి.పి. బ్రౌన్ క్రోడీకరించిన స్థానిక కైఫీయతులు తమ సమాజచరిత్రను పూర్వకాలంనుంచీ అప్పటిదాకా

అధ్యయనం చేయాలన్న అభిప్రాయం పుట్టించాయి - పరిశోధకులలో. అంతకు ముందే ఎల్లిస్ వ్యక్తీకరించిన అభిప్రాయం కాకపోయినా బిషప్ రాబర్ట్ కాల్డ్‌వెల్ తన మహా రచనలో ప్రతిపాదించినట్లు సంస్కృతంనుంచి ప్రాకృతాల ద్వారా దక్షిణ భారతీయ భాష లుద్భవించలేదన్న సిద్ధాంతంమీద కొందరికైనా అభినివేశం పుట్టించింది. పాశ్చాత్య పండితులు రాసిన వ్యాకరణ గ్రంథాలు వర్ణనాత్మకంగా ఉండి ప్రాచీన భాషా లక్షణాల మీదకన్నా సమకాలిక వ్యవహార భాషా విశేషాలను ఎక్కువగా పట్టించుకున్నాయి. పాశ్చాత్య సంఘాల్లోని అనేక సాహిత్య ప్రక్రియలు భారతీయ రచయితల్లో కూడా అదే విధంగా (సమకాలిక భాషలో) రచించాలనే అభిలాష రేకెత్తించాయి.

విద్యాసంస్థలకన్నా నిఘంటు వ్యాకరణాలకన్నా ఎక్కువగా దేశభాషల్లో ముద్రణ సౌకర్యం ఏర్పడటం ప్రాచీనాంధ్ర సాహిత్యాన్ని కూడా అందరికీ అందుబాటులోకి తెచ్చింది. అందాకా తాళపత్ర గ్రంథాలుగా కాగితం ప్రతులుగా మాత్రమే ఉన్న లిఖిత గ్రంథాలను సేకరించి, పరీక్షించి, పరిష్కరించి ముద్రించటం సి.పి. బ్రౌన్‌వంటి వ్యక్తుల ఏకాగ్రదృష్టి, కార్యసాధనతత్పరతలవల్ల, స్థానిక పండితుల సహాయ సంపదలవల్ల సాధ్యమయినాయి. అప్పటి వచన రచనా శైలిలో కొన్ని వ్యాఖ్యాన గ్రంథాలు కూడా వెలిశాయి. ఈ కారణంగానే చిన్నయసూరీ, ఆయన అనుయాయులూ చేపట్టిన విధానాలకు ప్రతిస్పందన వచ్చింది. పాశ్చాత్య పండితులు మూలగ్రంథాలను యథాతథంగా ప్రచురిస్తూ ఆయా సందర్భాల్లో రాతప్రతుల మధ్యగల పాఠభేదాలను సూచించి వాటిలో తమకు సముచిత మనిపించిన పాఠాన్ని ప్రమాణంగా స్వీకరించగా, సూరీ ఆయన అనుయాయులూ తమ అధికారక వ్యాకరణ సూత్రాల కనుగుణంగా 'పరిష్కరించి' ముద్రించటం మొదలు పెట్టారు. ఒకే గ్రంథానికి సంబంధించిన చాలా రాతప్రతులను పరిశీలించిన అనేక విద్వాంసులు ప్రాచీన గ్రంథ పాఠాలను ఈ విధంగా సవరించే దుష్ట సంప్రదాయం మొదలయిందని గుర్తించగలిగారు. అందువల్ల వారిలో ఈ విధానంమీద తిరుగుబాటు భావాలు పుట్టాయి. అనేక పాఠభేదాలున్న గ్రంథాన్ని పరిశీలించి ప్రామాణిక పాఠ నిర్ణయం చేసేముందు అనేక వాదోపవాదాలు పండితుల మధ్య రాకుండా గ్రంథ ప్రచురణ చేయటం జరిగినట్లుంది. కానీ దురదృష్టవశాన ఆ చర్చల వివరాలు మనకిప్పుడు అందుబాటులో లేవు. తన వ్యాకరణ సూత్రాల ఛాందస పద్ధతుల సామంజస్య ప్రామాణికత్వాల గురించి సూరి ఎక్కడా ఎవరితో బహిరంగ చర్చలు చేసిన దాఖలాలు లేవు. తనకు తోచినట్లు తన మార్గంలో అతడు తన పద్ధతులను నిశ్శబ్దంగా ఆచరణలో పెట్టాడనిపిస్తుంది. తన అభిప్రాయాలనూ, విధానాలనూ చర్చలు మార్చలేవని ఆయనకు తెలిసే ఉంటుంది.

(ఆంధ్రశబ్ద చింతామణి కర్తగా ఉపలబ్ద ప్రథమ మహాకావ్య నిర్మాతగా తాను విశ్వసించిన) నన్నయ భట్టునూ, తన వార్తికాల ద్వారా చింతామణి సూత్రాలను వివరించిన అథర్వణాచార్యులనూ పాణిని వరరుచులకు తుల్యులుగా భావించి తన వ్యాకరణాలు గ్రంథంలో ప్రస్తావించాడేమో గాని, చిన్నయసూరి మరే వ్యాకర్తనూ స్మరించలేదు. తాననేక విధాల అభిమానించి ప్రామాణికుడని అనుసరించిన 17వ శతాబ్ది నాటి అప్పకవికి కూడా ఆగౌరవం దక్కించలేదు. కానీ వాస్తవంలో తాను బోధించిన వ్యాకరణ గ్రంథాల రచయితలయిన సమకాలపు పెద్ద పండితులను మాత్రం పరోక్షంగా విమర్శించాడు. బాలవ్యాకరణంలో వారి ప్రసంగాలనూ వారిచ్చిన ఉదాహరణలనూ వాడుకొనికూడా పట్టుబట్టినట్లు వారి పేర్లను పేర్కొననే లేదు. ప్రస్తావన వచ్చినప్పుడు 'ఒకానొకడు' వంటి మాటలను మాత్రమే వాడాడు.

జాగ్రతగా పరిశీలించినప్పుడు సమకాలంలో వయోవృద్ధులయిన పూర్వ వ్యాకర్తలకూ, వారి గ్రంథాలకూ సూరి ఎంతో రుణ పడ్డాడని నిరూపించవచ్చు. నిడుదలకు కొండొకచో కురచ లవుతాయనీ పూనుపాదవుల ఆదిపకారం లోపిస్తుందనీ సూరి చెప్పింది నిజానికి అప్పకవి ఆవిష్కరణ. కొన్ని సమయాల్లో డాకు ళాదేశం వస్తుందని మొట్టమొదటి సారి చెప్పినవాడు రావిపాటి గురుమూర్తి శాస్త్రి. ఆయన వ్యాకరణ గ్రంథాన్ని సూరి రెండు దశాబ్దాల పాటు పాఠశాలల్లో బోధించాడు. ఆ విషయాన్ని ప్రస్తావించి సూరి వెక్కిరించి నిరాకరించాడు. ప్రత్యయమనే అర్థంలో 'వన్నియ/వన్నె' అనే రూపాంతరాలను సూరి తానుకూడా వాడాడు. ఆ మాటలను మొదట ప్రయోగించిన వ్యక్తి గురుమూర్తి శాస్త్రికన్నా పూర్వుడైన వేదం పట్టాభిరామ శాస్త్రి. లక్షణ విరుద్ధంబగు భాష గ్రామ్యమనే భావాన్ని కూడా సూరి ఆ పండితుడి దగ్గరే సంగ్రహించాడు. అయితే అందుకు ఉదాహరణంగా ఇచ్చిన 'వస్తాఁడు' అనే రూపం పుదూరి సీతారామ శాస్త్రి 1852లో ప్రచురించిన ప్రశ్నోత్తరాంధ్ర వ్యాకరణంలోది. ఉదాహృతి అప్రయత్న సిద్ధంగా సూరికే తట్టిందని వాదించడం కష్టం. సూరి జీవిత కాలంలోనే 1834, 1852లలో పుదూరివారి వ్యాకరణం రెండు ముద్రణలు పొందింది. ఈ వాస్తవాలు సూరి బాలవ్యాకరణానికున్న గ్రంథగౌరవాన్ని ఏమాత్రం తగ్గించక పోవచ్చు. నిజానికి సూరి రచన పూర్వోక్త గ్రంథాలకన్నా సువిస్తృతమయిందే. కానీ తన పూర్వుల కనేక విధాల రుణపడి ఉండి కూడా వారిని గుర్తించదలచలే దనటం ఆయన వ్యక్తిత్వానికి కళంకమే. ఇదే విధానం అవలంబించి ప్రౌఢ వ్యాకరణ, శబ్ద రత్నాకర కర్త అయిన తన శిష్యుడు బహుజనపల్లి సీతారామాచార్యులను కూడా ఎక్కడా స్మరించలేదు. (తానిచ్చిన అర్థాలకు సమర్థకంగా ప్రాచీన కావ్యప్రయోగాల సమకూర్చినందుకు శబ్దరత్నాకరం నేటికీ గౌరవ స్థానంలో ఉన్న నిఘంటువు). చిన్నయసూరి స్వయంగా (ఇంగ్లీషులోని wills

అనే మాటకు బదులు) 'ఉయిళ్లు' అనే భ్రష్టరూపాన్ని ప్రయోగించాడు. అయితే తరువాతి కాలంలో అతడు ఎరువు మాటలు వాడి భాషను సంకరం చేయటాన్ని వ్యతిరేకించాడు. తెలుగు మాటలనూ, నిర్మాణ క్రమాన్నీ నిర్దాక్షిణ్యంగా సంస్కృతీకరించటాన్నీ, ప్రాకృతీకరించటాన్నీ, అభిమానించాడుగానీ తెలుగు మాటలనూ సంస్కృత పదాలనూ కలిపి సమాసాలు చేయటాన్ని అంగీకరించలేదు. పెర్షో-అరబిక్ భాషలనుంచీ ఇంగ్లీషునుంచీ తద్భవాలుగా తెలుగులో ప్రవేశించిన ఎరువు మాటల ప్రస్తావన మాట మాత్రంగా కూడా ఆయన వ్యాకరణంలో కనిపించదు. (సంస్కృత పద ప్రయోగాన్ని నిషేధించిన) 'అచ్చ తెలుగు' కావ్యాల్లో కూడా పెర్షో-అరబిక్ పదాలు క్రీస్తుశకం 14వ శతాబ్దినుంచీ కనిపిస్తున్నాయి. భాషా పరిశుద్ధతను ఎంతో సమర్థించిన అప్పకవి కూడా సాహిత్యంలో వాటి వాడుకను నిషేధిస్తే 'వ్యవహార హాని' కలుగుతుందని విధిలేక అంగీకరించాడు. కానీ అప్పకవి అభిమానీ, అనుయాయీ అయి కూడా చిన్నయసూరి ఆ మాటల సంగతే ప్రస్తావించలేదంటే ఇంగ్లీషునుంచి వచ్చిన ఎరువు మాటల సంగతి చెప్పనే అక్కరలేదు. ఆర్య భాషేతరమైన పదమయినా సాంస్కృతికాంశమైనా అసహ్యకరమనే ఛాందస సంప్రదాయవాదుల కీ రాజీలేని ధోరణి నచ్చిఆనందం కలిగి ఉండవచ్చు). (తన బదుకు తెరువుకు, అభివృద్ధికి, ప్రయోజనాలకు ఉపయోగించినంత మేరకు) బ్రిటిష్ అధికారులతో బుజాలు రాసుకున్న సూరి, వారి భాషనుంచి ఒక్కమాటైనా సాహిత్య ప్రయోగానికి పనికి వస్తుందని అంగీకరించక పోవటం విడ్డూరం. దుర్భరైకాంత వాసజీవి అయిన సూరికి కఠోరమైన రాగద్వేషా లుండేవన్నమాట. అయితే ఆ లక్షణం కూడా అతడి వ్యక్తిత్వానికీ నిదర్శనమే. అందువల్ల సంప్రదాయవాది వేషంలో ఉన్న పశ్చాత్తాపదూరుడైన స్వప్రయోజన పరుడని చెప్పొ లాయనను. వాస్తవంలో ఒకానొక వైష్ణవ మతంలో బాల్యం దొర్లించిన వ్యక్తి కాబట్టి అలనాటి భావాలు ఆయనలో కరుడుగట్టాయని చెప్పవచ్చు. మరో విశేష లక్షణం కూడా ఆయన వ్యక్తిత్వంలో కనిపిస్తుంది - పరోక్షంగానయినా. స్వమతేతరులను అతడు సహించలేకపోయా డనవచ్చు. పాల్కురికి సోమనాథ, శ్రీనాథ, ధూర్జటులనే ప్రాచీన మహాకవుల కావ్యాలనుంచి మచ్చుకొక్క ఉదాహరణమైనా ఆయన చూపలేదు. ప్రాచీన వీర శైవ సాహిత్యంలోనూ పూర్వశాసన భాషలోనూ కచటతపలకు గసడదవాదేశం నిత్యంగా జరిగేది. అయినా ఆ సంధి నిత్యమని అంగీకరించలేదు. కానీ తానే చెప్పిన సంధిసూత్రానికి విరుద్ధమైన అపవాదప్రాయమైన ప్రయోగ మొకటి వీరవైష్ణవు లభిమానించే విష్ణుచిత్తీయము / ఆముక్తమాల్యదలో ఉంటే దాన్ని మాత్రం సమర్థించాడు. ఆ గ్రంథకర్త అర్వాచీనుడైన పదహారో శతాబ్దం నాటి విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణదేవరాయలు కావటం అందుకు కారణం కావచ్చు! సూరి అలక్ష్యం చేసిన శైవకవులు అతనికన్నా కనీసం

నాలుగునుంచి ఆరు శతాబ్దాల కాలందాకా పూర్వులు. పదకొండో శతాబ్ది తెలుగు శాసనాల్లోనూ 12వ శతాబ్ది నాటి వీరశైవ మహాకవి నన్నెబోడుడి కుమారసంభవంలోనూ దేశ్య శబ్దాల్లో దీర్ఘాచ్చు తరవాత అనుస్వారం కనిపిస్తుండగా సూరి పూర్వోక్త పద్ధతిలో ఆ విషయాన్ని విస్మరించి నిషేధించాడు. ఇటువంటి నిదర్శనల వల్ల రచయితలు ఎంతటి వారైనా మత దృష్టిలో తనకు వ్యతిరేక కూటమికి చెందిన వారైతే వారినీ వారి ప్రయోగాలనూ సూరి సమర్థించలేక పోయాడనాలి. బహుశా ఇటువంటి కారణాల వల్లనే స్మార్తులయిన పట్టాభిరామ శాస్త్రి, గురుమూర్తి శాస్త్రి, పుదూరి సీతారామ శాస్త్రులతో సూరి విభేదించి ఉండవచ్చు. వారిలో కొందరిని గానీ, అందరినిగానీ సూరి బహిరంగంగా వ్యతిరేకించలేదు. ప్రాచీనార్వాచీనత్వాలతో నిమిత్తం లేకుండా, అటువంటి వ్యక్తులనూ సాహితీ ప్రపంచంలో వారి ప్రాముఖ్యాన్నీ అతడు మౌనంగా విస్మరించాడు.

భారతదేశంలోని సనాతన పండితులు చాలామటుకు భాషా చరిత్ర దృష్టిగానీ, అసలు ఏ విషయంలోనైనా చారిత్రక దృష్టిగానీ లేనివారు కాబట్టి చిన్నయసూరికి చరిత్ర మీద గౌరవం లేక పోవటం క్షమ్యార్హదోష మనవచ్చు. లిపి ధ్వను లొకటే అనుకోవటం, లేఖన సంప్రదాయాలను ధ్వని లక్షణాలుగా భ్రమించటం ఆకోవకే చెందిన లక్షణాలు. ఇది కూడా పాతకాలపు వ్యాకర్త లందరిలోనూ కనిపించే సమాన లక్షణం. చిన్నయసూరి అపవాదం కాదు. అయినా నిరర్థకమైన రెండు లక్షణాలను అతడు మా చెడ్డ పట్టుదలతో సమర్థించడం విడ్డూర మనిపిస్తుంది. తనకాలం దాకా ఏ లేఖనం (సంప్రదాయం) లోనూ కనిపించని 'అరసున్న' అనే అక్షర స్వరూపాన్ని లేఖన సంప్రదాయంలో నిలిపి తీరాలని మొండిపట్టు పట్టడం అతడి విశేష స్వభావం. తెలుగు వర్ణక్రమంలో దానికీ స్థానముందని (1656 నాటి) అప్పకవి స్థూలంగా నిర్దేశించాడు. తెలుగు అక్షరాల స్వరూప లక్షణాలను గురించి అతడు చేసిన వర్ణనలో అర్ధానుస్వార (అరసున్న) రూపరేఖాలక్షణ మొకటి. క్రీస్తు జన్మకాలంనుంచీ 18 వ శతాబ్దిలో తెలుగు ముద్రణ సౌకర్యం వచ్చేదాకా ఏ నాటి తెలుగు లిపిలోనూ అప్పకవి వర్ణించిన అక్షర స్వరూపాలు కనిపించనే కనిపించవని ఏ పరిశోధకుడయినా చెప్పగలడు. ఆ అభూతపూర్వకమైన అర్ధానుస్వారం ఏ శిలాశాసనంలోనూ, ఏ రాగిరేకులోనూ, ఏ తాళపత్ర గ్రంథంలోనూ, చివరకు అప్పటిదాకా వచ్చిన ఏ కాగితం ప్రతిలోనూ లేనేలేదు. అయినా సరే. చిన్నయసూరి మొండిగా అరసున్న వాడనలసిందే నన్నాడు. ఆయన అనుయాయులు దాని ఉనికిని చర్చించి అంతకన్నా మొండిగానూ, అంకితభావంతోనూ ఆ నాటినుంచీ (చిన్నయసూరి సూత్రీకరించినప్పటినుంచీ) రాతప్రతుల్లోనూ, ముద్రణలోనూ వాడటం మాననూ లేదు. అనేక సందర్భాల్లో అర్ధానుస్వారమనేది తత్పూర్వ స్వరాన్ని అనునాసిక్యంగా పలకటమేనని

చారిత్రక తులనాత్మక నిదర్శనాల ద్వారా ఊహించుకోవచ్చు. సాంకేతికంగా ఈ లక్షణాన్ని 'సంధిగతవర్ణం' (morphophoneme) అనవచ్చు. ఇదే విధానంలో క్రీస్తుశకం 8వ శతాబ్దినాటికే ప్రత్యేకం వర్ణత్వం కోల్పోయి, ప్రత్యేకార్థరహితమైన శకట రేఫను (బండి అను) లేఖనంలో నిలపవలసిందేనని సూరి అవిశ్రాంతంగా పోరాడాడు. మహా భాగవత రచయిత్ర పోతనతోసహాఅనేకానేకాంధ్ర మహాకవులు ఏపదంలో శకట రేఫ ఉంటుందో తెల్పుకోలేకపోయారు. అప్పకవికి అధఃకరించటానికి పోతన ఒక్కడే దొరికాడీ విషయంలో. (అతడు వైష్ణవ కవులకు మాత్రమే అనుకూలంగా ఉండేవాడని) ఇంతకు ముందు చేసిన విమర్శకు వైష్ణవుడైన పోతనను సూరి విస్మరించాడనటం విరుద్ధ వాక్యమని పైకి అనిపించవచ్చు. కానీ, ఇందులో ధర్మసూక్ష్మమొకటి కనిపిస్తుంది. కృష్ణదేవరాయల్లాగా పోతన అబ్రాహ్మణుడు కాడు; పైపెచ్చు అతడు వైష్ణవ మత స్వీకారానికి ముందు శైవ కావ్యమైన 'వీరభద్ర విజయం' రాసిన వాడు. ఇటువంటి నేరం కారణంగానే అయివుంటుంది - వైష్ణవ కావ్యమైన పాండురంగ మాహాత్మ్యం తెలుగు పంచకావ్యాల్లో ఒకటయినా దానికర్త తెనాలి రామకృష్ణుణ్ని సూరి ప్రస్తావించనే లేదు. ఇలాంటి దృష్టాంతాలు చిన్నయసూరి పైకి ఎలా సాధువుగా కనిపించినా ప్రవర్తించినా, అంతరాంతరాల్లో స్వమతాభినివేశం తీవ్రంగా ఉన్న వాడనీ ఇతర మతాలకు చెందినవారి విషయంలో తన అంచనా ప్రకారమే నిర్దాక్షిణ్యంగా వ్యవహరించే వాడనీ చెప్పవచ్చు. అతని స్వభావంలో వ్యక్తిత్వంలో ఇది ఎంత బలహీనతో అంతే శక్తి అని కూడా చెప్పాలి. రాజీలేని, దాక్షిణ్యం లేని ఈ విధమైన చిన్నయసూరి ప్రవర్తన, సాధారణ భారతీయ లక్షణం 'మరణాంతాని వైరాణి' అని నమ్మినా మరణానంతరం కఠోర విమర్శలకు అతణ్ని గురి చేసింది.

1955లో తాపీ ధర్మారావనే పండిత కవీ, సినీ రచయితా 'సూరి మరణం/ బండిఱాపల్లకీ' అనే అయిదు రంగాల నాటికను ప్రచురించాడు. అయిదేళ్ళ కాలంలో అది రెండు పునర్ముద్రణలు సాధించింది. నాటికారంభంలో నిస్సహాయ స్థితిలో సూరి మంచం మీద పడివుంటాడు. అతడి విధవ కుమార్తె శిష్యులూ పదాంతంలో (కవి వాడిన సాంకేతిక పదం 'అవసానం') ద్రుతమనే నకార లోపం గురించి చర్చిస్తుంటారు - మొదటి రంగంలో. రెండో రంగారంభానికి సూరి అస్తమిస్తాడు. ఆయన శిష్యుడు శాస్త్రి ముందుగానే రాసి యిచ్చిన పాటను భజనబృందం పాడుతుంటుంది, కింది విధంగా -

''అయ్యో! వైయాకరణీ! - నీ
వస్తమించితివె తరణీ! -
ఆంధ్రభాషలో వ్యాకరణమునకు
ఆదరు వెయ్యది ధరణీ - అయ్యో!...
నుక్కులు టుక్కులు దిక్కు మాలును
యడాగమంబులు సడలిపోవును
పడుప్రయోగము పాడై పోవును
కుసంధు లికపై కుప్పతిప్పలగు ....॥

ఇత్యాదిగా రోదిస్తుంటారు. మూడోరంగంలో సూరి బోధనశక్తిని గురించీ, ఆయన మరణానంతర పరిస్థితి గురించీ చర్చలు జరుగుతాయి. నాలుగోరంగంలో బండి అలాగుండే శవవాహనం తయారుచేసి దానికి ''శకట రేఫ పల్యంకిక/అర్ధానుస్వారాల అనంతశయన''మని పేరు పెట్టారు. ఆదేశాలూ, ఆగమాలు రెండు వైపులా కాడిగా ఉంటాయి. వ్యాకరణ గ్రంథాలను తలకింద పెట్టి తలపైన సూత్రాల కట్టనూ కారికలనూ, అరసున్నాలనూ అనుసంధిస్తారు. అన్నిటికన్నా పైన పూర్ణానుస్వార ముంటుంది. ''సూరి మరణము చూడగా రండి!'' అనే పాట మొదలవుతుంది. అయిదో రంగంలో మహాప్రస్థాన యాత్ర. ఉరేగింపుతోబాటు కింది పాట కూడా వినిపిస్తుంది :

''ఒక్కడవే వెళ్ళి పోకూ - మా సూరి - ఒక్కడవె.
దిక్కు నీవే నన్న నుక్కులూ టుక్కులూ
ఆశ్రయించుకవున్న అరసున్నగుంపులూ
నిండు భక్తిని గొల్చు బండి రాదండులూ
ప్రక్క తోడుగనుండ పంపుదుము నీతోడ - ఒక్కడవె ......

పై రచన దుర్భావదూషితమనీ రాక్షసమనీ నిందించవచ్చుగాని, పండితమండలిలో కూడా తన మరణానంతర సమయంలో ఇంత తీవ్ర విద్వేషాన్ని పెంచగలిగిన సూరి అధికార ప్రదర్శన విషయం కూడా ఆలోచించవలసివుంటుంది.

సూరి జీవితకాలంలో ప్రచురితమైన మహాకావ్యాల సంఖ్య చాలా తక్కువ. అప్పట్లో భాషా పరిశోధన, పాఠ పరిష్కరణలు ప్రాథమిక దశలో ఉండేవి. ప్రాచీన కావ్యాలు, పురాతన రచనలు (శాసనాలు) భిన్న పాఠ భేదాలలో లభ్యమై ప్రచురితమైన తరువాత, సూరి శిష్యులూ భక్తులూ అనుయాయులూ ప్రాచీన సాహితీ రూపాలను పరిష్కరించి, సవరించిన విషయం, అతడి వ్యాకరణ సూత్రాల కనుగుణంగా వాటిని దిద్ది వేసినవైనం బయట పడ్డ తరువాత, ఎందరో పరిశోధకులకు సాహిత్యానికి జరిగిన ద్రోహం తెలిసి

వచ్చిన తరువాత, తిరుగుబాటు ప్రజ్వరిల్లింది. ఈ పాపం చేసినవారు తాము 'పరిష్కర్తల' మని చెప్పుకున్నారు. సూరిని అభిమానించిన అనేక విద్వాంసులు కూడా ఈ దుష్కార్యాన్ని ఏవగించుకున్నారు. 1895లో వేదం వేంకటరాయ శాస్త్రి (1853-1929) తాను రచించిన ప్రచురించిన నాగానందంలో, మొట్టమొదటి సారిగా నీచ పాత్రల చేత సూరి నిషేధించిన 'గ్రామ్య రూపాలు' పలికించాడు. ఆ కాలపు విద్వజ్జనానికి వేంకటరాయ శాస్త్రి మకుటంలాంటి వ్యక్తి. ఇందుకు ఎంత వ్యతిరేకత వచ్చిందో, అంత ఆనుకూల్యమూ వచ్చింది. పండితలోకం రెండుగా చీలి పోయింది. ఈ ఒక్క విషయంలో తప్ప పండిత ప్రకాండుడైన వేంకటరాయ శాస్త్రి చిన్నయసూరితో మరి ఏ విధంగానూ విభేదించలేదు. సంస్కృతరూపకాల్లో ప్రాకృత రూపాలను వాడినట్లే తాను నీచ పాత్రలకు గ్రామ్యం వాడానన్నాడు. అయినా సూరి నెలకొల్పిన సంప్రదాయానికి వచ్చిన ప్రమాదాన్ని చర్చించటానికి 1898 డిసెంబరులో మద్రాసులో ఒక పండిత పరిషత్తు సమావేశమయింది. ఒకవైపు ఈ సంప్రదాయ వ్యతిరేకతను కొందరు ఖండిస్తుంటే మరో వైపు సృజనాత్మక రచయితలు వేంకటరాయ శాస్త్రి మార్గాన్ని అనుసరించటం మొదలు పెట్టారు సంఖ్యాధికంగా.

1847లో వెలువడ్డ రెండు మహా రచనలు పరిస్థితిని తలకిందులుగా మార్చి వేశాయి. అందులో ఒకటి గురజాడ వేంకట అప్పారావు రచించిన 'కన్యాశుల్కం' అనే మహత్తర నాటకం. అందులో (సూరి ఆమోదించిన నవ్యసాంప్రదాయిక భాషారూపాలకు విరుద్ధంగా) పాత్రలన్నీ సమకాలిక భాషలోనే ప్రసంగించాయి. రెండోది సూరి శిష్యులే ప్రయోగించిన 'అవ్యాకృత ప్రయోగా'లను ఖండిస్తూ గిడుగు వేంకటరామమూర్తి ప్రచురించిన 'ఆంధ్ర పండితభిషక్కుల భాషాభేషజ' మనే విమర్శ వ్యాసం. ఇది ప్రచండ వివాదానికి దారి తీసింది - 1910 నుంచి. రవీంద్రనాథ ఠాకుర్ వంగభాషలో మొదలు పెట్టిన 'చలిత్ భాషా' ఉద్యమం నుంచి స్ఫూర్తి పొందిన నూతన భాషా సంప్రదాయవాదులు, సూరి నిరంకుశ సంప్రదాయం మీద ధ్వజమెత్తారు. ప్రధానంగా వారి వాదనలు మూడు.

1. వచనరచనలనూ శాస్త్రగ్రంథాలనూ సమకాలిక వ్యవహారభాషలో శిష్టులు సంభాషణల్లో ఉపన్యాసాల్లో వినిపించే రూపాల్లో రాసే సంప్రదాయాన్ని భగ్నం చేయరాదు. 'పరిష్కరించ' రాదు.
2. సూరి చెప్పే ప్రాచీన కావ్య భాషా రూపాలు ఆధునిక శాస్త్ర విజ్ఞానాభివృద్ధికి పనికి రావు. ఆధునిక ప్రామాణిక భాషనే వాడాలి.

3. వెయ్యేళ్ల నాటి భాషాభేదాన్ని నేర్చుకోవటం, అర్థం చేసుకోవటం, ప్రయోగించటం వర్తమాన కాలంలో జీవించే మహాపండితులకే సాధ్యం కాదు కాబట్టి అది ప్రయోగానర్హం.

గిడుగు వేంకటరామ మూర్తి సూరి ప్రియతమాభిమానులయిన సమకాలిక రచయితల గ్రంథాల్లోని అవ్యాకృత ప్రయోగాలను ఎత్తిచూపటం మొదలు పెట్టాడు. సూరి సూత్రీకరణలు ఎంతగా చరిత్ర విరుద్ధాలో, కృతక రూపాల వాడుక సాహిత్యంలో సృజనాత్మకతను ఏ విధంగా ధ్వంసం చేస్తోందో నిరూపించాడు. వైరి పక్షాలు పోటీ సంఘాలు స్థాపించుకొని సూరి నిర్దేశించిన ప్రాచీన భాషా రూపాల పరిశీలనకూ నిబంధనల సవరణకూ ప్రభుత్వం వెంట పడ్డాయి. గ్రాంథిక వ్యావహారిక వాదాలను సమర్థిస్తూ, వ్యతిరేకిస్తూ అనేక గ్రంథాలు వెలువడ్డాయి. బహిరంగ సభలు జరిగాయి. ప్రభుత్వానికీ, విశ్వవిద్యాలయానికీ నివేదికలు సమర్పితమైనాయి. చిట్టచివరకు 1924 అక్టోబరు 14వ తేదీన సూరి సమర్థకులూ అతడి సిద్ధాంతాలూ తలవంచక తప్పలేదు. సూరి ప్రవచనాలూ ఆచరణలూ సమాజంలో ద్విభాషా పరిస్థితిని కల్పించి సాహితీ విద్యాపరిపాలనరంగాల్లో నవకల్పనలనూ సృజనాత్మకతనూ విధ్వంసం చేసి ఉండేవి. సూరి అనూయాయుల వాదాలు వీగిపోగానే ఆ ప్రమాదం తప్పింది. అయినాసరే సాహితీ విద్యారంగాల్లో నూట పాతిక సంవత్సరాల పైకాలం అవిచ్ఛిన్న నిరంకుశ పాలన చేయగలిగిన అతడి శక్తిని మెచ్చుకోక తప్పదు. ఆ శక్తిని బలహీన పరచటానికి దేశంలోని శిష్టజనులూ ప్రసారమాధ్యమాలూ సాహితీప్రియులూ అసంఖ్యాకంగా కలిసి మహోద్యమం నిర్వహించవలసి వచ్చింది. అతడొక భాషా సాహితీ నియంతగా 1855లో భాషా పరిణామాభివృద్ధుల కొక దిశానిర్దేశం చేసి ఆ పరిణామ క్రమాన్ని కనీసం వెయ్యేళ్లు వెనక్కు నడిపి, తన మరణానంతరం అర్ధ శతాబ్దాధిక కాలం దాని సహజ పరిణామాన్ని స్తంభింపజేయగలిగాడు. మరో అర్ధ శతాబ్దం తరువాత - నేటికూ్కడా - ఆయన అభిమానులు అనేకులున్నారంటే అతడు సాధించింది అసామాన్య విజయమనక తప్పదు.

# 5. సూరి సాహితీసేవ

సూరి రచనలను సవిమర్శకంగా పరిశీలించి వాటిలోని లోపాలనూ గుణాలనూ ఆయన వ్యక్తిత్వాన్నీ సమకాలిక సాహితీచరిత్రలోని సాధారణ లక్షణాలతో పోల్చి చూసినప్పుడుగాని తెలుగు భాషా సాహిత్యాలకు ఆయన చేసిన సేవలనూ, భాషా చరిత్రలో ఆయన స్థానాన్నీ నిష్పాక్షికంగా అంచనా వేయలేం.

సూరి ఆచారపరుడనీ, విష్ణుభక్తుడనీ, శ్రమజీవి అనీ చెప్పటం వివాదాస్పద విషయం కానేకాదు. పదహారు సంవత్సరాల వయసు నిండిన తరువాత అక్షరజ్ఞాన సంపాదన మొదలుపెట్టి స్వయంకృషి ద్వారా కేవలం రెండు దశాబ్దాల కాల పరిమితిలో తన సాటి పండిత సమాజంలో గౌరవప్రద స్థానం పొందగలిగన వ్యక్తి. తనకు జరిగిన అవమానాలనూ, సాంఘికాసమానతనూ మౌనంగా సహించాడు. అగ్రవర్ణాలవారి ఛాందసత్వాన్నీ సంస్కృత భాషా పాండిత్యాన్నీ ఆ విషయాల్లోనే అధిగమించాలనే ఆరాటంతో ప్రాచీనత మీద అభిమానం పెంచుకున్నాడు. ఈ రెండు గుణాలనూ ఏకాగ్రబుద్ధితో సాధించాడు. సమాజంలో ఉన్నతస్థితికి చేరుకోవటానికి తనకు పయోగపడని వ్యక్తినిగానీ అనుకూలంగాని విషయాన్నిగానీ తన దరిదాపులకు రానీకుండా జాగ్రతపడి మరే నూతనాంశాన్నీ తన మనసుకు హత్తుకోనీ లేదు. ఈ ప్రయోజన సాధన లో ఇసకలో తలదూర్చిన ఉష్ట్ర పక్షిలా బతికాడు. తన చుట్టూ జరుగుతున్న మరే పరిణామాన్నీ గమనించలేదు. అనుక్షణ పరివర్తనశీలమైన ప్రపంచంలో ప్రజానీకానికి ఏయే అవసరాలుంటాయో ఆలోచించలేదు. తన పరిమిత ప్రపంచంలో నిఘంటు వ్యాకరణ

సాహితీ విషయాలు మాత్రమే తనకు ప్రధానమనుకున్నాడు. సాధారణ ప్రజల సామాజిక రాజకీయార్థికాభివృద్ధి అనే విషయం అతడి ఆలోచనా పరిధిలో లేనేలేదు. మనకు తెలిసినంతలో అతడు మదరాసు నగరం దాటి ఎరగ డేనాడూ. ఇతర ప్రాంతాల ఆంధ్రమాండలిక భాషా వైవిధ్యాన్ని గురించిన ప్రాథమిక పరిజ్ఞానమయినా అతడికి లేదు. కావాలనుకున్నట్లూ లేదు. బహుశా తన వైష్ణవ జనం తప్ప మరే ప్రాపంచిక విషయమూ పట్టని అతడి ఏకాంత జీవనంవల్ల భక్తబృందం దృష్టిలో అతడే మహర్షిగా భాసించినా, తదితర ప్రపంచం సహజంగానే అతణ్ణి పట్టించుకోలేదు. తన సంకుచిత పరిధి కావల సమాజంలో అతడి స్థానం శుద్ధశూన్యం-పూర్ణానుస్వార మాత్రం. తనకున్న ఈ బలహీనతను కప్పి పుచ్చుకోటానికి అతడు అధికారం ద్వారా పలుకుబడివల్ల తనకు తోడ్పడగలిగిన కొద్ది మంది శ్రేయోభిలాషులమీద ఆధారపడి, వారి ద్వారా తన అభిప్రాయాలను సమాజం మీద రుద్దగలిగాడు. ఈ విషయంలో అతడు విజయం సాధించినా సమాజదృష్టిలో అది ప్రమాదకర పరిణామ మయింది. అందువల్లనే అతడికి తోడ్పడ్డ శక్తులు బుద్ధి మార్చుకొన్న తరవాత, అంతర్ధానమైన తరవాత అతడి మీద లోకానికి ద్వేషం పుట్టింది. వెక్కిరించి విషక్రిమిని లాగా విసరి వేసింది. అతడి వ్యక్తి స్వభావంలో ఇదో మచ్చ.

మరణానంతరం కొన్ని దశాబ్దాల పాటు సూరికి బ్రహ్మరథయోగం పట్టింది. ఒక వర్గం పండితులు అతడి కసాధ్యమైన దేదీ లేదని విశ్వసించారు. అందువల్ల యత్కృతమో తెలియని గ్రంథజాలాన్ని తమకు సర్వజ్ఞు డనిపించిన సూరి రచనలుగా భావించారు. ఆ పద్ధతిలోనే పట్టాభిరామశాస్త్రి రాసిన ఆంధ్రధాతుమాలను చిన్నయసూరి కృతిగా భావించి, సూరి చిత్రపటమని నమ్మిన బొమ్మతో సహా ప్రచురించారు. మరుక్షణం ఆ చిత్రపటం సుప్రసిద్ధ సాహితీ విమర్శకుడైన తంజనగరం తేవప్పెరుమాళ్లయ్యదని సాక్ష్యాధారాలతో బయటపడింది. వ్యాకరణకర్తగా, నిఘంటునిర్మాతగా, సాహిత్య విమర్శకుడుగా, భాషాపోషకుడుగా, పరిపాలకుడుగా, విశేషించి పదుల సంఖ్యలో దేశభాషా పండితులను పోషించి వారి సహాయంలో అనేకాంధ్ర కావ్యాలను ప్రచురించిన మహావ్యక్తిగా సి.పి.బ్రౌనుకు అఖండ గౌరవ మర్యాదలు దక్కాయి. సూరి అభిమానులు బ్రౌన్ అంతటి విద్వాంసుడు కాగలిగాడంటే అతడి విద్యాగురువు సూరి తప్ప మరెవ్వరూ కాలేరని తమ విశ్వాసమే వాస్తవమన్నట్లు ప్రచారం చేశారు. 1840లో బ్రౌను చిన్నయసూరిని పరోక్షంగా తనపనిలో నియోగించాడని, రెండు సార్లు అతణ్ణి కులం పేరుతోనే వ్యవహరించాడనీ, చిన్నయ నెన్నడూ సూరి అని పిలవలేదనీ, గురుమూర్తి శాస్త్రిని మహామేధావి అని అభివర్ణించాడనీ, తనకు బోధించిన వారినేగాక తనతో చర్చించిన, తనకే విధంగానయినా సాయపడిన వారందరినీ కృతజ్ఞతాపూర్వకంగా ప్రస్తుతించాడనీ

చెప్పటానికే నిర్ద్వంద్వమైన లిఖిత సాక్ష్యాలు లభిస్తున్నాయి. తక్కిన పాశ్చాత్య వ్యాకర్తలకూ నిఘంటుకారులందరికీ లాగానే బ్రౌనుకు సూరిమీద లేశ మాత్ర గౌరవం కూడా లేదనీ వారిద్దరికీ ఎలాంటి సాన్నిహిత్యమూ లేదనీ రుజువయింది. చిన్నయ అభిమానులు ప్రభుత్వ మతనికి 'సూరి' అనే బిరుదు ప్రసాదిస్తూ అతని పాండిత్య సేవలకు గుర్తింపుగా లండన్ నగరం నుంచి దిగుమతి చేసిన బంగారు కడియాలు తొడిగి గౌరవించిందని ప్రచారం చేశారు. అది శుద్ధాబద్ధమని తేలింది. సూరి పాత్రికేయుడనీ తన సొంత ముద్రణాలయంలో ముద్రించి సుజనరంజని పత్రికను నడిపాడనీ కీర్తించారు. ఆ పత్రిక తొట్టతొలి సంచిక సూరి మరణానంతరం మూడేళ్ళకు వెలువడింది! దాని సంపాదకులు ముగ్గురూ అతడికన్నా ఉద్యోగంలో చిన్నవాళ్లయిన బడిపంతుళ్లు. ఆ తరువాత చిన్నయ ఒక మహానిఘంటువును నిర్మించాడనీ శబ్దరత్నాకరకారుడైన బహుజనపల్లి సీతారామాచార్యులు శిష్యుడుగా ఉండి గురువు గ్రంథాన్ని దొంగిలించా డన్నారు. ఇది సత్యదూరమైన దుష్ప్రచారమని ఇంతకు ముందే చర్చించి నిరూపించాం. మహోత్తమమని తాము ఆరాధించే వ్యక్తిత్వానికి ఇటువంటి అసత్య ప్రచారాలు అప్రతిష్ఠ తెస్తాయని వారు గ్రహించినట్లు లేదు. అయినా వారి మనస్సులమీద అంత గాఢ ముద్రవేసిన సూరిని ప్రస్తుతించక తప్పదు. బడిపిల్లల పాఠ్యగ్రంథంలా తప్ప నీతిచంద్రికకు సాహిత్యంలో సమున్నత స్థానమేమీ లభించలేదు. అతడి ప్రయోగాత్మక రచనలకు ఏ ప్రభావమూ లేదు.

గ్రంథనామం దాని విశిష్టతను తగ్గించి చెప్పే బాలవ్యాకరణమే అతడి రచనలన్నిటిలోనూ నిస్సందేహంగా ఉత్కృష్టమయింది. సంస్కృత వ్యాకరణ శాస్త్రంలో విశేష పరిజ్ఞానముంటే తప్ప పూర్తిగా అర్థం కాదు. తెలుగు భాషా నిర్మాణక్రమం సంస్కృత వ్యాకరణమనే చట్రంలో ఇమిడ్చి చెప్పదగిందా కాదా అనే ఆలోచనను సూరి దరికి రానే లేదు. ప్రపంచించి, సంక్షేపించి, తెలుగు భాషా లక్షణాలను సవరించి అన్య భాషా వ్యాకరణ లక్షణాలకు అనువర్తించి తెలుగు వ్యాకరణగ్రంథం రాయగలిగిన సూరి శక్తి సామర్థ్యాలకు సంప్రదాయ పండితులు ముగ్ధులైనారు. దానికి సంస్కృతానువాద ముంటే ఆ గ్రంథ ప్రశస్తి మరింత పెరుగుతుందని శిష్టు కృష్ణమూర్తి శాస్త్రి (1800-1870) దాన్ని శ్లోక రూపంలో అనువదించాడు! (ఇటువంటి అద్భుతాలు చేయగలవాడన్న కీర్తి నతడు తన జీవితకాలంలోనే సంపాదించగలిగాడు. రాత్రికిరాత్రి అశ్వశాస్త్రం రచించి తప్పుడుసుదులున్న ఈ గుర్రాన్ని కొనవద్దని ఆస్థాన పండితులు నిషేధిస్తే దాని మీదనే మోహపడ్డ రాజకుమారుణ్ని సంతృప్తి పరచటానికి శాస్త్రి ఆ పని చేశాడనే ప్రవాదముంది.) ఆ అనువాద గ్రంథం హరికారికావళి. అది బాలవ్యాకరణానికి అక్షరాక్షరానువాదం. తన రచన ఎటువంటిదని కృష్ణమూర్తిశాస్త్రి వర్ణించేవాడో చెప్పలేం గానీ, అది దురాగ్రహంలో ఉన్న కల్లూరి వేంకటరామ శాస్త్రి వంటి ప్రతిద్వంద్వి చేతిలో పడ్డ తరవాత

చిన్నయసూరికి వ్యతిరేకంగా బలీయమైన ఆయుధంగా ఉపయోగ పడ్డది. ఇలా వివరించడం ఉభయపక్షాలనూ ఇబ్బంది పెట్టని సమాధాన రూపకమైన అభిప్రాయ ప్రకటన. కృష్ణమూర్తి శాస్త్రి సమకాలికుడైన వేదం వేంకటరమణ శాస్త్రి హరికారికలు సూరి బాల వ్యాకరణమనే మౌలికగ్రంథానికి సంస్కృతానువాదమేనని సాక్ష్యం చెప్పినా కల్లూరి వారి నిరాఘాట వాదబలం కారణంగా వివాదం ద్వాదశ వర్షాలు నడిచింది. ఈ వ్యవహారమంతా సాక్షాత్తు దేవభాషలోకే అనూదితమయిందని బాల వ్యాకరణానికి ఇతోధిక ప్రతిష్ఠను సంపాదించిపెట్టింది. వివాదం వివరాలు మనకంతగా చర్చనీయాలు కావు.

సూరి వ్యాకరణ సూత్రాలను వ్యాఖ్యానించటంలో అనుసరించటంలో పండితులు పోటీ పడ్డారు. ఆ సూత్రాల్లో అనేక విద్యారహస్యా లున్నాయన్నారు. నాటికొక పవిత్రత నాపాదించారు. జనరంజకా లయినా ఉన్నతస్థాయిరచన లయినా కాకపోయినా సమకాలిక రచనలనేగాక ప్రాచీన కావ్యాలను కూడా సామెతలు జాతీయాలవంటి వాటితో సహా అక్షరక్రమంలో అభివ్యక్తిలో సూరి సూత్రార్థాలకు పరిపడేట్లు 'దిద్దటం' అనే దుష్కార్యానికి ఈ విపరీత గౌరవభావం దారి తీసింది. ఇది మళ్లీ ప్రచండధిక్కారానికి దారిచూపింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ నియంతృత్వ విధానం అంతర్గత వైరుధ్యంలా భాసించింది. ఈ పద్ధతి చివరకు చిన్నయసూరినే బాధించింది. నీతిచంద్రిక తరవాత వెలసిన బాలవ్యాకరణంలోని సూత్రాల కనుగుణంగా తొలి రచనలోని భాషారూపాలను సూరి మరణానంతరం ఆయన బావమరిదే 'పరిష్కరించి' ప్రచురించాడు! తమ తమ శిక్షణ పరిజ్ఞానాల పరిమితులకు లోబడి ఒక్కొ అభిమానిపండితు డొక్కొ విధంగా సూత్రాలనూ, సూత్రార్థాలనూ అర్థం చేసుకొని వ్యాఖ్యానించడంవల్ల ఈ వైషమ్యం ప్రబలింది. అయితే అన్ని సందర్భాల్లోనూ మూలసూత్రం 'ప్రమాణీకరణం'. సూరి అనుయాయులు భాషలు మారవని నిర్ణయించుకొన్నారు. కాకపోతే అవిద్యావంతుల వ్యవహారంలో 'భ్రష్టమై' పోతాయని విశ్వసించారు. అతడి వ్యాకరణ సూత్రాలకు విరుద్ధంగా ఉన్నదంతా 'గ్రామ్యం'. సూరికి మాండలిక భాషా రూపాలు అనిష్టం కాబట్టి వాటిని సాహితీ ప్రయోగాలనుంచి తొలగించాలన్నారు. వారి అభిప్రాయాలను ఏ వాద బలమూ మార్చలేదు. గిడుగు వేంకటరామమూర్తి వంటి మహనీయులు భాషలు చరిత్రగతిలో ఎలా మారాయో, లౌకిక సంస్కృతం వైదిక సంస్కృతంకన్నా ఎంత భిన్నమో, కాలగతిలో ప్రాచీన కావ్యాల్లోని భాషాశైలులు ఎన్ని విధాలుగా మారిపోయాయో నిరూపించినా వారికి నమ్మకం కుదరనే లేదు. ప్రభువు మీదకన్నా, అతడి సింహాసనం మీదనే ఎక్కువ భక్తిప్రపత్తులున్న ఒకానొక పండితవర్గం మొండికేసినంతగానూ తెలుగులోకన్నా సంస్కృత వ్యాకరణ శాస్త్ర సంప్రదాయాల మీద అధికారమున్న మరో విద్వన్మండలి

అడ్డం తిరుక్కున్నది. వాళ్లు పతంజలి వాక్యాలను సూరి అనుయాయుల వాదాలకు వ్యతిరేకంగా ఉద్ఘాటించారు. వారికి ఉదారబుద్ధులూ, సృజనాత్మక సాహితీకారులూ తమబలాన్ని జోడించి సాయపడ్డారు.

ఇంగ్లీషు విద్యార్జన అనేక నూతన విజ్ఞానావకాశాలను పెంచింది. విద్యావంతులు స్వాభావికంగానే ప్రతివిషయాన్నీ విమర్శ దృష్టితో పరిశీలించటం మొదలు పెట్టారు. భిన్న సామాజిక స్తరాలకూ కులాలకూ చెందిన వాళ్లు పాశ్చాత్య విద్యాభ్యాసం చేయటం ఎక్కువయింది. ఉపాధి సౌకర్యాలు కల్పించలేని సంస్కృత విద్యమీద ఆదరణ తగ్గింది. వార్తా పత్రికలూ రవాణా సాధనాలూ విస్తరించి ప్రాముఖ్యం సంపాదించి భిన్న ప్రాంతాల ప్రజలను సంఘటిత పరచి వారి మధ్యగల భాషాభేదాలను తగ్గించటం మొదలు పెట్టాయి. ప్రజల సౌందర్యదృష్టినీ శాస్త్రజ్ఞానతృష్ణనూ అభినవ సాహితీ రూపాలూ ప్రక్రియా భేదాలూ ఆకట్టుకొని సుసంపన్నం చేస్తున్నాయి. ఇవన్నీ కలిసి సూరి నిరంకుశ భాషాధికారాన్ని నిర్లక్ష్యం చేయటం మొదలుపెట్టాయి. అతడి అధికార గౌరవం క్రమంగా మెల్లగా బలహీనమయింది. ఈ మొత్తం పరిణామానికి సూరి మాత్రమే బాధ్యుడని నిందించటం అన్యాయం. సాధారణ ప్రజలు సంప్రదాయ జ్ఞాన పాండిత్యాల విషయంలో తమకు ఆదర్శప్రాయుడైన వ్యక్తిని ఆరాధిస్తారు. చాలా కాలం అర్థమేగాని మార్గంలోనే రాసినా, అన్యభాషా లక్షణాలకు అనుగుణంగా స్వభాషా గుణాలను వికృతీకరించి రాసినా, ఏ సమాజమూ శాశ్వతంగా ఎవరినీ గౌరవించలేదు.

తెలుగు భాషా చరిత్రలో తన వ్యాకరణరచనద్వారా పరవస్తు చిన్నయసూరి నిర్ద్వంద్వంగా సమున్నత స్థానం సంపాదించాడు. దాదాపు ఒకటిన్నర శతాబ్దం పాటు అతని మాట కెదురు లేదు. కాల పరిస్థితులు మారగానే అతడు చరిత్రపుటల మాటుకు పోయాడు. అతడి అభివృద్ధి అద్భుతం. పతనం కూడా అంతే. మనోభావాల్లో అతడు తమిళుడు; భాషను బట్టి ఆంధ్రుడు; స్వభావాన్ని బట్టి ఆర్యుడు. అతడీ మూడు జాతుల సంసృష్టి-సంకరం కాడు. అతడు గతంలో బతికాడు. వర్తమానంలో వర్ధిల్లాడు. భావిలో అదృశ్యు డైనాడు. తన జీవిత కాలంలో అతడు తనకు సాధ్యమైనంత వెనక్కు చూశాడు. వర్తమానంలో దృష్టిదోషంతో బాధపడ్డాడు. భవిష్యత్తులో అంధకారంలో కలిసి పోయాడు. తనకోసం తానే నిర్మించుకొన్న ఒంటిస్తంభం మేడలో బతికాడు. తన అభిమానులను తప్ప మరెవ్వరినీ చూడలేదు. భవిష్యత్తును సందర్శించనే లేదు. అతడి నరనరాల్లో నియంతృత్వం గడ్డకట్టింది. జీవద్భాషా వ్యవహర్తలు తనకన్నా ఎక్కువ అధికారదర్పాలు ప్రదర్శించగలరని ఊహించనైనా లేదు. అతడు చరిత్రలో జీవిస్తున్నా డిప్పుడు. సూరి దీర్ఘాయు వగుగాక!

# ప్రధానాధార గ్రంథాలు

## తెలుగు


ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి - సాహిత్యోపన్యాసములు-2, హైదరాబాదు, 1962.

గోపాలరెడ్డి, బండి (బంగోరె) - బ్రౌను లేఖలు, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి, 1977.

గోపాలరెడ్డి, బండి (సం.పా.) - బ్రౌనుజాబులు, నెల్లూర్ హిస్టారిక్స్, నెల్లూరు, 1973.

లక్ష్మణ రెడ్డి, వి - తెలుగు జర్నలిజం-అవతరణ-వికాసం, గోపీచంద్ పబ్లికేషన్స్, విజయవాడ, 1985.

రాధాకృష్ణ, బూదరాజు - వ్యావహారిక భాషా వికాసం, విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ, (1981, 1992, 1999).

వేంకటరమణ శాస్త్రి, దువ్వూరి - రమణీయము (బాల వ్యాకరణ సమీక్ష), వాల్తేర్, 1964.

వేంకటరావు, నిడుదవోలు - శ్రీ పరవస్తు చిన్నయసూరి జీవితము, వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, మదరాసు, 1953.


## ఇంగ్లీషు


Chatterjee, S.K. - Languages and Literatures of Modern India, Prakash Bhavan, Calcutta, 1962.

Reddy, G.N. - The Influence of English on Telugu Literature (1800-1950), Tirupati, 1988.



117696.
20/8/04

**పరవస్తు చిన్నయ సూరి** (1809-1862) తన జీవితకాలమంతా మద్రాసులో, ఆ పరిసరాల్లో గడిపాడు. సంప్రదాయ విద్యలో సంస్కృతాంధ్ర భాషల్లో మహా విద్వాంసుడనే ప్రశస్తి సాధించాడు. అతడి జీవితకాలంలో మూడోవంతుపైగా పాఠశాలల్లో, మదరాసులోని రాజధాని కళాశాలలో తెలుగు బోధించటంలో గడిచిపోయింది.

ఆయన ఆనుశాసనిక ధోరణిలో రాసిన బాలవ్యాకరణమూ వచనరచన నీతచంద్రికా అంతకుముందు పాఠ్యగ్రంథాలుగా ఉన్న సమస్త గ్రంథాలనూ తోసిరాజని నిర్బంధపాఠ్యగ్రంథాలుగా విద్యారంగంలో స్థానం సంపాదించాయి.

సూరి అనుశాసన విధానాలు నూతన కావ్యభాషా సంప్రదాయ స్థాపనకు దారితీసి అతడు రాసిన వ్యాకరణ సూత్రాలకనుగుణంగా ప్రాచీన మహాకావ్యాలను కూడా 'సరిదిద్దే' దుష్ట సంప్రదాయాన్ని నెలకొల్పాయి. సాధారణ ప్రజానీకానికి సుదూరంగా, తన అభిమానుల క్కూడా అందనంతటి ఎత్తున, తానే నిర్మించుకున్న ఒంటిస్తంభం మేడలో జీవితం గడిపిన విచిత్ర విద్వాంసుడాయన. సాహితీభాషా నియంతగా వ్యవహరించినప్పటికీ తెలుగు భాషా సాహిత్య చరిత్రల్లో ఆయన చిరస్మరణీయుడే.

ఈ గ్రంథ రచయిత బూదరాజు రాధాకృష్ణ (1932) వాల్తేరులోని ఆంధ్ర విశ్వకళాపరిషత్తునుంచి 1953లో బి.ఏ. (ఆనర్స్) డిగ్రీ పొందాడు. తరవాత 1965లో అదే విశ్వవిద్యాలయంనుంచి ప్రాచీనాంధ్ర శాసనభాషకు చారిత్రక వ్యాకరణం రాసి పిహెచ్.డి. పొందాడు. చీరాల్లోని డిగ్రీ కళాశాలలో పదిహేను సంవత్సరాలు ఆంధ్రోపన్యాసకుడుగానూ, హైదరాబాదులోని తెలుగు అకాడమిలో రెండు దశాబ్దాల పరిశోధన శాఖాధిపతిగాను, హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో రెండేళ్ళు తులనాత్మక సాహితీశాఖలో విజిటింగ్ ప్రొఫెసరుగాను, హైదరాబాదులోని ఈనాడు జర్నలిజం స్కూలుకు 1990-1999 మధ్యకాలంలో ప్రిన్సిపలుగానూ పనిచేశాడు.

అతడి అనేక రచనల్లో ప్రధానమైనవి ఇవి: వాస్తుపదకోశం (1968), ప్రాచీనాంధ్రశాసనాలు (1971), వ్యావహారిక భాషావికాసం (1972, 81, 92, 99) ఈనాడు భాషా స్వరూపం (1981), ఈనాడు వ్యవహారకోశం, సాహితీ వ్యాసాలు, భాషాశాస్త్ర వ్యాసాలు (1990). తెలుగు సాహిత్యం [illegible] నిఘంటువు అచ్చులో ఉంది.

Library IIAS, Shimla
TL 494.835 092 Su 77 R
00117696

Paravastu Chinnaya Suri (Telugu)

ISBN : 81-260-1075-4